శనివారం
15•2•2020
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 231
• పేజీలు : 14 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

Lalithaa
లలితా జ్యువెల్లరి
మార్ట్ ప్రై. లిమిటెడ్
విజయవాడ • వైజాగ్ • రాజమహేంద్రవరం
భీమవరం • కాకినాడ • తిరుపతి • హైదరాబాద్
చెన్నై • తిరువళ్లూరు • గుడియాత్తం • మదురై
తిరుచ్చి • పుదుచ్చేరి • కుంభకోణం
రామనాథపురం • కోయంబత్తూరు • సేలం
నాగర్‌కోవిల్ • ఈరోడ్ • బెంగళూరు

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

ఇది మామూలు ఆఫర్ కాదు..
చాలా నిజమైన ఆఫర్

Lalithaa
లలితా జ్యువెల్లరి
మార్ట్ ప్రై. లిమిటెడ్

మార్కెట్‌లో ఉన్న అన్ని ఆఫర్లను
లెక్కలోకి తీసుకుని పోల్చండి.

బంగారం ధరలు ఎక్కువగా ఉన్న
ఇప్పటి పరిస్థితుల్లో అందులోనూ,
ఈ పెళ్లిళ్ల సీజన్‌లో మీ కోసం
నా హృదయపూర్వక ఆఫర్!

బంగారు నగలపై
ఇప్పటికే ఉన్న మా అతి
తక్కువ తరుగులో (V.A) ఇంకా
2% తగ్గింపు

పరిమిత కాల ఆఫర్ ఇది

వజ్రాభరణాలపై క్యారెట్‌కు
రూ. 3000 తగ్గింపు
రూ. ~~46000~~ రూ. 43000 నుంచి
V.A. గ్రాముకు రూ.975 మాత్రమే



ఇతర షోరూంలు వీటిని
అనుమతిస్తున్నారా?
'లేదు' అంటే కారణమేంటి?

దీన్ని తప్పకుండా చదవండి!

ఎస్టిమేట్ స్లిప్ మరియు మొబైల్ ఫోటోను తీసుకునేందుకు మీకు అనుమతి నిరాకరిస్తే అందుకు ఏకైక కారణం: నగ ధరలో ఏదో దాపరికం ఉందని అర్థం! మీకు డబ్బులు ఊరికే రాలేదు! ఎస్టిమేట్ స్లిప్, మొబైల్‌లో ఫోటో కావాలని డిమాండ్ చేయండి. నాలుగైదు షోరూంలలో ధరలను, డిజైన్‌ను పోల్చి చూసి కొనండి. నిజం మీకే అర్థమవుతుంది.

గ్రాముకు రూ.100, రూ.150 తగ్గించి ఇవ్వడం, వాషింగ్ మిషన్ కుక్కర్ వంటి ఉచిత బహుమతులు ఇవ్వడం.. ఇవన్నీ అధిక ధరల నుంచి మిమ్మల్ని పక్కదారి పట్టించే ప్రయత్నాలే. నగల షోరూంలలో ఉచిత కుక్కర్లకు, ఐరన్‌బాక్సులకు పనేంటి? మళ్లీ మళ్లీ చెబుతున్నా.. కష్టపడి సంపాదించిన డబ్బును చేతులారా ఇస్తున్నారు. ఏ షోరూంలోనూ మిమ్మల్ని మోసగించేందుకు అవకాశం ఇవ్వకండి!

100% నాణ్యత - BIS 916 హాల్‌మార్క్ లక్షలాది డిజైన్లు!

హైదరాబాద్ (సోమాజిగూడ, కూకట్‌పల్లి) • విజయవాడ • వైజాగ్ • రాజమహేంద్రవరం • భీమవరం • కాకినాడ • తిరుపతి
చెన్నై • తిరువళ్లూరు • గుడియాత్తం • మదురై • తిరుచ్చి • పుదుచ్చేరి • కుంభకోణం • రామనాథపురం • కోయంబత్తూరు • సేలం • నాగర్‌కోవిల్ • ఈరోడ్ • తిరునెల్వేలి • బెంగళూరు

ఆదివారంతో పాటు 366 రోజులు షోరూమ్ తెరిచి ఉంటుంది!

## ఉసేన్ బోల్ట్‌ను తలదన్నాడు

- రికార్డును బద్దలు కొట్టిన కన్నడిగుడు
- 9.55 సెకండ్లలో 100 మీటర్లు పరుగెత్తిన శ్రీనివాస గౌడ

**బెంగళూరు:** ప్రపంచంలో అత్యంత వేగంగా పరుగెత్తే క్రీడాకారుడిగా జమైకాకు చెందిన ఉసేన్ బోల్ట్‌కు పేరుంది. 100 మీటర్ల దూరాన్ని కేవలం 9.58 సెకండ్లలో పూర్తి చేసి బోల్ట్ రన్నింగ్‌లో ప్రపంచ రికార్డు సృష్టించాడు. అయితే బోల్ట్ రికార్డును తలదన్నుతూ కర్ణాటకకు చెందిన శ్రీనివాస గౌడ(28) అనే గ్రామస్థుడు దున్నపోతులతో రన్నింగ్ చేసి సంచలనం సృష్టించాడు. కర్ణాటకలోని ఉడుపి, మంగళూరులో దున్నపోతులతో పరుగు పోటీలు(కంబల) నిర్వహిస్తుంటారు. బురద నేలల్లో ఈ క్రీడను నిర్వహిస్తారు. శ్రీనివాస గౌడ తన రెండు దున్నపోతులతో పరుగెత్తుతూ.. 142.50 మీటర్ల దూరాన్ని కేవలం 13.62 సెకండ్లలో చేరుకున్నాడు. అంటే 100 మీటర్లను కేవలం 9.55 సెకండ్లలో చేరుకుని బోల్ట్ కంటే మెరుగ్గా (0.03సెకండ్ల కంటే ముందుగా) పరుగెత్తాడు. ఈ సందర్భంగా శ్రీనివాస గౌడ మాట్లాడుతూ.. ఈ విజయం తన దున్నపోతుల వల్లే సాధ్యమైందని తెలిపాడు. కాగా దున్నపోతుల సాయంతో పరుగెత్తడం వల్లే శ్రీనివాస గౌడ తక్కువ సమయంలో గమ్యాన్ని చేరుకున్నాడని కొందరు నెటిజన్లు వాదిస్తుంటే, బురద నేలల్లో అత్యంత వేగంగా పరుగెత్తిన అతడికి ఒలింపిక్ క్రీడల్లో పాల్గొనేలా తర్ఫీదునివ్వాలని మరికొందరు సలహానిస్తున్నారు.



కంబల పోటీల్లో దున్నపోతులతో కలిసి పరుగెడుతున్న శ్రీనివాస గౌడ

## రిషి కులమేమిటి?

### బ్రిటన్ ఆర్థికమంత్రి కులంపై గూగుల్‌లో భారతీయుల ఆరా



**లండన్/న్యూఢిల్లీ:** బ్రిటన్ నూతన ఆర్థిక మంత్రిగా నియమితులైన ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి అల్లుడు, భారత సంతతికి చెందిన రాజకీయవేత్త 39 ఏండ్ల రిషి సునక్ కులమేమిటో తెలుసుకోవాలని భారతీయులు తెగ ఆరాటపడ్డారట. గత 24 గంటల్లో నమోదైన గూగుల్ ట్రెండ్స్‌లో ఈ విషయం వెల్లడైంది. బ్రిటన్ ఆర్థిక మంత్రిగా రిషి పేరు బయటకు వచ్చిన వెంటనే అత్యధిక మంది భారతీయులు ఆయన కులం, వంశానికి సంబంధించిన అంశాలను వెతికారని గూగుల్ తెలిపింది. కాగా ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ, స్టాన్‌ఫోర్డ్ వర్సిటీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన రిషి.. 2015లో బ్రిటన్ పార్లమెంట్‌లోకి తొలిసారి అడుగుపెట్టారు.

## గర్భిణి ప్రసూతి ఖర్చులు.. ఇకపై రూ.7,500 చెల్లింపు

**న్యూఢిల్లీ:** ప్రసూతి సేవల కోసం గర్భిణులకు ఇచ్చే ఖర్చుల మొత్తాన్ని రూ.7,500కు పెంచుతున్నట్టు ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పోరేషన్ (ఈఎస్‌ఐసీ) తెలిపింది. గురువారం నిర్వహించిన ఈఎస్‌ఐసీ సమావేశంలో కేంద్ర కార్మికశాఖ మంత్రి సంతోశ్ గంగ్వార్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొంది. ఇప్పటివరకూ ఈ మొత్తం రూ.5,000గా ఉన్నది. పెరిగిన జీవన వ్యయాన్ని పరిగణలోకి తీసుకొని ఈ పెంపు నిర్ణయం తీసుకున్నట్టు అధికారులు వెల్లడించారు. ఈఎస్‌ఐసీ దవాఖానలు, ఆరోగ్య కేంద్రాల్లో ప్రసూతి సేవలు అందుబాటులో లేని సందర్భంలో ఇతర దవాఖానల్లో ఆయా సేవల్ని వినియోగించుకునే గర్భిణీలకు ఈఎస్‌ఐసీ ఈ మొత్తాన్ని చెల్లిస్తున్నది.



# ఆర్నెళ్లు డెడ్‌లైన్

- త్రిసభ్య ధర్మాసనంలో విచారణ
- మరణశిక్షపై నేరస్థుల అప్పీళ్ల విచారణపై సుప్రీంకోర్టు నూతన మార్గదర్శకాలు
- నిర్భయ దోషుల ఉరి జాప్యం నేపథ్యంలో నిర్ణయం.. వినయ్‌శర్మ పిటిషన్ కొట్టివేత



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:** నిర్భయపై లైంగిక దాడి, హత్య కేసులో నలుగురు దోషులకు ఉరిశిక్ష అమలుపై తీవ్ర జాప్యం జరుగుతున్న నేపథ్యంలో.. మరణశిక్షకు సంబంధించిన కేసుల్లో నేరస్థుల అప్పీళ్లపై విచారణను వేగవంతం చేసేందుకు సుప్రీంకోర్టు నూతన మార్గదర్శకాలు జారీచేసింది. ఉరిశిక్షపై దాఖలైన అభ్యర్థనపై విచారణ చేపట్టడానికి ఆర్నెల్లు (హైకోర్టు తీర్పు ప్రకటించిన తేదీ నాటి నుంచి) గడువును విధించింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను శుక్రవారం ప్రజలకు అందుబాటులో ఉంచింది. హైకోర్టు ఉరిశిక్షను విధించిన/ సమర్థించిన సందర్భాల్లో సంబంధిత కేసును సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించిన తరువాత, అప్పీల్ సిద్ధమైందా లేదా అన్నదానితో సంబంధం లేకుండా ఆరు నెలల్లోగా త్రిసభ్య ధర్మాసనం ముందుకు సంబంధిత అప్పీల్ విచారణకు వస్తుందని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. ఉరిశిక్షకు సంబంధించి స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలైన వెంటనే.. కేసుకు సంబంధించిన రికార్డులను 60 రోజుల్లోగా పంపాలని సంబంధిత కోర్టుకు సుప్రీంకోర్టు రిజిస్ట్రీ సమాచారం పంపనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. అలాగే, అదనపు పత్రాలు అవసరమైన పక్షంలో కక్షిదారులు 30 రోజుల్లోగా వాటిని సమర్పించాలని రిజిస్ట్రీ కోరవచ్చని తెలిపింది. ఒకవేళ అదనపు పత్రాలు దాఖలుచేయకపోతే ఆ అంశాన్ని సంబంధిత న్యాయమూర్తి దృష్టికి తీసుకువెళ్తారని వివరించింది. న్యాయపరమైన లొసుగులను వినియోగించుకుని నిర్భయ దోషులు తమ ఉరిశిక్షను జాప్యం చేయడానికి ప్రయత్నిస్తుండడం పట్ల ప్రజల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. తదుపరి ఉత్తర్వులు జారీచేసే వరకు దోషులు ముకేశ్ కుమార్ సింగ్, పవన్ గుప్తా, వినయ్‌కుమార్ శర్మ, అక్షయ్‌కుమార్‌లకు ఉరిశిక్ష అమలుపై స్టే విధిస్తూ ట్రయల్‌కోర్టు జనవరి 31న ఆదేశాలు జారీచేసింది.

### నిర్భయ దోషి పిటిషన్ కొట్టివేత

తన క్షమాభిక్ష పిటిషన్‌ను రాష్ట్రపతి తిరస్కరించడాన్ని సవాల్ చేస్తూ నిర్భయ కేసులో ఉరిశిక్ష పడిన దోషుల్లో ఒకడైన వినయ్ శర్మ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. క్షమాభిక్ష తిరస్కరణపై న్యాయ సమీక్ష కోరేందుకు ఎలాంటి ఆధారాల్లేవని పేర్కొంటూ జస్టిస్‌లు ఆర్ భానుమతి, అశోక్ భూషణ్, ఏఎస్ బోపన్నతో కూడిన త్రిసభ్య ధర్మాసనం పిటిషన్‌ను శుక్రవారం కొట్టేసింది. దీంతో తనకు న్యాయపరంగా ఉన్న అన్ని అవకాశాల్ని వినయ్ వినియోగించుకున్నట్టు అయింది. అతని ఉరిశిక్ష అమలుకు మార్గం సుగమమైంది. 'రాష్ట్రపతి ముందు దోషి పెట్టుకున్న క్షమాభిక్ష పిటిషన్‌లో అన్ని అంశాలు పొందుపరిచారు. అయినప్పటికీ, ఆ పిటిషన్ తిరస్కరణకు గురైంది. క్షమాభిక్ష తిరస్కరణపై న్యాయ సమీక్ష కోరేందుకు ఎలాంటి ఆధారాల్లేవు. దీంతో క్షమాభిక్ష పిటిషన్‌ను సవాల్ చేస్తూ దోషి దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టేస్తున్నాం' అని ధర్మాసనం తెలిపింది. వినయ్ శర్మ మానసిక పరిస్థితి సరిగా లేదని, జైల్లో అతడిని మానసికంగా వేధించడంతో తీవ్ర ఒత్తిడిలో ఉన్నాడని.. ఈ విషయాల్ని పరిగణలోకి తీసుకోకుండా రాష్ట్రపతి అతడి క్షమాభిక్ష పిటిషన్‌ను తిరస్కరించారని వినయ్ శర్మ తరపు న్యాయవాది ఏకే సింగ్ కోర్టుకు తెలిపిన విషయం తెలిసిందే. అయితే, కేంద్రం తరపున వాదనలు వినిపించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ వాదనల్ని ఖండించారు. దోషి వినయ్ మానసికంగా ఆరోగ్యంగానే ఉన్నాడని పేర్కొంటూ.. వినయ్ శర్మ మానసిక పరిస్థితిపై బుధవారం వైద్యులు ఇచ్చిన నివేదికను కోర్టుకు సమర్పించారు. ఆధారాలన్నింటిని పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం వినయ్ పిటిషన్‌ను కొట్టేసింది.

## సొమ్మసిల్లి పడిపోయిన న్యాయమూర్తి



**నిర్భయ** కేసు దోషులను వేర్వేరుగా ఉరితీయాలంటూ కేంద్రం వేసిన పిటిషన్‌పై తీర్పు వెల్లడిస్తూ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్ భానుమతి శుక్రవారం సొమ్మసిల్లి పడిపోయారు. తీర్పును చదువుతున్న సమయంలో ఆమె కండ్లు తిరిగి పడిపోయారు. దీంతో ఇతర జడ్జిలు, కోర్టు సిబ్బంది హుటాహుటిన ఆమెను ఛాంబర్‌కు తీసుకెళ్లారు. కొద్ది క్షణాల తర్వాత న్యాయమూర్తి స్పృహలోకి వచ్చారు. ఆ తర్వాత కోర్టు ఆవరణలో ఉన్న వైద్య కేంద్రానికి ఆమెను చక్రాలకుర్చీలో తీసుకెళ్లి వైద్యం అందించారు. న్యాయమూర్తి ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉన్నదని కోర్టు వర్గాలు తెలిపాయి. తాజా పరిణామాల నేపథ్యంలో త్వరలోనే తీర్పును వెల్లడిస్తామని చెబుతూ.. కేసు విచారణను వచ్చే వారానికి వాయిదా వేస్తున్నట్టు ధర్మాసనం స్పష్టంచేసింది. అంతకు కొద్ది సేపటి క్రితమే నిర్భయ దోషి వినయ్ శర్మ పిటిషన్‌పై జస్టిస్ భానుమతి ధర్మాసనం తీర్పు వెల్లడించింది. పిటిషన్‌కు ఎలాంటి అర్హత లేదంటూ కొట్టివేసింది. ఆ తర్వాత కాసేపటికి నిర్భయ కేసు దోషులను వేర్వేరుగా ఉరితీయాలన్న కేంద్రం పిటిషన్‌ను విచారిస్తుండగా జస్టిస్ భానుమతి అస్వస్థతకు గురయ్యారు.

## అనాథాశ్రమంలో అగ్ని ప్రమాదం

### 13 మంది బాలల మృతి.. హైతిలో ఘటన

**పోర్ట్-ఔ-ప్రిన్స్:** హైతి రాజధాని పోర్ట్-ఔ-ప్రిన్స్ నగరశివారుల్లోని ఒక అనాథాశ్రమంలో అగ్ని ప్రమాదం సంభవించింది. ప్రమాద స్థలానికి ఫైరింజన్లు వచ్చేసరికి గంటన్నర సమయం గడిచిపోయిందని అనాథాశ్రమంలోని బాలల సంరక్షకురాలు రోస్ మారీ లూయిస్ చెప్పారు. దీంతో 13 మంది బాలలు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. పోర్ట్-ఔ-ప్రిన్స్ నగర శివారుల్లోని కెన్‌స్కాఫ్ ప్రాంతంలో చర్చి ఆఫ్ బైబిల్ ఆధ్వర్యంలో ఈ అనాథాశ్రమం నిర్వహిస్తున్నారు. మృతుల్లో ఏడుగురు చిన్నారులు ఆరేండ్ల లోపు వయస్కులని, మిగతావారు 10-11 ఏండ్ల లోపు వారని సమీప బాప్టిస్ట్ మిషన్ దవాఖాన వర్గాలు తెలిపాయి. సకాలంలో అంబులెన్స్ వచ్చి ఉంటే వారి ప్రాణాలు కాపాడగలిగే వారమని పౌర అధికారి ఒకరు చెప్పారు.

## మాలిలో సాయుధుల దాడి.. 20 మంది మృతి

**బమాకో:** సెంట్రల్ మాలిలోని ఒగొస్సాగొ గ్రామంపై సాయుధులు జరిపిన దాడిలో 20 మంది మరణించారు. సుమారు 30 మంది సాయుధులు ఈ దాడిలో పాల్గొన్నారని గ్రామాధినేత అల్యే ఒసుమానె బర్రీ తెలిపారు. గతేడాది మార్చిలో డొగోన్ మిలీషియాకు చెందిన వారు జరిపిన ఊచకోతలో ఇదే గ్రామానికి చెందిన 160 మంది మరణించారు. ప్రభుత్వ సైనిక బలగాలు లేని సమయంలో సాయుధులు ఈ దాడులకు తెగబడ్డారు.

# మీ త్యాగాలు మరువలేం

- పుల్వామా ఘటనకు ఏడాది పూర్తి
- నివాళులర్పించిన ఆసేతు హిమాచలం
- జవాన్ల సేవలను కొనియాడిన ప్రధాని మోదీ
- సైనికుల త్యాగాలను బీజేపీ వాడుకున్నది: కాంగ్రెస్



పుల్వామా అమరుల స్మారకార్థం జమ్ముకశ్మీర్‌లోని లెథ్‌పొరాలో సీఆర్పీఎఫ్ ఏర్పాటుచేసిన స్మారకం వద్ద శుక్రవారం నివాళులు అర్పిస్తున్న సైనికులు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:** పుల్వామా ఘటనలో అమరులైన 40 మంది జవాన్ల త్యాగాలను దేశం ఎన్నటికీ మరిచిపోదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ కొనియాడారు. గత ఏడాది ఫిబ్రవరి 14న జమ్ముకశ్మీర్‌లోని పుల్వామా జిల్లా లెథ్‌పోరా వద్ద సీఆర్పీఎఫ్ కాన్వాయ్‌పై జైషే మహ్మద్ ఉగ్రవాదులు కారుబాంబుతో దాడిచేసి 40 మంది జవాన్లను పొట్టనబెట్టుకున్న సంగతి తెలిసిందే. ఈ మారణహోమానికి శుక్రవారంతో ఏడాది పూర్తయింది. ఈ సందర్భంగా అమరవీరులకు ప్రధాని మోదీ, రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, కేంద్రమంత్రులు, నేతలు, దేశవ్యాప్తంగా ప్రజలు నివాళులు అర్పించారు.

### వారంతా గొప్ప వీరులు

ప్రధాని మోదీ స్పందిస్తూ.. పుల్వామా దాడిలో మరణించిన ప్రతి ఒక్కరూ 'గొప్ప వీరుల'ని కొనియాడారు. 'గత ఏడాది పుల్వామా ఘటనలో వీరమరణం పొందిన ప్రతి సైనికుడికి నివాళులు అర్పిస్తున్నా. వారంతా గొప్ప వీరులు. దేశ సేవలో భాగంగా, మాతృభూమి రక్షణ కోసం తమ విలువైన ప్రాణాలను త్యాగం చేశారు. వారి త్యాగాలను భారతదేశం ఎన్నటికీ మరువదు' అని మోదీ ట్వీట్ చేశారు. 'పుల్వామా దాడిలో అమరులైన సీఆర్పీఎఫ్ సిబ్బందికి నా నివాళులు. వారి త్యాగాలను దేశం ఎన్నటికీ మరువదు. ఉగ్రవాదంపై పోరులో దేశమంతా ఐక్యంగా ఉంటుంది. ఇలాంటివాటికి జడువకుండా మా పోరాటాన్ని కొనసాగిస్తాం' అని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ ట్వీట్ చేశారు. అమరవీరులకు హృదయపూర్వకంగా నివాళులు అర్పిస్తున్నట్టు ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో సహా పెకలించివేసేందుకు మనమంతా ఐక్యంగా ఉండాలని బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా పిలుపునిచ్చారు.

### త్యాగాలను రాజకీయాలకు వాడుకున్నారు



పుల్వామా ఘటనలో అమరులైన జవాన్ల త్యాగాలను బీజేపీ ఎన్నికల ప్రయోజనాలకు వినియోగించుకున్నదని కాంగ్రెస్ పార్టీ విరుచుకుపడింది. రాహుల్‌గాంధీ ట్విట్టర్‌లో స్పందిస్తూ ప్రశ్నల వర్షం కురిపించారు. 'ఈరోజు 40 మంది సీఆర్పీఎఫ్ అమర జవాన్లను గుర్తు చేసుకుంటున్నాం. అయితే.. 1. ఈ దాడి వల్ల ఎవరు ఎక్కువగా లబ్ధి పొందారు?. 2.ఈ ఘటనపై దర్యాప్తు ఎంతవరకు వచ్చింది? ఏం చర్యలు తీసుకున్నారు?. 3.నాటి ఘటనకు భద్రతావైఫల్యమే కారణమంటూ బీజేపీ ప్రభుత్వంలోని ఏ ఒక్కరూ ఎందుకు బాధ్యత వహించడం లేదు?' అంటూ ప్రశ్నించారు. ఈ ఘటనపై దర్యాప్తు నివేదికను ప్రజలకు ఎందుకు వివరించడం లేదని నిలదీశారు. సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరీ సైతం పుల్వామా దాడి నివేదికను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు దేశమంతా అమరులకు నివాళులు అర్పిస్తుంటే.. రాహుల్‌మాత్రం కేంద్రంపై, భద్రతాబలగాలపై విమర్శలు గుప్పిస్తున్నారని బీజేపీ మండిపడింది.

### 'పుల్వామా' స్మారకం

పుల్వామా ఘటనలో అమరులైన జవాన్లకు నివాళిగా జమ్ముకశ్మీర్‌లోని పుల్వామా జిల్లా లెథ్‌పొరా వద్ద ఉన్న సీఆర్పీఎఫ్ క్యాంప్‌లో స్మారకాన్ని ఏర్పాటు చేశారు. దాడిలో ప్రాణాలు కోల్పోయిన 40 మంది సైనికుల ఫొటోలను, వారి పేర్లను ఈ స్మారకంపై పొందుపరిచారు. దీనిని శుక్రవారం ప్రారంభించారు. మహారాష్ట్రకు చెందిన ఉమేశ్ గోపీనాథ్ అనే వ్యక్తి దాదాపు 61వేల కిలోమీటర్లు ప్రయాణం చేసి 40 మంది అమర జవాన్ల కుటుంబాలను కలిశారు. వారి ఇండ్ల నుంచి మట్టిని సేకరించి శుక్రవారం లెథ్‌పొరా క్యాంప్ వద్ద సీఆర్పీఎఫ్ అధికారులకు అప్పగించారు.

# భారత పరిశ్రమలపై కరోనా కాటు!

- మరో మూడు నాలుగు నెలల్లో నియంత్రించకపోతే తీవ్ర ప్రభావం
- చైనా నుంచి విడిభాగాల సరఫరాకు అంతరాయం
- పడిపోనున్న ఉత్పత్తి.. పెరుగనున్న ధరలు.. ఉద్యోగాలకు కోత పడే ప్రమాదం



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:** చైనాతోపాటు ప్రపంచదేశాలను వణికిస్తున్న కరోనా వైరస్ తీవ్రత ఇలానే కొనసాగితే భారత ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉన్నది. తమ ఉత్పత్తి కార్యకలాపాలపై ఇది పెను ప్రభావం చూపనుందని భారత పరిశ్రమలు భయందోళనలు వ్యక్తంచేస్తున్నాయి. వైరస్ నియంత్రణలో వచ్చే మూడు నాలుగు నెలలు అత్యంత కీలకమని, భారత్‌తోపాటు ప్రపంచవ్యాప్తంగా చాలా కంపెనీల భవిష్యత్తు దానిపైనే ఆధారపడి ఉన్నదని ఇండ్-ఆర్ఏ తాజా నివేదిక వెల్లడించింది. ఆ వ్యవధిలోగా వైరస్‌ను కట్టడి చేయలేకపోతే, ఆ ప్రభావం భారత కంపెనీలపై తీవ్రంగా ఉండనుందని తెలిపింది. 2003లో సార్స్ వైరస్ సంభవించినప్పటి కంటే ఇప్పుడు ఆర్థిక వ్యవస్థపై అధిక ప్రభావం పడుతుందని హెచ్చరించింది. నాడు చైనాపై ప్రపంచదేశాలు తక్కువగా ఆధారపడి ఉన్నాయని, నేడు చైనా ప్రపంచ తయారీ హబ్‌గా రూపాంతరం చెందిందని వివరించింది. ప్రపంచ జీడీపీలో చైనా వాటా దాదాపు 15 శాతమని, అక్కడి తయారీ రంగం కుంటుపడితే ఆ ప్రభావం అంతర్జాతీయంగా ఉంటుందని పేర్కొంది. ఆరు నెలల్లోగా చైనా ఆ వైరస్‌ను నియంత్రించలేకపోతే.. దాని ప్రభావం తీవ్రంగా ఉంటుందని మార్కెట్స్‌మోజోడాట్‌కామ్ సీఐవో సునీల్ డమానియా వ్యాఖ్యానించారు. 2020 ఆర్థిక సంవత్సరానికి ప్రపంచ జీడీపీ 20 బేసిస్ పాయింట్ల వరకు తగ్గవచ్చని తెలిపారు.

### భారత్‌పై ఎంతమేరకు..

ఆర్థిక మాంద్యంతో భారత్ ఇప్పటికే సతమతమవుతున్నది. చైనాలో తయారయ్యే విడిభాగాలపైనే దేశంలోని కీలక రంగాలు ఆధారపడిన నేపథ్యంలో మరిన్ని కష్టాలు ఎదురుకానున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరానికి 6.5 శాతం వృద్ధిరేటును భారత్ అంచనావేస్తున్నది. అయితే కరోనా వైరస్ నేపథ్యంలో చైనా నుంచి కీలక విడిభాగాల సరఫరాకు ఇలానే అంతరాయం కొనసాగితే ఆ అంచనాలు నీరుగారే అవకాశం ఉన్నది. ఆటోమొబైల్స్, కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్, డ్రగ్స్, ఫార్మాస్యూటికల్స్ వంటి రంగాలపై తీవ్ర ప్రభావం పడనుంది. అనుబంధ రంగాలు దెబ్బతిననున్నాయి. సరఫరాకు అంతరాయం ఏర్పడడం వల్ల ఉత్పత్తి తగ్గడమే కాకుండా అమ్మకాలపైనే ప్రభావం పడనుంది. ఇది ఉద్యోగాల కోత, అధిక ద్రవ్యోల్బణానికి దారితీయనుంది. చైనాలోకి కంపెనీలు ఇప్పటికీ ఉత్పత్తిని పునరుద్ధరించకపోవడంతో ఆ ప్రభావం ఇప్పటికే భారత్‌లోని ఎలక్ట్రానిక్ గూడ్స్, ఫోన్ తయారీ కంపెనీలపై పడింది. పరిస్థితి ఇలానే కొనసాగితే ధరలు పెరిగే అవకాశం ఉన్నదని నిపుణులు పేర్కొంటున్నారు. మరోవైపు పరికరాల కొరత నేపథ్యంలో చైనా కంపెనీలు ధరలు పెంచుతుండడంతో ఆ ప్రభావం భారత కంపెనీలపై అధికంగా పడుతున్నది. స్మార్ట్‌ఫోన్ల మాదిరిగానే, ఆటోమొబైల్ కంపెనీలు కూడా చైనా నుంచి కీలకమైన విడిభాగాలను దిగుమతి చేసుకుంటున్నాయి. కరోనా వైరస్ కారణంగా చైనాలో ఆటోమొబైల్ రంగ ఉత్పత్తి 60 శాతం వరకు పడిపోయింది. దీని ప్రభావం భారత్‌తోపాటు ఇతర ప్రపంచ దేశాలపై పడనుందని బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ నివేదిక వెల్లడించింది. భారత్‌లో ఉత్పత్తి 8 శాతం వరకు పడిపోవచ్చని ఫిచ్ నివేదిక అంచనావేసింది. కాగా, కరోనా వైరస్ కారణంగా భారత్‌కు ఎదురుకానున్న మరో ప్రమాదం.. ఉద్యోగాల కోత. ఉత్పత్తి తగ్గిన నేపథ్యంలో పలు పరిశ్రమలు కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగించే ప్రమాదం ఉన్నది.

## ఆధార్-పాన్ లింక్ చేయకుంటే లాసే!

**న్యూఢిల్లీ:** ఆధార్ నంబర్‌ను పాన్ కార్డుతో వచ్చేనెల 31లోగా అనుసంధానించకపోతే ఆ పాన్ కార్డు పనిచేయదని ఆదాయం పన్ను (ఐటీ) శాఖ తెలిపింది. ఇప్పటి వరకు పాన్ కార్డు-ఆధార్ అనుసంధాన గడువును పలు దఫాలుగా పొడిగిస్తూ వచ్చిన ఐటీ శాఖ.. తాజాగా వచ్చేనెల 31 వరకు పొడిగించింది. గత నెల 27వ తేదీ వరకు పాన్ కార్డుతో ఆధార్‌ను అనుసంధానించిన వారు 30.75 కోట్ల మందికి పైగా ఉంటారు. అయినా, మరో 17.58 కోట్ల మంది ఆధార్, పాన్ కార్డును అనుసంధానించలేదని ఐటీ శాఖ తెలిపింది. మార్చి 31 లోపు ఆధార్ నంబర్‌తో అనుసంధానించిన పాన్ కార్డులు మాత్రమే పని చేస్తాయని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) శుక్రవారం ఒక నోటిఫికేషన్‌లో తెలిపింది.

# మరో భారతీయుడికి కొవిడ్

- జపాన్ నౌకలో వైరస్ బారిన మూడో వ్యక్తి
- చైనాలో 1,488కి చేరిన మృతుల సంఖ్య



కొవిడ్-19 వైరస్ ప్రభావం ప్రేమికుల రోజుపైనా పడింది. శుక్రవారం హాంకాంగ్‌లో ఓ ప్రేమజంట ఇలా మాస్కులు ధరించి కంటపడింది.

**బీజింగ్, ఫిబ్రవరి 14:** కొవిడ్-19(కరోనా వైరస్) భయాందోళనల నేపథ్యంలో జపాన్ తీరంలో నిలిపివేసిన 'డైమండ్ ప్రిన్సెస్' నౌకలో భారత్‌కు చెందిన మరో వ్యక్తికి వైరస్ సోకినట్టు జపాన్‌లోని భారత రాయబార కార్యాలయం శుక్రవారం వెల్లడించింది. ఇదివరకే ఇద్దరు భారతీయులు ఈ వైరస్ బారిన పడిన సంగతి తెలిసిందే. నౌకలో మొత్తం 218 మందికి వైరస్ సోకినట్లు జపాన్ అధికారులు వెల్లడించారు. గత నెలలో డైమండ్ ప్రిన్సెస్ నౌక నుంచి దిగిన హాంకాంగ్ ప్రయాణికుడికి కరోనా వైరస్ బయటపడిన నేపథ్యంలో.. గత వారం ప్రారంభంలో 3,711 మంది ప్రయాణికులతో జపాన్ తీరానికి చేరిన ఈ నౌకను ఆ దేశ అధికారులు అక్కడే నిలిపివేసి అందులోనివారికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 19 వరకు అందరినీ నౌకలోనే ఉంచనున్నారు. నౌకలో భారత్‌కు చెందిన 132 మంది సిబ్బంది, ఆరుగురు ప్రయాణికులు కూడా ఉన్నారు. వైరస్ సోకిన ముగ్గురు భారతీయుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఇండియన్ ఎంబసీ తెలిపింది. కాగా, పరీక్షల్లో 'నెగెటివ్' అని వచ్చిన 80 ఏండ్లు పైబడిన వృద్ధులను నౌక నుంచి తరలించేందుకు జపాన్ ప్రభుత్వం అనుమతించింది. నిర్దేశిత గడువు వరకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక వసతిలో వారిని ఉంచనున్నారు. అద్దాలు పూర్తిగా మూసివేసిన బస్సుల్లో శుక్రవారం మధ్యాహ్నం వారిని తరలించారు. అయితే ఈ క్యాటగిరీలో భారతీయులు ఎవరూ లేరు. కాగా, భారత్‌లో కరోనా పరిస్థితి నియంత్రణలోనే ఉన్నదని కేంద్ర వైద్య కార్యదర్శి ప్రీతీసూడాన్ తెలిపారు. వైరస్ నియంత్రణపై అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల వైద్య కార్యదర్శులతో ఆమె శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కేరళలో ముగ్గురికి కరోనా నిర్ధారణ కాగా, అందులో ఒకరు కోలుకుని డిశ్చార్జి అయ్యారు. మిగిలిన ఇద్దరూ చికిత్స పొందుతున్నారు. కరోనా వైరస్ నేపథ్యంలో ఈ నెల 16-29 వరకు ఢిల్లీ-హాంకాంగ్ సర్వీసులను రద్దుచేస్తున్నట్లు స్పైస్‌జెట్ ప్రకటించింది.

### ఒక్క రోజులో 121 మంది..

కరోనా వైరస్ కారణంగా చైనాలో మరణించిన వారి సంఖ్య 1,488కి చేరుకున్నది. గురువారం ఒక్కరోజే 121 మంది మృతిచెందగా, కొత్తగా 5,090 కేసులు నమోదయ్యాయి. దీంతో వైరస్ సోకిన వారి సంఖ్య 65,000కు పెరిగినట్లు చైనా జాతీయ వైద్య కమిషన్ అధికారులు వెల్లడించారు. మరోవైపు, కరోనా వైరస్‌తో ఆరుగురు హెల్త్ వర్కర్లు మరణించారని, మరో 1,716 మందికి వైరస్ సోకిందని తెలిపారు.

## ఖఫీల్ ఖాన్‌పై ఎన్ఎస్ఏ ప్రయోగం



**లక్నో:** కొద్దికాలం కిందట ఉత్తరప్రదేశ్‌లోని అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ వద్ద జరిగిన పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) వ్యతిరేక నిరసన కార్యక్రమంలో రెచ్చగొట్టే ప్రసంగం చేసినటు ఆరోపణలు ఎదుర్కొంటున్న డాక్టర్ ఖఫీల్‌ఖాన్‌పై పోలీసులు కఠినమైన జాతీయ భద్రతా చట్టాన్ని (ఎన్ఎస్ఏ) ప్రయోగించారు. ఆయన ప్రసంగం మతాల మధ్య చిచ్చుపెట్టేలా ఉన్నదని పేర్కొంటూ పోలీసులు ఇప్పటికే కేసు నమోదు చేసి జైలుకుపంపారు. ఈ కేసులో ఆయన శుక్రవారం బెయిల్‌పై విడుదల కావాల్సి ఉండగా.. ఇదే సమయంలో పోలీసులు ఎన్ఎస్ఏను ప్రయోగించారు.

## ఒమర్ నిర్బంధంపై సుప్రీంకోర్టు నోటీసులు

**న్యూఢిల్లీ:** జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లాను నిర్బంధంలో ఉంచడాన్ని సవాల్ చేస్తూ ఆయన సోదరి సారా అబ్దుల్లా పైలట్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం విచారించింది. కౌంటర్ దాఖలు చేయాలని జమ్ముకశ్మీర్ అధికార యంత్రాంగానికి నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణను మార్చి 2కు వాయిదా వేసింది. తన సోదరుడిని ప్రజా భద్రతా చట్టం(పీఎస్ఏ) కింద నిర్బంధించడం చట్టవిరుద్ధమని పేర్కొంటూ సారా అబ్దుల్లా సోమవారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. 'ఈ వ్యవహారంపై మీ తరపున ఎవరైనా జమ్ముకశ్మీర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారా? ఈ అంశంపై కేసులు ఏమైనా పెండింగ్‌లో ఉన్నాయా' అని కోర్టు ప్రశ్నించగా... సారా తరపు న్యాయవాది కపిల్ సిబల్ స్పందిస్తూ ఎవరూ దీనిపై హైకోర్టును ఆశ్రయించలేదన్నారు. ఈ నేపథ్యంలో నోటీసులు జారీచేసిన న్యాయస్థానం తదుపరి విచారణను పదిహేను రోజుల పాటు వాయిదా వేసింది.

# ఇదేం నాగరికం

- రుతుస్రావంతో వంటగదిలోకి రావద్దు, ఇతరులను తాకొద్దంటూ ఆంక్షలు
- అతిక్రమించారంటూ 68 మంది విద్యార్థినులకు రుతుస్రావ పరీక్ష
- గుజరాత్‌లోని ఓ మహిళా కళాశాలలో దారుణం





కళాశాల ముందు బాధిత విద్యార్థినులు.. (ఇన్‌సెట్) ప్రిన్సిపాల్ రీటా

**భుజ్, ఫిబ్రవరి 14:** నాగరిక ప్రపంచంలో.. సభ్యసమాజం తలదించుకునే ఘటన ఇది. మహిళలు ఓవైపు ఆకాశమే హద్దుగా ఎదుగుతున్నా.. అనాగరికపు 'రుతుస్రావ' ఆంక్షలు ఇంకా వెంటాడుతున్న సందర్భమిది. చదువు నేర్పి.. విద్యార్థులను వివేకవంతులను చేసి.. పోటీ ప్రపంచంలోని అవకాశాలను అందిపుచ్చుకొనేలా తీర్చిదిద్దే కళాశాలలోనే విద్యార్థినులకు జరిగిన ఘోర అవమానమిది. డిజిటల్ యుగంలో 1500 మంది విద్యార్థినుల సాక్షిగా.. 68 మంది యువతులకు 'రుతుస్రావ' పరీక్ష జరిగింది. విజ్ఞానం నేర్పాల్సిన గురువులే ఈ దారుణానికి కర్త, కర్మ, క్రియగా వ్యవహరించడం మరోదారుణం. గుజరాత్‌లోని భుజ్‌లో జరిగిన ఈ దారుణం ఇప్పుడు అందరినీ ఆలోచింపజేస్తున్నది. భుజ్‌లోని ప్రముఖ స్వామినారాయణ్ మందిర్ యాజమాన్యం 'శ్రీ సహజానంద మహిళా విద్యాసంస్థ' పేరుతో కళాశాల నిర్వహిస్తున్నది. ఇందులో దాదాపు 1500 మంది విద్యార్థినులు డిగ్రీ చదువుతున్నారు. వీరిలో 68 మంది గ్రామీణ ప్రాంత విద్యార్థినులు కాలేజీలో ఉన్న హాస్టల్‌లో వసతి పొందుతున్నారు. ఈ కాలేజీలోని విద్యార్థినులు రుతుస్రావ సమయంలో వంటగదిలోకి, ఆవరణలో ఉన్న ఆలయంలోకి వెళ్లకూడదని, కనీసం తోటి విద్యార్థినులను ముట్టుకోవద్దంటూ కఠిన ఆంక్షలు అమల్లో ఉన్నాయి. అయితే బుధవారం హాస్టల్‌కు చెందిన విద్యార్థినుల్లో కొందరు నిబంధనలు అతిక్రమించి వంటగదిలోకి వచ్చారని, తోటి విద్యార్థినులను తాకారంటూ వార్డెన్ ఆరోపించింది. ఈ విషయమై గురువారం కళాశాల ప్రిన్సిపాల్ రీటాకు ఫిర్యాదు చేసింది. దీంతో ప్రిన్సిపాల్ తరగతులు కొనసాగుతుండగానే.. 68 మంది హాస్టల్ విద్యార్థినులను బయటికి పిలిపించింది. వారిని మూత్రశాలల వద్దకు తీసుకెళ్లి వరుసలో నిల్చోబెట్టింది. హాస్టల్ వార్డెన్, కొందరు మహిళా అధ్యాపకులు కలిసి విద్యార్థులను ఒక్కొక్కరిగా వాష్‌రూమ్‌లోకి తీసుకెళ్లి వారి లోదుస్తులను విప్పాల్సిందిగా ఆదేశించారు. వాటిని పరిశీలించి రుతుస్రావం జరుగుతున్నదో లేదో నిర్ధారించి ఘోరంగా అవమానించారు. 'మేము బుధవారం హాస్టల్‌లో ఉండగా వార్డెన్ అంజలీబెన్ ఇదే విషయమై గొడవ చేసింది. గురువారం మేము తరగతి గదిలో ఉండగా బయటికి పిలిపించి మరోసారి ఘోరంగా అవమానించారు' అంటూ ఓ విద్యార్థిని తమకు జరిగిన దారుణాన్ని వివరించారు. 'చాలా రోజులుగా మమ్మల్ని ఇలాగే వేధిస్తున్నారు. ఎవరికైనా ఫిర్యాదుచేస్తే చదువు మధ్యలో ఆపేస్తామని, మా తల్లిదండ్రులను పిలిపించి ఇంటికి పంపిస్తామని బెదిరిస్తున్నారు' అని మరో విద్యార్థిని వాపోయింది. ఈ ఘటనపై నిజనిర్ధారణ కమిటీని వేసినట్టు 'క్రాంతిగురు శ్యామ్‌జీ కృష్ణవర్మ కచ్ యూనివర్సిటీ' ఇంచార్జి వీసీ డాక్టర్ దర్శన ఢోలకియా తెలిపారు. అయితే విద్యార్థుల సమ్మతితోనే ఇదంతా జరిగిందని, వారిని ఎవరూ వేధించలేదని చెప్పారు. మరోవైపు ఈ ఘటనకు సంబంధించి వార్డెన్, ఇద్దరు అధ్యాపకులపై కేసు నమోదు చేసినట్లు పశ్చిమ కచ్ ఎస్పీ సౌరభ్ టోలంబియా పేర్కొన్నారు. గుజరాత్ రాష్ట్ర మహిళా కమిషన్ ఈ ఘటనను సుమోటోగా స్వీకరించింది.

# జనాభా పెరుగుదలతో ముప్పు

### వెంకయ్యనాయుడు ఆందోళన

**న్యూఢిల్లీ:** దేశ జనాభా శరవేగంగా పెరిగిపోతున్నదని ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా పెరుగుదల వల్ల తలెత్తే విస్తృత విపరిణామాలపై చర్చించేందుకు రాజకీయ పార్టీలు వెనుకంజ వేయడం దురదృష్టకరం అని పేర్కొన్నారు. శుక్రవారం ఆయన భారత వ్యవసాయ పరిశోధనా సంస్థ (ఐఏఆర్ఐ) 58వ స్నాతకోత్సవంలో మాట్లాడుతూ గ్లోబల్ హంగర్ ఇండెక్స్‌లో భారత్ స్థానం పడిపోవడం ఆందోళన కలిగిస్తున్నదన్నారు. విధాన నిర్ణేతలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు ఆత్మశోధన చేసుకోవాలని తద్వారా దేశ ప్రజలకు ఆహార, పౌష్టికాహార భద్రత కల్పించాలని వెంకయ్యనాయుడు సూచించారు. 'మొత్తం ఆహార ధాన్యాల దిగుబడి 283.37 మిలియన్ టన్నులు ఉంది. ఇది సౌకర్యవంతమైన స్థాయి. అయినప్పటికీ గ్లోబల్ హంగర్ ఇండెక్స్‌లో భారత్ 102వ స్థానానికి పడిపోవడం ఆందోళనకరమైన అంశం' అని పేర్కొన్నారు. దీనిపై విధాన నిర్ణేతలు, పార్లమెంట్ సభ్యులు, వ్యవసాయ యూనివర్సిటీలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు తీవ్రంగా ఆలోచించాల్సి ఉందని చెప్పారు. పథకాల అమలులో వైఫల్యం, సరైన విధానాలు లేకపోవడం కారణమా? అన్న విషయం తెలుసుకోవాల్సి ఉందన్నారు. 1951లో కేవలం 51 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాల దిగుబడి మాత్రమే జరిగిందన్న సంగతి గుర్తుచేశారు. ఆహార ధాన్యాల దిగుబడిలో స్వావలంభన సాధించినా ఆహార భద్రత కల్పించలేకపోతున్నామని చెప్పారు. ఈ సమస్య పరిష్కారానికి తప్పనిసరి చర్యలు తీసుకోవాలని ఉపరాష్ట్రపతి చెప్పారు. భారతదేశంతోపాటు ప్రపంచానికి ఆహార భద్రత కల్పించేందుకు జనాభా పెరుగుదలతో తలెత్తే ఇబ్బందులతోపాటు ఆహార ధాన్యాల ఉత్పత్తిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు.

శనివారం
15•2•2020
కరీంనగర్

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD




## పనిచేసే రాష్ట్రాలను శిక్షిస్తారా?

### మంచి రాష్ట్రాలను ప్రోత్సహించకుండా నిరుత్సాహపరుస్తున్నారు

రాష్ట్రాలకు ఆర్థిక స్వేచ్ఛ ఇవ్వకపోతే 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ అసాధ్యం • ఎఫ్ఆర్బీఎం పరిమితిని 5 శాతానికి పెంచాలి

కేంద్రం ధైర్యంగా, సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోవాలి • విధానాల రూపకల్పనలో రాష్ట్రాలకు ప్రాధాన్యమివ్వాలి

ఇన్నోవేషన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇంక్లూజివ్ గ్రోత్‌తోనే అభివృద్ధి • ముంబై నాస్కామ్ సదస్సులో మంత్రి కేటీఆర్



ముంబైలో శుక్రవారం జరిగిన ఎన్టీఎల్ఎఫ్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐటీశాఖ మంత్రి కే తారకరామారావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

కేంద్రం నుంచి రాష్ట్రాలకు ఇచ్చే పన్నులవాటాను 15వ ఆర్థికసంఘం 42 శాతం నుంచి 41 శాతానికి తగ్గించడం.. పనిచేసే రాష్ట్రాలను శిక్షించడమేనని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు అన్నారు. దేశంలో ఆర్థిక క్రమశిక్షణతో చక్కగా పనిచేస్తున్న రాష్ట్రాలను ఇలాంటి సిఫారసులు నిరుత్సాహపరుస్తున్నాయని పేర్కొన్నారు. కేంద్రం పన్నులవాటాలో ఒక శాతం తగ్గించడం వల్ల తెలంగాణ రాష్ట్రం ఏకంగా రూ.4 వేల కోట్ల రూపాయలు నష్టపోతున్నదని తెలిపారు. 'బాగా పనిచేస్తున్న రాష్ట్రాలను శిక్షిస్తున్నట్టుగా మీరు (కేంద్రం) ఎందుకు వ్యవహరిస్తున్నారు? ఇది రాష్ట్రాలను పూర్తిగా నిరుత్సాహపరుస్తున్నట్లే. ప్రగతిశీల రాష్ట్రాలు ఎందుకు నష్టపోవాలి' అని మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. అక్షరాస్యత, వైద్యారోగ్యరంగాల వృద్ధి సూచికలో ముందున్నప్పటికీ.. కేంద్ర విధానాల వల్ల దక్షిణాది రాష్ట్రాలన్నీ ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని తెలిపారు. రాష్ట్రాలకు ఆర్థిక స్వేచ్ఛ ఇవ్వనప్పుడు 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ సాధ్యంకావడం సవాలేనని చెప్పారు. దేశాభివృద్ధికి ఇన్నోవేషన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇంక్లూజివ్ గ్రోత్ అనే 'త్రీ ఐ' మంత్రాన్ని పాటిస్తేనే సరికొత్త భారతావని నిర్మాణం సాధ్యపడుతుందని స్పష్టంచేశారు. శుక్రవారం ముంబైలో నాస్కామ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో నిర్వహించిన లీడర్‌షిప్ ఫోరం (ఎన్టీఎల్ఎఫ్) 2020 కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ పాల్గొన్నారు. మార్చ్ టు 5 ట్రిలియన్ డాలర్స్ ఎకానమీ, రియాల్టీ ఆఫ్ యాంబీషియస్ అన్న అంశంపై

మిగతా 4వ పేజీలో

## మంచిమొక్కలు నాటుదాం

### సీఎం జన్మదినాన కోటి మొక్కల కానుక

భారీగా ఏర్పాట్లుచేస్తున్న అధికారులు • రావి, వేప వంటి మొక్కలకు ప్రాధాన్యం

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:**

ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు జన్మదినం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆకుపచ్చ తెలంగాణ కోసం హరితహారం కార్యక్రమాన్ని చేపట్టిన సీఎం కేసీఆర్‌కు కోటి మొక్కలు నాటడం ద్వారా జన్మదిన కానుకను అందించేందుకు అందరూ సిద్ధమవుతున్నారు. ప్రభుత్వ అధికారులు, పౌరసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ కంపెనీలు, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, ప్రకృతి ప్రేమికులు ఈ నెల 17న మొక్కలు నాటడానికి పెద్దఎత్తున సన్నాహాలు చేస్తున్నారు. వందచెట్లను తొలగిస్తే పదివేల మొక్కలు నాటాలన్న సీఎం కేసీఆర్ స్ఫూర్తిదాయకమైన సందేశంతో ముందుకు కదులుతున్నారు. భవిష్యత్‌లో నీడను, ఫలాలను ఇచ్చే స్థానిక రకాలకు చెందిన మొక్కలనే నాటుదాం అని పలువురు పిలుపునిస్తున్నారు. అలంకృత (ornamental) మొక్కల కంటే సాధ్యమైనంత వరకు రావి, వేప, చింత, అల్లనేరేడు, తెల్లమద్ది వంటిరకాల మొక్కలను నాటుదామని సూచిస్తున్నారు. ముఖ్యమంత్రి జన్మదినం సందర్భంగా మొక్కలు నాటుదామని మంత్రి, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపునకు మంచి స్పందన వస్తున్నది. అన్నిశాఖల అధికారులు యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లుచేస్తున్నారు. మరోవైపు టీఆర్ఎస్ పార్టీలో కార్యకర్త నుంచి అత్యున్నతస్థాయి నేతల వరకు మొక్కలు నాటేందుకు సిద్ధమవుతున్నారు. దేశ, విదేశాల్లోనూ టీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు ఉత్సాహం చూపుతున్నారు. ఎంపీ సంతోష్‌కుమార్ నేతృత్వంలోని 'గ్రీన్ ఇండియా చాలెంజ్ 'నిర్వాహకులు మొక్కల పంపిణీ, అనువైన స్థలాన్ని ఎంపిక చేయడానికి తగిన సహకారాన్ని

మిగతా 5వ పేజీలో

## పుకార్లను నమ్మకండి
## చికెన్, గుడ్లు నిర్భయంగా తినండి




ప్రజలకు అతి తక్కువ ధరలో, అత్యంత విలువైన పోషకాహారాన్ని పౌల్ట్రీ పరిశ్రమ అందిస్తుంది. పౌల్ట్రీ పరిశ్రమపై ఆధారపడి ప్రత్యక్షంగా లక్షల కుటుంబాలు జీవిస్తున్నాయి. కోట్లాది మంది రైతులకు పౌల్ట్రీ రంగం పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్నది. అటువంటి పౌల్ట్రీ పరిశ్రమను దారుణంగా దెబ్బతీసేందుకు చికెన్ తినడం వలన కరోనా వ్యాపిస్తుంది అని సామాజిక మాధ్యమాల్లో పుకార్లు పుట్టించి, చికెన్ మరియు గుడ్లు తినడం పట్ల ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారు. కరోనా వైరస్‌కు చికెన్ మరియు గుడ్లు తినడానికి ఎటువంటి సంబంధం లేదనే సత్యాన్ని ప్రజలు గ్రహించాలి.


Government of India
Ministry of Fisheries, Animal Husbandry & Dairying
Department of Animal Husbandry & Dairying
Krishi Bhawan, New Delhi-110001

Dr Praveen Malik
Animal Husbandry Commissioner

Dated 10 February 2020

Yours sincerely,
(Praveen Malik)

Mr Vijay Sardana
Advisor
Poultry Federation of India
714, Mayur Vihar Phase II
New Delhi - 110091

### వాస్తవాలు తెలుసుకోండి

కరోనా (కోవిడ్-19) వైరస్‌కు చికెన్ మరియు గ్రుడ్లకు ఏ విధమైన సంబంధం లేదన్నది వాస్తవం.

చికెన్ మరియు గుడ్లు సురక్షితమని కేంద్ర ప్రభుత్వము, మహారాష్ట్ర ప్రభుత్వంతో పాటు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రకటించాయి.

చికెన్ మరియు గుడ్లను నిర్భయంగా తినవచ్చని, అవి ఎంతో సురక్షితమైన, బలవర్ధకమైన, మెరుగైన ఆహారమని డాక్టర్లు, పౌల్ట్రీ శాస్త్రవేత్తలు, పౌష్టికాహార నిపుణులు ధృవీకరించారు.

సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న పుకార్లను నమ్మకండి.

చికెన్ మరియు గుడ్లను నిర్భయంగా తినండి.

| చికెన్ | మటన్ | బీఫ్ | ఫిష్ |
| --- | --- | --- | --- |
| రూ.110* | రూ.700* | రూ.250* | రూ.400* |

ఒక కిలో మటన్ ధరతో దాదాపు ఏడు కిలోల చికెన్ కొనవచ్చు

ప్రజాశ్రేయస్సు దృష్ట్యా జారీచేసిన వారు :
తెలంగాణ పౌల్ట్రీ బ్రీడర్స్ అసోసియేషన్
డా. జి. రంజిత్ రెడ్డి, ప్రెసిడెంట్ :: జి. రమేష్ బాబు, జనరల్ సెక్రటరి

## మా తీర్పునే నిలిపేస్తారా?

- డీవోటీపై సుప్రీంకోర్టు ఆగ్రహం
- దేశంలో న్యాయం ఉన్నదా?
- ఏజీఆర్ బకాయిలపై టెల్కోలకు సమన్లు

**ఏజీఆర్** బకాయిలను చెల్లించాల్సిందిగా టెల్కోలను ఆదేశిస్తూ గతంలో తామిచ్చిన తీర్పుపై డీవోటీ డెస్క్ అధికారి స్టే విధించడాన్ని సుప్రీంకోర్టు తప్పుబట్టింది. బకాయిల విషయంలో టెల్కోలు తమ తీర్పును బేఖాతరు చేయడాన్ని, నిర్దేశిత గడువు (జనవరి 23)లోగా డీవోటీకి బకాయిలు చెల్లించకపోవడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. దీన్ని కోర్టు ధిక్కారంగా ఎందుకు పరిగణించకూడదో తెలుపాలంటూ వొడాఫోన్ ఐడియా లిమిటెడ్ (వీఐఎల్), భారతీ ఎయిర్‌టెల్, టాటా టెలీసర్వీసెస్ తదితర సంస్థలకు సుప్రీంకోర్టు శుక్రవారం సమన్లు జారీచేసింది. 'అసలు ఈ దేశంలో న్యాయం ఉన్నదా?' అని సర్వోన్నత న్యాయస్థానం ఘాటుగా ప్రశ్నించడంతో డీవోటీ దిద్దుబాటు చర్యలు చేపట్టింది. బకాయిలు చెల్లించని టెల్కోలపై బలవంతపు చర్యలు చేపట్టవద్దంటూ గతనెలలో జారీచేసిన ఉత్తర్వును తక్షణమే ఉపసంహరించుకొంటున్నట్టు డీవోటీ ప్రకటించడంతోపాటు ఏజీఆర్ బకాయిలన్నీ శుక్రవారం అర్ధరాత్రి 11:59 నిమిషాల్లోగా చెల్లించాలని ఆదేశిస్తూ టెల్కోలకు డిమాండ్ నోటీసులు పంపింది. ఈ ఆదేశం మేరకు ఈ నెల 20లోగా రూ.10 వేల కోట్లు చెల్లిస్తామని, మిగిలిన బకాయిలను వచ్చేనెల 17లోగా తీర్చేస్తామని ఎయిర్‌టెల్ తెలిపింది. డీవోటీ నోటీసులపై ఇతర టెలికం సంస్థలు ఇంకా స్పందించలేదు. 9

## నేడే సహకార పోరు

ఉదయం 7 నుంచి ఒంటిగంట వరకు పోలింగ్

మధ్యాహ్నం 2 నుంచి కౌంటింగ్.. సాయంత్రం ఫలితాలు వెల్లడి

భద్రత ఏర్పాట్లను సమీక్షిస్తున్న కలెక్టర్లు, ఎస్పీలు 4

| చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.) | | | |
| --- | --- | --- | --- |
| ఫారం ధర | 54.00 | రిటైల్ లైవ్ | 76.00 |
| డ్రెస్డ్ | 110.00 | స్కిన్‌లెస్ | 125.00 |

| గుడ్ల ధరలు (వందకు) (రూ.) | | | |
| --- | --- | --- | --- |
| హైదరాబాద్ | 395.00 | రంగారెడ్డి | 395.00 |
| మెదక్ | 395.00 | కరీంనగర్ | 398.00 |
| వరంగల్ | 398.00 | డజన్ ధర | 60.00 |

## సీతమ్మసాగరంగా దుమ్ముగూడెం బరాజ్!

ప్రతిపాదించిన నీటిపారుదలశాఖ 4

MARUTI SUZUKI ARENA

FEBRUARY OFFERS

THIS FEBRUARY, TAKE THE LEAP OF JOY.
IT'S THE RIGHT TIME TO BRING HOME YOUR FAVOURITE CAR.




Now BS6 compliant*

DZIRE SAVE UP TO ₹88 900* SWIFT SAVE UP TO ₹82 600*

DZIRE SWIFT

E-book today at www.marutisuzuki.com or visit your nearest Maruti Suzuki dealership | Maruti Suzuki vehicles now available under CSD & CPC' | For bulk order, mail at: nishant.vijayvergia@maruti.co.in

AUTHORISED DEALERS: TELANGANA STATE: ADARSHA: (KARIMNAGAR) CALL: 9133308022, (WARANGAL) CALL: 0870- 26553319. VARUN: (NIZAMBAD) CALL: 8462236236, (KARIMNAGAR) CALL: 0878 – 2950555. PAVAN: (NALGONDA) CALL: 8790902131. SRI JAYARAMA: (MEHABUBNAGAR) CALL: 8096998841. WIN MOTORS: (WARANGAL) CALL: 8688828002. E-OUTLETS: ADARSHA: (MANCHERIAL) CALL: 8886006633, (NIRMAL) CALL: 9133307720, (JAGITYAL) CALL: 8886776633, (GODAVARIKHANI) CALL: 8886556633, (ADILABAD) CALL: 7799784536, (JANGAON) CALL: 8886256633, (SIDDIPET) CALL: 9581656633. VARUN: (KAMAREDDY) CALL: 9966111132, (ARMUR) CALL: 9052022990, (KOTTAGUDEM) CALL: 9885260333. PAVAN: (MIRYALAGUDA) CALL: 8790902154, (KODADA) CALL: 8790902135. SRI JAYARAMA: (SHADNAGAR) CALL: 8096998841, (WANAPARTHY) CALL: 8096998841. MITHRA AUTO: (KHAMMAM) CALL: 8886063524. SAI SERVICE: (SANGAREDDY) CALL: 7331168888, (ZAHEERABAD) CALL: 7331168888.

*Offer includes consumer offer, exchange offer, retail support and corporate offer (wherever applicable). 2 years standard + 3 years extended warranty is free on Dzire Diesel (all variants) and Swift Diesel (all variants) and the above offers for the same are inclusive of the warranty offers. Terms and Conditions apply. The terms and conditions are subject to change without any prior notice. All offers are brought to you by Maruti Suzuki dealers only. Offers may vary from variant to variant. All offers shown are valid for limited period & for limited stock only. Accessories and features shown in the pictures may not be a part of the standard equipment and may vary according to the variant. Colors shown may vary from actual body colors due to printing on paper. Images used are for illustration purposes only. *BS6 variants available on select Petrol variants. Offers valid till 29th February 2020.

epaper.ntnews.com

# సీతమ్మ సాగరంగా దుమ్ముగూడెం!

- ప్రభుత్వానికి నీటిపారుదలశాఖ ప్రతిపాదన
- త్వరలో అధికారిక ప్రకటన



**హైదరాబాద్,నమస్తే తెలంగాణ:** గోదావరి నదిపై నిర్మించతలపెట్టిన దుమ్ముగూడెం బరాజ్‌కు సీతమ్మ సాగరంగా నామకరణం చేయాలని నీటిపారుదలశాఖ ప్రభుత్వానికి ప్రతిపాదించినట్టు తెలిసింది. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉన్నట్టు సమాచారం. ఖమ్మం జిల్లాలో గోదావరి నదిపై 37 టీఎంసీల సామర్థ్యంతో దుమ్ముగూడెం బరాజ్‌ను నిర్మించనున్నారు. జలవిద్యుత్ ఉత్పత్తికేంద్రాన్ని కూడా ఏర్పాటుచేసి.. ప్రభుత్వం దీనిని బహుళార్థ సాధక ప్రాజెక్టుగా చేపట్టనున్నది.

# అమరజవాన్ల త్యాగాలను మరువలేము

- పుల్వామా అమరవీరులకు ట్విట్టర్‌లో మంత్రి కేటీఆర్ నివాళి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పుల్వామా దాడిలో ప్రాణాలు కోల్పోయిన అమరజవాన్లకు మంత్రి కేటీఆర్ నివాళి అర్పించారు. పుల్వామా తరహా దాడులను క్షమించకూడదని పేర్కొన్నారు. అమర వీరుల త్యాగాలను ఎప్పటికీ మర్చిపోలేమన్నారు. 'విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన జవానుల కుటుంబాలకు అండగా నిలువడంలో తెలంగాణ ప్రభుత్వం ముందంజలో ఉంటుంది' అని ఆయన శుక్రవారం ట్వీట్ చేశారు.

# వణికిస్తున్న ఉత్తరగాలులు

- ఎండాకాలం ముందు చలిగాలులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** చలికాలంలో మొట్టమొదటిసారిగా తెలంగాణలో ఉత్తరదిశ నుంచి గాలులు వీస్తున్నాయి. రెండ్రోజుల క్రితం మొదలైన ఈ గాలులు మరో వారంవరకు కొనసాగవచ్చని వాతావరణశాఖ అధికారులు అంచనావేస్తున్నారు. ఈసారి చలికాలం మొదలైనప్పటి నుంచి ఉత్తరగాలుల జాడలేదు. ఈశాన్యం, నైరుతి, ఆగ్నేయదిశగా ఎక్కువగా గాలుల వీచాయి. దీనివల్ల ఈసారి డిసెంబర్‌లో కొన్నిరోజులు తప్ప పెద్దగా చలి తీవ్రత కనిపించలేదు. కానీ, ఈసారి అనూహ్యంగా ఎండాకాలం ప్రారంభంలో ఉత్తరగాలులు మొదలయ్యాయి. దీంతో రాష్ట్రంలో రాత్రిపూట కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీల వరకు పడిపోతున్నాయి. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మంగళ్‌పల్లిలో కనిష్ఠ ఉష్ణోగ్రత 11.8 డిగ్రీలుగా నమోదయింది. ఉప్పల్ సమీపంలోని మౌలాలి, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్, గిన్నెదారి, రంగారెడ్డి జిల్లా కేశంపేట, తొమ్మిదిరేకుల, కందుకూరు, రాచలూరు, షాబాద్ మండలం తాళ్లపల్లి, ఇబ్రహీంపట్నం ఎలిమినేడు, మేడ్చల్ జిల్లా భాగ్యనగర నందనవనం ప్రాంతాలలో 12 నుంచి 12.7 డిగ్రీలు నమోదయ్యాయి. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం 5.30గంటల వరకు హైదరాబాద్‌లో గరిష్ఠ ఉష్ణోగ్రత సాధారణ స్థాయికంటే 2 డిగ్రీలు పెరిగి 33.2 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 2 డిగ్రీలు తగ్గి 15 డిగ్రీలు, గాలిలో తేమ 28 శాతంగా నమోదైనట్టు అధికారులు వెల్లడించారు.



## ఉపాధి కార్మికులకు వేసవి కూలి పెంపు

- ఉత్తర్వులు జారీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఉపాధిహామీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం వేసవిలో చెల్లించే వేతనాన్ని పెంచింది. ఈ మేరకు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఫిబ్రవరి నుంచి జూన్‌వరకు సాధారణ పనులకు ఇచ్చే వేతనం కంటే 20 నుంచి 30శాతం అధికంగా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఫిబ్రవరిలో 20శాతం, మార్చిలో 25శాతం, ఏప్రిల్, మే నెలల్లో 30 శాతం, జూన్‌లో 20 శాతం అదనంగా కరువుభత్యం చెల్లించనున్నది. ఎండల తీవ్రత అధికంగా ఉండటం, పనిగంటలు తగ్గే అవకాశం ఉండటంతో ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది.

## నిబంధనల ప్రకారమే ఇంటర్ పరీక్షాఫీజులు

- బోర్డు సెక్రటరీ ఒమర్ జలీల్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో ఇంటర్మీడియట్ థియరీ పరీక్షల నిర్వహణకు అధిక ఫీజులు వసూలు చేయడం లేదని బోర్డు సెక్రటరీ సయ్యద్ ఒమర్ జలీల్ స్పష్టంచేశారు. నిబంధనల ప్రకారమే ఫీజులు వసూలు చేస్తున్నామని శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అధికఫీజులు వసూలు చేస్తున్నట్టు కొందరు సోషల్‌మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని.. అందులో ఏమాత్రం నిజం లేదని పేర్కొన్నారు. విద్యార్థులెవరూ ఆందోళన చెందవద్దని కోరారు.

## ఎంసెట్, ఈసెట్ కమిటీ సమావేశం నేడు

- వెంటనే పూర్తిస్థాయి షెడ్యూల్
- పీహెచ్‌సీ విద్యార్థులకు పరీక్షఫీజులో 50 శాతం రాయితీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కాలేజీలలో సీట్ల భర్తీ కోసం.. మే 4 నుంచి 11 వరకు నిర్వహించనున్న పరీక్షలకు సంబంధించిన పూర్తి షెడ్యూలు విడుదలకోసం టీఎస్ ఎంసెట్-2020 కమిటీ శనివారం సమావేశం కానున్నది. పరీక్షల దరఖాస్తుల స్వీకరణ గడువుతోపాటు ఇతర అంశాలకు సంబంధించిన పూర్తిస్థాయి షెడ్యూలును సమావేశం అనంతరం విడుదలచేస్తామని కన్వీనర్ ప్రొఫెసర్ గోవర్ధన్ తెలిపారు. పరీక్ష ఫీజులో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులతోపాటు పీహెచ్‌సీ విద్యార్థులకు కూడా 50 శాతం రాయితీ ఇస్తామని చెప్పారు. ఎంసెట్‌తో పాటు ఈసెట్ - 2020 కమిటీ సమావేశం కూడా నిర్వహించి షెడ్యూల్ విడుదల చేయనున్నారు.





శుక్రవారం ఎంసీఆర్‌హెచ్చార్డీలో జిల్లా కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లకు మున్సిపల్ చట్టం, పట్టణప్రగతిపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కే తారకరామారావు

# 21 రోజుల్లో ఇంటి అనుమతి

- ఏప్రిల్ 2 నుంచి టీఎస్ బీపాస్ అమలు
- పట్టణాల్లో ఆర్‌అండ్‌బీ రోడ్ల అభివృద్ధికి మున్సిపల్ నిధులు
- మూడురోజుల్లో వార్డు కమిటీల ఏర్పాటు
- లంచంలేకుండా ఇంటి అనుమతులివ్వాలి.. పనిచేయని వారిపై వేటు
- కలెక్టర్ల సమావేశంలో మున్సిపల్‌శాఖ మంత్రి కే తారకరామారావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

మున్సిపాలిటీల్లో ఇంటి నిర్మాణానికి 21 రోజుల్లో అనుమతి ఇవ్వాలని పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావు ఆదేశించారు. ఒకవేళ ఇంటికి అనుమతి ఇవ్వకపోతే అనుమతి నిరాకరించడానికి గల కారణాలను స్పష్టంగా తెలియజేయాలని చెప్పారు. శుక్రవారం ఎంసీఆర్‌హెచ్చార్డీలో జిల్లా కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లకు మున్సిపల్ చట్టం, పట్టణ ప్రగతిపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి హాజరైన మంత్రి కేటీఆర్ అధికారులకు దిశానిర్దేశంచేశారు. ఏప్రిల్ 2వ తేదీనుంచి మన రాష్ట్రంలో టీఎస్ బీపాస్‌ను అమలుచేస్తామని చెప్పారు. మార్చి నెలలో టీఎస్ బీపాస్‌లో ఉన్న అన్ని లోటుపాట్లను పరిశీలించాలని సూచించారు. టీఎస్ బీపాస్‌పై అన్నిస్థాయిల అధికారులకు, ప్రజలకు అవగాహన కలిగించాలని తెలిపారు. పైసా లంచం లేకుండా ఇంటి అనుమతినివ్వాలని ఆదేశించారు. 75 గజాలలోపు ఇంటి నిర్మాణానికి ఎలాంటి అనుమతి అవసరం లేదని స్పష్టంచేశారు. మున్సిపాలిటీ టౌన్‌ప్లానింగ్ ఈ విషయంలో చాలా సీరియస్‌గా ఉండాలని, పద్ధతి ప్రకారం అత్యుత్తమ పట్టణాలను రూపొందించాలని పేర్కొన్నారు. సరిగా పనిచేయని ఉద్యోగులపై కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### ఈ- ఆఫీసు ఏర్పాటుచేసుకోవాలి

పురపాలకశాఖకు చెందిన అధికారులు ఈ-ఆఫీసు ఏర్పాటుచేసుకోవాలని మంత్రి కేటీఆర్ తెలిపారు. సరిగ్గా పనిచేయని ప్రజాప్రతినిధులను పదవి నుంచి తొలిగించే అసాధారణ బాధ్యతను సీఎం కేసీఆర్ మున్సిపల్ చట్టం ద్వారా కల్పించిన విషయాన్ని కలెక్టర్లకు చెప్పారు. పట్టణాల అభివృద్ధిలో కలెక్టర్లు తమ విచక్షణాధికారిన్ని వినియోగించాలన్నారు. మున్సిపాలిటీల్లో వార్డు కమిటీలను మూడురోజుల్లో ఏర్పాటుచేయాలని స్పష్టంచేశారు. వార్డు కమిటీల ఏర్పాటులో రాజకీయాలు ఉండకూడదని తెలిపారు. పట్టణప్రగతి పకడ్బందీగా అమలుకావాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రం అనేకరంగాల్లో దేశానికే ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. పరిపాలనా సౌలభ్యం కోసం సీఎం కేసీఆర్ 33 జిల్లాలు ఏర్పాటుచేశారని, సిరిసిల్ల జిల్లా కేంద్రం అవుతుందని ఎప్పుడూ అనుకోలేదన్నారు. గతంలో కలెక్టర్లకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌తో పెద్దగా సంబంధాలు ఉండేవి కావని, సీఎం కేసీఆర్ నిర్ణయం పరిస్థితిని సమూలంగా మార్చిందని చెప్పారు. ప్రతి పౌరుడు కోరుకొనేలా రోడ్లు, మౌలిక సదుపాయాలు అందించాలని తెలిపారు. పచ్చదనాన్ని, ఆహ్లాదకరమైన వాతావారణాన్ని, ప్రజలకు ప్రణాళికాబద్ధమైన ప్రగతిని అందించాలని సూచించారు. ప్రజలు వ్యవస్థీకృత పట్టణాలను కోరుకుంటున్నారని, దీర్ఘకాలిక అభివృద్ధి కనిపించేలా పట్టణాలను తీర్చిదిద్దాలని చెప్పారు. పురపాలనలో సత్వర సేవల కోసం టీఎస్ బీపాస్, మీ సేవతోపాటు మరో కొత్త యాప్‌ను తీసుకొస్తామన్నారు. ఈ మూడు ప్రక్రియల ద్వారాగానీ, అధికారులను కలువడం ద్వారాగానీ ఇంటి నిర్మాణం అనుమతి లభిస్తుందన్నారు.

### మున్సిపాలిటీలపైనే దృష్టి

ఈ ఏడాదిలో రాష్ట్రంలో ఎన్నికలు లేవని, మున్సిపాలిటీలపైనే దృష్టి కేంద్రీకరిస్తామని మంత్రి కేటీఆర్ అన్నారు. పట్టణప్రగతిలో ఎన్ని వీలైతే అన్ని మున్సిపాలిటీలు తిరుగుతానని చెప్పారు. పట్టణాల్లో ఆర్‌అండ్‌బీ రోడ్లు సరిగా లేకపోతే, నిధులు లేవని ఆర్‌అండ్‌బీ చేతులెత్తేస్తే మున్సిపాలిటీ డబ్బులతో బాగుచేయాలని సూచించారు. ఒకవేళ మున్సిపాలిటీల్లో డబ్బులు లేకపోతే ప్రిన్సిపల్ సెక్రటరీతో మాట్లాడి, ఆయన సలహా ప్రకారం చేయాలని తెలిపారు. కొన్ని మున్సిపాలిటీలకు డబ్బులు కూడా ఉన్నాయని, ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా కూడా డబ్బులు వచ్చాయని చెప్పారు. హెచ్‌ఎండీఏ పరిధిలో నిధులు వస్తాయని తెలిపారు. అధికారాన్ని వికేంద్రీకరించామని, కలెక్టర్లుగా విచక్షణాధికారాన్ని ఉపయోగించుకొని నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

### ఖాళీలను భర్తీచేస్తాం

మున్సిపల్ కమిషనర్లు, ఇతర ర్యాంకు అధికారులను మూడు నెలల్లో భర్తీ చేస్తామని మంత్రి కేటీఆర్ చెప్పారు. ఈ పోస్టులను పురపాలకశాఖనే భర్తీచేయాలని సీఎం చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. ఎక్కడెక్కడ పనులు జరుగుతున్నాయో జాబితా సిద్ధంచేయాలని, అవసరమైతే పట్టణప్రగతితో ముడిపెడుతామని చెప్పారు. కార్యక్రమంలో ఎంసీఆర్‌హెచ్చార్డీ డీజీ బీపీ ఆచార్య, అడిషనల్ డీజీ అర్విందర్ సింగ్, పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి అర్వింద్‌కుమార్, సీడీఎంఏ సత్యనారాయణ, డీటీసీపీ ప్రాంతీయ సంచాలకుడు విద్యాధర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి పట్టణంలో గజ్వేల్ తరహా మార్కెట్

సీఎం కేసీఆర్ ఇటీవల కలెక్టర్ల సదస్సులో చెప్పినట్టు ప్రతి పట్టణంలో ఒక మోడల్ మార్కెట్‌ను ఏర్పాటుచేయాలని కేటీఆర్ ఆదేశించారు. గజ్వేల్ మోడల్ తరహాలో ఈ మార్కెట్లు ఉండాలన్నారు. పబ్లిక్ స్థలాల్లో పారిశుద్ధ్యాన్ని ఉత్తమంగా నిర్వహించాలని, శానిటేషన్ అభివృద్ధికి మల్టిపుల్ స్వీపింగ్‌చేయడం లేదా ఆ ఒక ముక్కవరకు ప్రైవేటైజేషన్‌చేయడం, ముఖ్యంగా చారిత్రక స్థలం, చారిత్రక కట్టడం, ముఖ్యమైన స్థలాలు, ప్రజలకు ఎక్కువగా సందర్శనకు వచ్చే స్థలాలు ఏవైనా ఆ ఒక్క భాగంవరకు ప్రైవేట్ శానిటేషన్‌కు ఇచ్చినా ఇబ్బందిలేదన్నారు. హైదరాబాద్‌లో చార్మినార్‌తోపాటు మరో 26 ప్రాంతాలను ప్రైవేటైజేషన్ చేశామని, మంచి ఫలితం వచ్చిందన్నారు. ఇలా వినూత్నంగా ఆలోచించాలని కోరారు. పోలీస్‌స్టేషన్లలో రిసెప్షన్ సెంటర్లు పెట్టారని, మున్సిపాలిటీల్లోనూ సిటిజన్ సర్వీస్ సెంటర్లు ఏర్పాటుచేశామని చెప్పారు. ఇవి ఎక్కడైనా లేకపోతే వెంటనే ఏర్పాటుచేయాలని సూచించారు. వచ్చిన వాళ్లను పద్ధతి ప్రకారం రిసీవ్‌చేసుకొని వారి సమస్యలను తెలుసుకొని సిటిజన్ గ్రీవెన్స్ మెకానిజంలో ఒక టోకెన్ నంబర్ ఇచ్చి, ప్రజావాణి తదితర వాటిల్లో రిజిస్టర్ చేసుకోవాలని, ఇలా వినూత్నంగా చేయాలని అన్నారు.

# నేడే 'సహకార' పోరు

- ఉదయం 7 నుంచి ఒంటిగంటవరకు పోలింగ్
- మధ్యాహ్నం 2 నుంచి కౌంటింగ్.. సాయంత్రం ఫలితాల వెల్లడి



ఆదిలాబాద్‌లో ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు తరలుతున్న సిబ్బంది

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రాథమిక సహకార సంఘాల(పీఏసీఎస్) ఎన్నికలకు సర్వంసిద్ధమైంది. శనివారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్.. మధ్యాహ్నం రెండుగంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ మొదలవనున్నది. రాష్ట్రవ్యాప్తంగా 747 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పరిధిలోని 6,248 డైరెక్టర్ పదవులకు ఎన్నిక జరుగనుండగా.. సుమారు 12 లక్షల మంది ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. ఈ మేరకు పోలింగ్‌కు అవసరమైన అన్నిరకాల ఏర్పాట్లను అధికారులు పూర్తిచేశారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి పోలింగ్ సిబ్బందికి సామగ్రిని అందజేయగా.. సాయంత్రానికే తమకు కేటాయించిన కేంద్రాలకు వారు చేరుకున్నారు. ఈ ఎన్నికల్లో 747 మంది గెజిటెడ్ అధికారులు ఎన్నికల అధికారులుగా వ్యవహరిస్తుండగా, మరో 20 వేల మందికి పైగా సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం ఒంటిగంటకు పోలింగ్ ముగిసిన అనంతరం 2 గంటల నుంచి కౌంటింగ్.. సాయంత్రం వరకు ఫలితాలను వెల్లడించనున్నారు. ఫలితాలు వెల్లడైన మూడురోజుల అనంతరం పాలకవర్గాల నియామకం చేపట్టనున్నట్టు రాష్ట్ర సహకారశాఖ ఎన్నికల అథారిటీ అధికారి సుమిత్ర వెల్లడించారు. చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక సందర్భంగా కోరం లేకుంటే, మరుసటి రోజు అవకాశం ఉంటుందని, ఆ రోజు కూడా కోరం లేకుంటే.. సమావేశానికి హాజరైన సభ్యుల్లో మెజార్టీ ప్రకారం చైర్మన్ నియామకం జరుగుతుందని ఆమె తెలిపారు. కాగా, ఈ ఎన్నికలకు ప్రభుత్వం పటిష్ఠ భద్రత ఏర్పాట్లను చేపట్టింది. జిల్లా స్థాయిలో కలెక్టర్లు, ఎస్పీలు స్వయంగా భద్రతా ఏర్పాట్లను సమీక్షించనున్నారు.

## రెండు ప్రైవేటు వర్సిటీలకు అనుమతి

- మల్లారెడ్డి మహిళా వర్సిటీ, టెక్‌మహీంద్ర వర్సిటీకి ఎల్వోఐ జారీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో రెండు ప్రైవేటు యూనివర్సిటీల ఏర్పాటుకు ప్రభుత్వం శుక్రవారం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. అందులో ఒకటి మల్లారెడ్డి విద్యాసంస్థల ఆధ్వర్యంలో మల్లారెడ్డి మహిళా యూనివర్సిటీ కాగా, మరొకటి టెక్ మహీంద్ర యూనివర్సిటీ. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో మల్లారెడ్డి మహిళా యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రభుత్వం లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్వోఐ) జారీచేసింది. తెలంగాణ యూనివర్సిటీ చట్టం 2018 ప్రకారం అన్నిరకాల నిబంధనలు అమలుచేయాలని ఎల్వోఐలో పేర్కొన్నారు. ఆరువారాల్లో పూర్తిస్థాయి నివేదికలు ప్రభుత్వానికి సమర్పించాలని సూచించారు. అన్ని అనుమతులు పూర్తిచేసిన తర్వాతే ప్రభుత్వం నుంచి తుది అనుమతులు లభిస్తాయి.

# పనిచేసే రాష్ట్రాలను శిక్షిస్తారా?

మూడోపేజీ తరువాయి...

టెక్‌మహీంద్రా ఎండీ సీపీ గుర్నానీ నిర్వహించిన చర్చలో మంత్రి ప్రసంగించారు. దేశం ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థికవ్యవస్థ సాధన దిశగా పయనించాలంటే తీసుకోవాల్సిన చర్యలు, రూపొందించిన విధానాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. తెలంగాణ కొత్త రాష్ట్రమైనప్పటికీ.. వేగంగా అభివృద్ధి చెందుతున్నదని, కేవలం సేవారంగంలోనే కాకుండా ఉత్పత్తి, వ్యవసాయరంగంలోనూ దేశ వృద్ధిరేటును మించి దూసుకుపోతున్న నేపథ్యంలో తెలంగాణ అనుభవాలను పంచుకోవాలని మంత్రి కేటీఆర్‌ను గుర్నానీ కోరారు. దేశాభివృద్ధిపట్ల తాను ఆశావహ దృక్పథంతో ఉన్నానని.. కేంద్రప్రభుత్వం భారీ లక్ష్యాన్ని అందుకోవాలంటే ధైర్యంతో కూడిన నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. కేంద్రప్రభుత్వం నుంచి ఇలాంటి నిర్ణయాలనే దేశం ఆశించిందని.. కానీ ప్రజల ఆకాంక్షల మేరకు తీసుకోలేకపోయిందని తెలిపారు. రెండుమూడేండ్లుగా దేశ ఆర్థికవ్యవస్థ మందగమనంలో ఉన్నదని.. కేంద్రం ఒప్పుకొన్నా.. లేకపోయినా.. ఆర్థికగణాంకాలు ఈ విషయాన్ని ధ్రువీకరిస్తున్నాయని చెప్పారు. కేంద్రప్రభుత్వం శషభిషలు వదిలిపెట్టి రాష్ట్రాలకు మరింత ఆర్థికస్వేచ్ఛ ఇవ్వాలన్నారు. రాష్ట్రాలు వేగంగా ఎదిగితేనే దేశం అభివృద్ధి చెందుతుందన్న సత్యాన్ని గుర్తించాలని అన్నారు. టీం ఇండియా, ఫెడరలిజం వంటి పదాలను ఆచరణలో చూపాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. ముఖ్యంగా ఫిస్కల్ ఫెడరలిజాన్ని కేంద్రప్రభుత్వం అనుసరించాలని డిమాండ్‌చేశారు. అభివృద్ధి కార్యక్రమాలకోసం భారీగా నిధులు ఖర్చుచేయనప్పుడు 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థికవ్యవస్థ లక్ష్యం కష్టసాధ్యమని తెలిపారు.

### జీఎస్టీ పరిహారమివ్వాలి

జీఎస్టీ చట్టంలో పొందుపరిచినవిధంగా రాష్ట్రాలకు 14 శాతం పరిహారం చెల్లించాల్సి ఉన్నదని మంత్రి కేటీఆర్ అన్నారు. న్యాయపరంగా ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. జీఎస్టీ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్రప్రభుత్వం త్వరలోనే బకాయిలను చెల్లిస్తుందన్న ఆశాభావాన్ని మంత్రి కేటీఆర్ వ్యక్తంచేశారు.




ముంబైలో నాస్కామ్ సదస్సులో భాగంగా టెక్ మహీంద్రా ఎండీ సీపీ గుర్నానీ నిర్వహించిన చర్చలో మాట్లాడుతున్న రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు

### రాష్ట్రాలకు ప్రాధాన్యమివ్వాలి

కేంద్ర ఆర్థికనిబంధనల సరళీకరణతోపాటు పలు విధానాల రూపకల్పనలోనూ రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రాధాన్యమివ్వాలని మంత్రి కేటీఆర్ కోరారు. ముఖ్యంగా సేవారంగం, పర్యాటకం, విద్యావైద్యరంగాల్లో కేంద్రం.. రాష్ట్రాలకు పూర్తి స్వేచ్ఛనివ్వాలన్నారు. ఉమ్మడి జాబితాలో ఉన్న అనేక అంశాలను రాష్ట్రాలకు బదిలీచేయాలని డిమాండ్‌చేశారు. సులభమైన నిబంధనలున్నప్పుడే ఇతర దేశాలతో తయారీ రంగంలో భారతదేశం పోటీపడగలుగుతుందని.. మనకన్నా చిన్నదేశాలైన బంగ్లాదేశ్ , వియత్నాం తదితర దేశాలు ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్ రంగాల్లో ముందున్నాయని తెలిపారు. కేంద్రం ప్రారంభించిన మేకిన్ ఇండియా.. అసెంబ్లింగ్ ఇన్ ఇండియాగా మారిందని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

### భారీ ప్రాజెక్టులు అవసరం

దేశ ఆర్థికవ్యవస్థ భారీగా వృద్ధిచెందాలంటే భారీప్రాజెక్టుల ఆలోచన చేయాలని మంత్రి కేటీఆర్ సూచించారు. ఇందులోభాగంగానే భారీగా సాగునీటి ప్రాజెక్టులతోపాటు ప్రపంచంలోనే పలు అతిపెద్ద ఫార్మా క్లస్టర్లలో ఒకటైన హైదరాబాద్ ఫార్మాసిటీ, దేశంలోనే అతిపెద్దదైన వరంగల్ టెక్స్‌టైల్ పార్కుల ఏర్పాటుతో ప్రపంచంతో పోటీ పడేందుకు తెలంగాణ సిద్ధమవుతున్నదని చెప్పారు. వీటికున్న జాతీయ ప్రాధాన్యం దృష్ట్యా కేంద్ర సహకారం కోరినా ఇప్పటిదాకా మద్దతు ఇవ్వలేదని తెలిపారు. జాతీయ ప్రాధాన్యం ఉన్న ప్రాజెక్టులనే పట్టించుకోనప్పుడు ఇక భారీ ఆర్థికవ్యవస్థ ఏర్పాటు లక్ష్యం ఎలా నెరవేరుతుందని మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు.

## ఎఫ్‌ఆర్బీఎం పరిమితిని పెంచాలి

ఆర్థికంగా పరిపుష్టంగా ఉన్న రాష్ట్రాలకు అప్పులు చేసుకొనే పరిమితిని ఐదుశాతానికి పెంచాలని మంత్రి కేటీఆర్ కోరారు. తెలంగాణ రాష్ట్రానికి ఇప్పుడున్న పరిమితిని 3.5 శాతాన్ని 5 శాతానికి పెంచాలన్నారు. 'మరింత అప్పులను తీసుకొనేందుకు కేంద్రప్రభుత్వం మాకు వెసులుబాటును కల్పించాలి. కావాలంటే.. తీసుకొన్న అప్పులను కేవలం ఉత్పాదకరంగంలో మాత్రమే వినియోగించాలని.. ఉచిత పథకాల కోసం వాడవద్దని షరతు విధించండి. అందుకు మేం సిద్ధంగా ఉన్నాం' అని కేటీఆర్ కేంద్రప్రభుత్వానికి స్పష్టంచేశారు. విదేశీ పెట్టుబడులను రాష్ట్రప్రభుత్వాలు నేరుగా తీసుకొచ్చేవిధంగా అనుమతించాలని డిమాండ్‌చేశారు. కేంద్రం విషయంలో ఫార్మాస్యూటికల్ పార్కులకు మద్దతు ఇవ్వడంలేదన్నారు. మౌలిక వసతుల కల్పనకోసం నిధులను సేకరించి ఖర్చుచేస్తే అప్పులు పెంచుతున్నారంటూ చేస్తున్న వాదన పాత సంప్రదాయ ఆలోచన అని.. అభివృద్ధి చెందిన ఆర్థికవ్యవస్థలు పెద్దఎత్తున ఖర్చుచేసినందునే అభివృద్ధి సాధ్యపడిందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.

## ద్వితీయశ్రేణి నగరాలకు ఐటీ కంపెనీలు

ఇప్పటికే ప్రముఖ నగరాలన్నీ మౌలిక వసతుల సంక్షోభందిశగా పయనిస్తున్న నేపథ్యంలో ద్వితీయశ్రేణి నగరాలకు ఐటీ కంపెనీలను విస్తరించాలని మంత్రి కేటీఆర్ కోరారు. ఇందుకోసం నాస్కామ్ ప్రత్యేక చొరువ చూపాలన్నారు. దీంతో కంపెనీల నిర్వహణవ్యయం తగ్గడంతోపాటు ఆయా నగరాల్లోని అద్భుతమైన ప్రతిభ, మానవవనరులను ఉపయోగించుకునే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. తెలంగాణ ద్వితీయ శ్రేణి పట్టణాలకు ఐటీని విస్తరించేందుకు చేస్తున్న ప్రయత్నం మంచి ఫలితాలను ఇస్తున్నదని, వరంగల్ నగరానికి ఐటీ కంపెనీల నుంచి మంచి స్పందన వస్తున్నదని, మరిన్ని కంపెనీలు అక్కడికి రావాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. వ్యవసాయరంగంలో ఆదాయం పెంచాల్సిన, రెట్టింపు చేయాలన్న ఆర్థికలక్ష్యం దిశగా తెలంగాణ వేగంగా ముందుకుపోతున్నదని, ఇతర రాష్ట్రాల్లో ఎక్కడా లేనివిధంగా రైతుబంధు, రైతు బీమా వంటి కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు. ప్రస్తుతం ఈ విషయంలో కేంద్రంతోపాటు ఇతర రాష్ట్రాలు కూడా తెలంగాణను ఆదర్శంగా తీసుకుంటున్నాయని మంత్రి కేటీఆర్ గుర్తుచేశారు.

### త్రీ ఐ మంత్ర

గతంలో ప్రధానమంత్రితో జరిగిన సమావేశంలో దేశాభివృద్ధికి త్రీ ఐ మంత్ర పాటించాలని సూచించిన విషయాన్ని మంత్రి కేటీఆర్ గుర్తుచేశారు. ఇన్నోవేషన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇంక్లూజివ్ గ్రోత్ అన్న మూడు అంశాల ద్వారానే సరికొత్త భారత్ నిర్మాణం సాధ్యమవుతుందని తెలిపారు. ఆవిష్కరణల రంగంలో ప్రపంచదేశాలతో పోటీపడేందుకు.. తెలంగాణ టీ హబ్ వంటి భారీ ఇంక్యుబేటర్‌ను నెలకొల్పిందన్నారు. దేశం వేగంగా ఎదుగుతున్నా, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగం మాత్రం అనుకున్న మేర విస్తరించడంలేదనిచెప్పారు. మౌలికరంగంలో 2014కి ముందు తెలంగాణలో రూ.50 వేల కోట్లు ఖర్చుచేస్తే తాము అధికారంలోకి వచ్చిన ఐదేండ్లలోనే సుమారు రూ.1.60 లక్షల కోట్లు ఖర్చు చేసినట్టు మంత్రి కేటీఆర్ వివరించారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కాళేశ్వరం వంటి భారీ ప్రాజెక్టులను చేపట్టి ఆర్థికప్రగతికి పాటుపడుతున్నామని తెలిపారు. పట్టణాలు, గ్రామాల మధ్య మరింత అంతరం లేకుండా సమాంతరంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉన్నదని, వర్క్‌ఫోర్స్‌లో మహిళా భాగస్వామ్యం పెరుగాలన్న మంత్రి కేటీఆర్.. ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన వీ హబ్‌ను ప్రస్తావించారు.

### మూలధనాన్ని సేకరించి ఖర్చుచేయాలి

తెలంగాణ లాంటి వేగంగా ఎదుగుతున్న రాష్ట్రాలకు మూలధన లభ్యత ప్రధానసమస్యగా ఉన్నదని మంత్రి కేటీఆర్ చెప్పారు. దేశం వేగంగా అభివృద్ధి చెందాలంటే మౌలిక వసతుల కల్పన కోసం భారీగా నిధులు కేటాయించాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఇందుకోసం అమెరికా , జపాన్ , యూరప్‌లోని పలుదేశాల మాదిరి చవకైన మూలధనాన్ని సేకరించి ఖర్చుచేయాలని సూచించారు. తెలంగాణ లాంటి పలు రాష్ట్రాల విధానాలు, వనరులు, వాతావరణం నచ్చి పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చే విదేశీ కంపెనీలు, ఆర్థిక సంస్థలకు కఠినమైన కేంద్ర నిబంధనలు అడ్డంకులుగా మారాయని తెలిపారు.

## కరోనా చికిత్సకు ఐసోలేటెడ్ వార్డులు

- హైదరాబాద్‌లోని ప్రభుత్వ దవాఖానల్లో ఏర్పాటు
- హైకోర్టుకు వెల్లడించిన ప్రభుత్వం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కొవిడ్-19 (కరోనా) అనుమానితుల స్క్రీనింగ్, చికిత్స కోసం హైదరాబాద్‌లోని ప్రభుత్వ దవాఖానల్లో ఐసోలేటెడ్ వార్డులు ఏర్పాటుచేశామని రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం హైకోర్టుకు వెల్లడించింది. అనుమానితులకు నిర్ధారణ పరీక్షలు కూడా వేగంగా చేస్తున్నట్టు అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ తెలిపారు. డెంగీ, స్వైన్‌ఫ్లూ కట్టడిపై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాలపై విచారణ సందర్భంగా చీఫ్ జస్టిస్ రాఘవేంద్రసింగ్, జస్టిస్ అభిషేక్‌రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం.. కొవిడ్-19 నేపథ్యంలో రాష్ట్రంలో సన్నద్ధతపై ఆరాతీసింది. 'డెంగీ, స్వైన్‌ఫ్లూ వంటి వాటితోపాటు కోవిడ్-19 కూడా మన దేశంలో ప్రవేశించింది. దేశంలో మూడు కేసులు నమోదుకావడం తీవ్ర ఆందోళన కలిగిస్తున్నది. కొవిడ్-19 విస్తరించకుండా రాష్ట్ర ప్రభుత్వం పటిష్ఠ చర్యలు తీసుకోవాలి. ప్రస్తుత కేసుతో కొవిడ్-19 అంశానికి సంబంధం లేకపోయినా.. దాని కట్టడికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు గురించి తెలుసుకోవాలనుకుంటున్నాం' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఏజీ వాదనలు వినిపిస్తూ డెంగీ, మలేరియా, స్వైన్‌ఫ్లూ కేసులు తగ్గుముఖం పట్టాయని, కొవిడ్-19 విషయంలో ప్రభుత్వం అప్రమత్తంగా ఉన్నదన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. వ్యాధుల కట్టడికి తీసుకుంటున్న చర్యలపై రిపోర్ట్ సమర్పించాలని సీఎస్‌కు ఆదేశించింది. విచారణను ఈనెల 27కు వాయిదా వేసింది.

## యువతకు గ్రీన్‌స్కిల్‌పై శిక్షణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గ్రీన్ స్కిల్ డెవలప్‌మెంట్‌పై యువతకు హైదరాబాద్‌లోని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్, ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఈపీటీఆర్ఐ) ప్రత్యేక శిక్షణనిస్తున్నది. కేంద్ర అటవీ, పర్యావరణశాఖ సహకారంతో ఈపీటీఆర్ఐ 19 కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. ప్రస్తుతం వ్యాల్యుయేషన్ ఆఫ్ ఎకోసిస్టమ్ సర్వీసెస్ అండ్ గ్రీన్ జీడీపీ కింద శుక్రవారం నుంచి ఈ నెల 29 వరకు సర్టిఫికెట్ కోర్సులు నిర్వహిస్తున్నట్టు డీజీ పార్థసారథి వెల్లడించారు.

## ముహూర్తం



సూర్యోదయం: 6.44 గంటలకు



సూర్యాస్తమయం: 6.11 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, కృష్ణపక్షం సప్తమి సాయంత్రం 4.30 వరకు, తదుపరి అష్టమి, నక్షత్రం: స్వాతి ఉదయం 6.02 వరకు, తదుపరి విశాఖ ఆదివారం ఉదయం 5.10 వరకు, అమృతఘడియలు: రాత్రి 8.41 నుంచి 10.12 వరకు, రాహుకాలం: ఉదయం 9.35 నుంచి 11.01 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 6.44 నుంచి 8.15 వరకు, వర్జ్యం: ఉదయం 11.26 నుంచి మధ్యాహ్నం 12.58 వరకు.

## లోకం పోకడ



## పలు రైళ్లు రద్దు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సెంట్రల్ రైల్వేలో నిర్వహణ, మరమ్మతులు, డబుల్ లైన్ పనుల కారణంగా ఈ నెల 17 నుంచి 21వ తేదీవరకు పలు రైళ్లను పూర్తిగా, మరి కొన్నింటిని పాక్షికంగా రద్దుచేసినట్టు దక్షిణ మధ్య రైల్వే శుక్రవారం ప్రకటించింది. మరి కొన్నింటిని దారి మళ్లించినట్టు తెలిపింది. హైదరాబాద్- విజయపుర, విజయపుర- బొలారం, రాయిచుర్- విజయపుర, షోలాపూర్- హస్సన్, ముంబై ఎల్‌టీటీ- కరైకల్, చెన్నై- అహ్మదాబాద్ రైళ్లను రెండువైపులా రద్దుచేసినట్టు పేర్కొన్నది.

## త్వరలో అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లో చేనేత వస్త్రాలు

### మంత్రి కేటీఆర్ ఆదేశాలతో టెస్కో అధికారుల చర్యలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** బహిరంగ మార్కెట్‌లో పోటీని తట్టుకోవడానికి టెస్కో (తెలంగాణ స్టేట్ హ్యాండ్లూం వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్) సిద్ధమైంది. వినియోగదారుల అభిరుచి, అంచనాలు, అవసరాలకు అనుగుణంగా ఈ-కామర్స్ మార్కెట్‌లో దూసుకుపోవాలని టెస్కో నిర్ణయించింది. చేనేత వస్త్రాలను ఆన్‌లైన్ ద్వారా విక్రయించాలనే రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారక రామారావు ఆదేశాలకు అనుగుణంగా.. ప్రపంచవ్యాప్తంగా పేరొందిన ఈ కామర్స్ సంస్థలైన అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లతో త్వరలో టెస్కో ఒప్పందం చేసుకోనున్నది. మార్చినాటికి ఈ-కామర్స్ సైట్లలో చేనేత చీరెలతోపాటు డ్రెస్ మెటీరియల్స్, టవల్స్, షర్ట్స్, ధోవతులు లభించనున్నాయి. తద్వారా చేనేత వస్త్రాల విక్రయాలు పెరుగుతాయని, కార్మికుల ఆదాయం రెట్టింపు అవుతుందని టెస్కో అంచనావేస్తున్నది.

## లాక్మే ఫ్యాషన్‌లో చేనేత తళుకులు

**హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** ముంబైలో లాక్మే ఫ్యాషన్ వీక్ 2020లో భాగంగా సాగుతున్న 'సస్టెయినబుల్ ఫ్యాషన్ డే' పోటీల్లో తెలంగాణ చేనేత వస్త్రాలు తళుక్కుమన్నాయి. టెస్కో (తెలంగాణ స్టేట్ హ్యాండ్లూం వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్)తో కలిసి డిజైనర్ ఏకా సంస్థ ఉత్పత్తులను ప్రదర్శించింది. మంచి కలర్ కాంబినేషన్‌తో సంప్రదాయ వస్త్రాలకు ఆధునికతను జోడించడంతో వీక్షకులను ఆకట్టుకున్నాయి. సింగిల్ ఇక్కత్, డబుల్ ఇక్కత్ నమూనా చేనేత వస్త్రాలతో రూపొందించిన డ్రెస్సులను ముద్దుగుమ్మలు ధరించి ర్యాంప్ వాక్‌చేశారు. ఇక్కత్ ఫ్యాబ్రిక్‌ను యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెంలో, టస్సార్ సిల్క్ ఫ్యాబ్రిక్‌ను మహదేవ్‌పూర్‌లో నేయించారు. నారాయణపేట కాటన్ వస్త్రాలు కూడా ఆకర్షణగా నిలిచాయి. ఆదివారం ముగిసే ఈ ఫ్యాషన్ వీక్‌లో పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, డిజైనర్ ఏకా రీనా, టెన్నిస్ స్టార్ సానియామీర్జా, టెక్స్‌టైల్ డైరెక్టర్ శైలజారామయ్యార్ పాల్గొన్నారు.



లాక్మే ఫ్యాషన్ వీక్‌లో చేనేత యంత్రాన్ని ప్రదర్శిస్తున్న పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్, డిజైనర్ ఏకా రీనా, టెన్నిస్ స్టార్ సానియామీర్జా, టెక్స్‌టైల్ డైరెక్టర్ శైలజారామయ్యార్



# ఏప్రిల్‌లో మూడుబరాజ్‌లు ఖాళీ

- సాంకేతిక పరిశీలన కోసం అధికారుల నిర్ణయం
- లక్ష్మీబరాజ్ నుంచి మొదలుకానున్న ఎత్తిపోతల ప్రక్రియ
- ఎల్లంపల్లి.. అవసరమైతే పునర్జీవ పథకంతో ఎస్సారెస్పీకి జలాల తరలింపు
- సమ్మక్క బరాజ్‌లో ఆరు టీఎంసీలదాకా నిల్వకు కసరత్తు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

కిలోమీటర్ల మేర.. నిండుకుండల్లా జలకళ ఉట్టిపడుతున్న గోదావరి బరాజ్‌లు మరికొన్ని రోజుల్లో ఖాళీ కానున్నాయి. సాంకేతిక ప్రొటోకాల్‌లో భాగంగా బరాజ్‌ల్లోని నీరంతటినీ ఖాళీచేయాలని అధికారులు నిర్ణయించారు. గతేడాది తొలిసారిగా ఈ బరాజ్‌ల్లో నీటిని నిల్వచేసిన దరిమిలా నిర్మాణాలను పరిశీలించేందుకు ఈ ప్రక్రియను చేపడుతున్నారు. శుక్రవారం రాత్రిగానీ శనివారం ఉదయంగానీ లక్ష్మీ (మేడిగడ్డ) బరాజ్ నుంచి ఎత్తిపోతల ప్రక్రియ మొదలుకానున్నది. వచ్చే జూన్ నుంచి కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఏటా 530 టీఎంసీల గోదావరి జలాలను ఎత్తిపోసేందుకు సంసిద్ధులై ఉండాలని, లక్ష్మీబరాజ్, సరస్వతి బరాజ్ (అన్నారం), పార్వతి బరాజ్ (సుందిల్ల), ఎల్లంపల్లి రిజర్వాయర్లలో ప్రస్తుతం ఉన్న నీటిని ఏప్రిల్ 10లోగా ఖాళీచేయాలని సీఎం కేసీఆర్ సూచించారు. దీంతో మూడుబరాజ్‌ల్లోని నిల్వలను ఖాళీచేసేందుకు నీటిపారుదలశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. వచ్చేవర్షాకాలంలో వరదలు వచ్చేనాటికి సాంకేతిక ప్రొటోకాల్‌ను పూర్తిచేయాలని నిర్ణయించారు. సాధారణంగా రిజర్వాయర్లు, బరాజ్‌లలో తొలిసారి నీటిని నిల్వచేశాక నిర్మాణాల్లో ఏమైనా మార్పు లు చోటుచేసుకున్నాయా? ఒకవేళ చోటుచేసుకుంటే ఎలాంటి జాగ్రత్తలు, మరమ్మతులు చేపట్టాలి? అని పరిశీలించేందుకు దానిని ఖాళీచేస్తారు. శ్రీరాజరాజేశ్వర (మిడ్‌మానేరు) జలాశయాన్ని 15 టీఎంసీల మేర నింపిన తర్వాత మొత్తం ఖాళీచేసి సాంకేతిక ప్రొటోకాల్‌ను పూర్తిచేశారు. అదేరీతిన గోదావరిపై నిర్మించిన మూడుబరాజ్‌ల్లోనూ సాంకేతిక పరిశీలన కోసం అధికారులు సిద్ధమవుతున్నారు. శుక్రవారం రాత్రిగానీ శనివారం ఉదయంగానీ లక్ష్మీబరాజ్ నుంచి నీటిని ఎత్తిపోసే ప్రక్రియను మొదలుపెట్టనున్నారు. అలా సరస్వతి, పార్వ తి పంపుహౌజ్‌ల్లోనూ మోటర్లను ప్రారంభిం చి, వాటిల్లోని జలాలను ఎల్లంపల్లికి తరలించనున్నారు. మూడుబరాజ్‌ల్లో ప్రస్తుతం దాదాపు 25 టీఎంసీలకు పైగా నీటినిల్వ ఉన్నది. ఇందులో దాదాపు 20 టీఎంసీల వరకు నీటిని ఎల్లంపల్లికి తరలించే అవకాశమున్నది.



జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలంలో నిండుకుండలా లక్ష్మీబరాజ్

### అవసరమైతే ఎస్సారెస్పీకి జలాల తరలింపు

ఎల్లంపల్లి జలాశయం పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 20.17 టీఎంసీలు కాగా.. శుక్రవారం అందులో 11 టీఎంసీల వరకు నీటినిల్వ ఉన్నది. అక్కడినుంచి లోయర్‌మానేరుకు జలాల తరలింపు ఇప్పటికే మొదలైంది. ఎల్‌ఎండీకి ఐదు టీఎంసీలు తరలించేందుకు నిర్ణయించినందున ఎల్లంపల్లి నిల్వ ఐదారు టీఎంసీలకు తగ్గుతుంది. లక్ష్మి, సరస్వతి, పార్వతి బరాజ్‌ల్లోని నిల్వలను ఇక్కడికి తరలిస్తారు. అవి 20 టీఎంసీల వరకు ఉన్నందున దాదాపు 15 టీఎంసీలను ఎల్లంపల్లిలో ఉంచుతారు. మిగిలిన నీటిని ఎస్సారెస్పీ పునర్జీవన పథకం ద్వారా శ్రీరాంసాగర్ జలాశయానికి తరలించేందుకు అధికారులు యోచిస్తున్నారు. ఇక.. మూడు బరాజ్‌ల్లోని దాదాపు 25 టీఎంసీల్లో 20 టీఎంసీల ఎల్లంపల్లి, ఎస్సారెస్పీకి తరలించిన తర్వాత మిగిలిన నీటిని గేట్లుఎత్తి దిగువకు వదలనున్నారు. ఆ తర్వాత మూడుబరాజ్‌ల వద్ద సాంకేతిక పరిశీలన పూర్తిచేస్తారు. ఇది పూర్తయితే ఇక రాను న్న సీజన్ నుంచి బరాజ్‌లను పూర్తిస్థాయిలో నింపుతారు. కాగా, మూడుబరాజ్‌ల గేట్లు ఎత్తి దిగువకు వదిలిన నీళ్లు సమ్మక్క (తుపాకులగూడెం) బరాజ్‌కు చేరుతాయి. ప్రస్తుతం సమ్మక్క బరాజ్ గేట్ల బిగింపు ప్రక్రియ మొదలైంది. ఏప్రిల్ చివరినాటికి వీటి బిగింపును పూర్తిచేసి.. ఎగువన బరాజ్‌ల నుంచి వచ్చేనీటిని నిల్వ చేసేందుకు అధికారులు ఏర్పాట్లుచేస్తున్నారు.



సీఎం కేసీఆర్ జన్మదినం (ఫిబ్రవరి 17) పురస్కరించుకొని ముందస్తుగా శుక్రవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నిజాంపేటలోని జర్నలిస్టుకాలనీలో మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ మొక్కలు నాటారు. - దుండిగల్, నమస్తే తెలంగాణ



రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ విసిరిన గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా శుక్రవారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో సైబరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ మామిడి, సపోటా, జామ మొక్కలు నాటారు. -శేరిలింగంపల్లి

## సీఎం పుట్టిన రోజున 66 వేల మొక్కలు నాటుదాం

### పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పిలుపు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సీఎం కేసీఆర్ 66వ పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 17న రాష్ట్రవ్యాప్తంగా 66 వేల మొక్కలునాటాలని పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. పౌరసరఫరాలశాఖకు చెందిన 170 గోదాముల్లో ఉద్యోగులందరూ మొక్కలు నాటాలని, రాష్ట్రంలోని ప్రతి రైస్ మిల్లులో, ప్రతి పెట్రోల్ బంకుల్లో, ఎల్పీజీ గోదాముల్లో కనీసం ఐదు మొక్కలకు తక్కువ కాకుండా నాటేలా కార్యాచరణ రూపొందించుకోవాలని అధికారులకు సూచించారు. ఎల్పీజీ డీలర్లు ప్రతిఇంటికి సిలిండర్ డెలివరీతోపాటు ఒక మొక్కను కూడా అందించాలని కోరారు.

## 40 దేశాల్లో వేడుకలు: మహేశ్ బిగాల



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సీఎం కేసీఆర్ పుట్టినరోజును పురస్కరించుకుని ప్రపంచవ్యాప్తంగా 40 దేశాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్టు టీఆర్ఎస్ ఎన్నారై కోఆర్డినేటర్ మహేశ్ బిగాల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ఆదేశాలమేరకు మొక్కలు నాటడంతోపాటు రక్తదానం, ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఎన్నారైశాఖలు సిద్ధంగా ఉన్నట్టు ఆయన వెల్లడించారు.

## ఉమ్మడి ఏపీ హైకోర్టు రిటైర్డ్ చీఫ్ జస్టిస్ పీసీ రెడ్డి కన్నుమూత



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, గౌహతి హైకోర్టుల మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పాలెం చెన్నకేశవరెడ్డి (96) శుక్రవారం బంజారాహిల్స్‌లోని తన నివాసంలో కన్నుమూశారు. ఆయనకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కడప జిల్లా తాటిమాకుల పల్లిలో 1924లో జన్మించిన పీసీ రెడ్డి మద్రాస్ యూనివర్సిటీ నుంచి న్యాయశాస్త్ర పట్టాపొందారు. మద్రాస్ హైకోర్టులో లాయర్‌గా ఎన్‌రోల్ అయిన ఆయన.. 1956లో ఏపీ హైకోర్టుకు మారారు. క్రిమినల్ లాలో నిష్ణాతుడిగా పేరుపొందిన పీసీ రెడ్డి.. 1972లో ఉమ్మడి ఏపీ హైకోర్టు జడ్జిగా ఎంపికయ్యారు. తర్వాత ఉమ్మడి ఏపీ హైకోర్టు, గౌహతి హైకోర్టుల చీఫ్ జస్టిస్‌గా పనిచేసి పదవీవిరమణ పొందారు. ఆయన అంత్యక్రియలు ఆదివారం పంజాగుట్ట శ్మశానవాటికలో నిర్వహిస్తామని కుటుంబసభ్యులు చెప్పారు.

# గిరిజనాభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి

- ప్రభుత్వమే సేవాలాల్ జయంతి నిర్వహిస్తున్నది
- బంజారా సాంస్కృతిక సంబురాల్లో స్పీకర్ పోచారం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని గిరిజనుల సంక్షేమం, ప్రగతికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. గిరిజన సంక్షేమ సంఘం, సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంత్ సేవాలాల్ మహరాజ్ 281వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం రవీంద్ర భారతి ప్రాంగణంలో బంజారా సాంస్కృతిక సంబురాలు నిర్వహించారు. గిరిజనుల అభ్యున్నతికి కృషిచేయడంతోపాటు ఉన్నతస్థాయికి చేరుకున్న గిరిజన ప్రముఖులకు మహా భోగ్ బండార్, సేవాలాల్ మహరాజ్ పేరిట పురస్కారాలను ప్రదానంచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన స్పీకర్ మాట్లాడుతూ.. సేవాలాల్ మహరాజ్ కేవలం గిరిజన ఆరాధ్య దైవం మాత్రమే కా దని, అందరూ ఆయన సూచించిన మార్గాన్ని అనుసరిస్తారన్నారు. సీఎం కేసీఆర్ గిరిజనుల అభివృద్ధికి, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాముఖ్యం కల్పిస్తున్నారని, గిరిజన విద్యాప్రగతికి గురుకులాలను సమర్థంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. హోంమంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ.. సంత్ సేవాలాల్ జయంతిని పురస్కరించుకొని గిరిజనులకు శుభాకాంక్షలు తెలిపారు. వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల మాట్లాడుతూ.. గిరిజన సంప్రదాయాలు భవిష్యత్ తరాలకు చాటి చెప్పేందుకు ప్రభుత్వం అన్ని విధాలా కృషిచేస్తున్నదని పేర్కొన్నారు. గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని కులాలు, మతాలను సమానంగా గౌరవిస్తూ సంప్రదాయాలను, ఆచారాలను సీఎం కేసీఆర్ కాపాడుతూ దేశంలోనే ఆదర్శవంతంగా పరిపాలన చేస్తున్నారని చెప్పారు. బంజారాహిల్స్‌లో రూ.కోట్లు విలువైన భూమిని కేటాయించి,బంజారా, కుమ్రంభీం భవనాలను నిర్మిస్తున్నారని తెలిపారు. పర్యాటక, సాంస్కృతికశాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. తండాలను గ్రామపంచాయతీలుగా మార్చి గిరిజనులు స్వయం పాలన చేపట్టేలా సీఎం కేసీఆర్ కృషిచేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు బీబీ పాటిల్, మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మీర్‌పేట మేయర్ దీప్‌లాల్, రాష్ట్ర సమాచార కమిషనర్ గుగులోతు శంకర్‌నాయక్, మాజీ ఎంపీ సీతారాంనాయక్, గురుకులాల కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, గిరిజన సంఘాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



శుక్రవారం రవీంద్రభారతిలో బంజారా సాంస్కృతిక సంబురాల్లో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీ సీతారాంనాయక్, సమాచార కమిషనర్‌గా నియమితులైన శంకర్‌నాయక్

### నేడు తెలంగాణభవన్‌లో భోగ్‌బండార్

సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాల భోగ్ బండార్‌ను శనివారం తెలంగాణభవన్‌లో నిర్వహించనున్నట్టు టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రూప్‌సింగ్ తెలిపారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్, గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ హాజరవుతారని, గిరిజనులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.


SOUTHERN POWER DISTRIBUTION COMPANY OF TELANGANA LIMITED
(A Govt. of Telangana Undertaking) (Formerly Central Power Distribution Company of Andhra Pradesh Ltd.)
6-1-50, Corporate Office, Mint Compound: Hyderabad-500063.
CIN U40109TG2000SGC034116 Website: www.tssouthernpower.com
REVISED NOTIFICATION TO NOTIFICATION NO.04/2019, DT.19-11-2019
Applications are invited from eligible candidates for two (2) posts of Chairperson/CGRF not later than 29-02-2020. The applicant shall be a retired District Judge or a retired judicial Officer having 20 years of service or a retired Chief Engineer (Electrical) of Distribution Licence with 20 years of experience. For detailed revised notification refer TSSPDCL website www.tssouthernpower.com at Careers link.
Place: Hyderabad
Date: 14-02-2020
ID.SPDCLCORP01621
Sd/- CHAIRMAN & MANAGING DIRECTOR, TSSPDCL


## సీఎం కేసీఆర్ ఆదేశాలు పాటించాలి: ఆర్టీసీ ఈయూ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆర్టీసీ అధికారులు.. సీఎం కేసీఆర్ ఆదేశాలను అమలుచేయాలని ఎంప్లాయీస్ యూనియన్ శుక్రవారం ఓ ప్రకటనలో కోరింది. ఆర్టీసీ సిబ్బందిని వేధింపులకు గురిచేయకుండా, ఫ్రెండ్లీ మేనేజ్‌మెంట్ ఏర్పడేలా చర్యలు తీసుకోవాలని గతంలోనే సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించారని గుర్తుచేసింది.

## దేవాదాయ భూముల ఆక్రమణలపై ప్రత్యేక డ్రైవ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేవాదాయ శాఖ భూముల ఆక్రమణలను తొలగించేందుకు ఈ నెల 17 నుంచి మార్చి 31 వరకు ప్రత్యేకడ్రైవ్ నిర్వహించనున్నట్టు ఆ శాఖ ప్రకటించింది. భూములను కాపాడుకొనేందుకు కంచె ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నది.

# అమరజవాన్ల కుటుంబాలను ఆదుకుంటాం

- సీఆర్పీఎఫ్ ఐజీ ఎంఆర్ నాయక్
- పుల్వామా అమరుల కుటుంబాలకు సన్మానం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** విధి నిర్వహణలో అసువులు బాసిన సీఆర్పీఎఫ్ జవాన్ల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని సీఆర్పీఎఫ్ సదరన్ సెక్టార్ ఐజీ ఎంఆర్ నాయ క్ పేర్కొన్నారు. అమరజవాన్ల కుటుంబాలకు ఆర్థికసాయం చేయడంతోపాటు, విద్యార్హతల ఆధారంగా కుటుంబసభ్యులకు ఉద్యోగ, ఉపా ధి అవకాశాలు కల్పిస్తామన్నారు. పుల్వామాలో ఉగ్రదాడి జరిగి ఏడాది అయిన సందర్భంగా శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని సీఆర్పీఎఫ్ సదరన్ సెక్టార్ కార్యాలయంలో వీరజవాన్లకు నివాళులర్పించారు. ప్రాణాలు కోల్పోయిన జవాన్ల కుటుంబసభ్యులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను బహూకరించారు. ఈ సందర్భంగా ఎంఆర్ నాయక్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఇప్పటివరకు మొత్తం 2, 221 మంది సీఆర్పీఎఫ్ అధికారులు, జవాన్లు అమరులయ్యారని చెప్పారు. కార్యక్రమంలో సీఐఐ తెలంగాణ చైర్మన్ డీ రాజు, గాయత్రి గ్రానైట్స్ అధినేత రవిచంద్ర, ఐ స్టాండ్ ఫర్ నేషన్ అధ్యక్షుడు రమేశ్, సైబరాబాద్ సైబర్ సెక్యూరిటీ కౌన్సిల్ జనరల్ సెక్రటరీ కృష్ణ ఏదుల, అమరజవాన్ల కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.



శుక్రవారం జూబ్లీహిల్స్‌లో పుల్వామా అమరులకుటుంబాలకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఆర్పీఎఫ్ సదరన్ సెక్టార్ ఐజీ ఎంఆర్ నాయక్

# మంచిమొక్కలు నాటుదాం

మూడోపేజీ తరువాయి...

అందిస్తున్నారు.

### సంస్థలు.. శాఖలు.. వ్యక్తులు

పోలీస్‌శాఖలో అత్యున్నతస్థాయి అధికారి నుంచి మొదలుకుని హోంగార్డు వరకు ప్రతీ ఒక్కరు మొక్కలు నాటడానికి ప్రాంతాలు, పోలీస్‌స్టేషన్లవారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. సమీప నర్సరీల నుంచి భారీసంఖ్యలో మొక్కలను సమీకరిస్తున్నారు. పౌరసరఫరాలశాఖ 66 వేలు, విద్యాశాఖ ఆధ్వర్యంలో 1,16,000, టీఎస్ఐఐసీ 1.32లక్షలు, ఆర్థికమంత్రి తన్నీరు హరీశ్‌రావు నేతృత్వంలో లక్ష, సిద్దిపేట కలెక్టర్ ఆధ్వర్యంలో లక్ష మొక్కలు నాటడానికి ఇప్పటికే ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. రిజర్వ్‌ఫారెస్ట్, క్షీణిత అటవీ ప్రాంతాల్లో లక్షల సంఖ్యలో మొక్కలు నాటడానికి అటవీశాఖ ఏర్పాట్లుచేస్తున్నది. సీఎం జన్మదిన సందర్భంగా ప్రతీ ఉద్యోగి, ప్రతీ అధికారి మొక్కలు నాటాలని ఇప్పటికే అటవీ, పర్యావరణశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. కొన్నిచోట్ల ఈ నెల 15 నుంచే ఈ కార్యక్రమాన్ని మొదలుపెడుతున్నారు. నాచారంలో డీపీఎస్ స్కూల్‌లో శనివారం మొక్కల పండుగ జరుగనున్నది. కేంద్రీయ విద్యాలయాలు, ఢిల్లీ పబ్లిక్ స్కూల్, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో జీహెచ్ఎంసీ నర్సరీల నుంచి.. హెచ్ఎండీఏ పరిధిలో హెచ్ఎండీఏ నర్సరీల నుంచి, పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలలో పంచాయతీరాజ్, అటవీశాఖల నర్సరీల నుంచి మొక్కలను పంపిణీ చేయడానికి సన్నాహాలు చేశారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని సెంట్రల్ యూనివర్సిటీలో పదివేల మొక్కలతో ఏర్పాటుచేసిన గ్రీన్‌పార్క్‌ను ఎంపీ సంతోష్‌కుమార్ ప్రారంభించనున్నారు.

### రావి, వేపను మరువకండి

ముఖ్యమంత్రి జన్మదిన సందర్భాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటేవారు భవిష్యత్‌లో నీడను, పండ్లు, ఫలాలను ఇచ్చే స్థానిక రకాల మొక్కలు నాటితే మంచిదని పర్యావరణ నిపుణులు చెప్తున్నారు. విశాలమైన పరిధిలో విస్తరించి నిండాపచ్చని ఆకులతో ఉండే రావి అత్యధిక ప్రాణవాయువునిచ్చే వృక్షంగా విలసిల్లుతున్నది. రావిచెట్లు రకరకాల పక్షి జాతులకు ఆశ్రయమివ్వడంతోపాటు చెట్టు పండ్లు వాటి ఆకలిని తీరుస్తాయి. దీనికి ఆక్సిజన్ చెట్టు అనే పేరున్నది. వేప చెట్టుతో బహుళ ప్రయోజనాలున్నాయి. నీడనివ్వడమే కాకుండా పలురకాల రోగాలను నయంచేసే శక్తి వేప ఆకులకున్నది. అల్లనేరేడు, ఉసిరి, తెల్లమద్ది నేలను కోతకు గురికాకుండా రక్షిస్తాయి. నది, చెరువుల పరివాహక ప్రాంతాలలో ఈ మొక్కలను నాటితే వరదలు వచ్చినప్పుడు మట్టి, ఇసుక నేరుగా నదులు, చెరువులలో ఇసుక మేటలు వేసే ప్రమాదం తప్పుతుంది. మర్రి, అల్లనేరేడు, ఉసిరి, చింతచెట్లను నాటితే భవిష్యత్‌తరాలకు నీడనివ్వడమే కాకుండా మంచి ఫలాలనిస్తాయని, పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతాయని విశ్లేషిస్తున్నారు.

## పాడిపరిశ్రమాభివృద్ధి సమాఖ్య చైర్మన్ పదవీకాలం పొడిగింపు



**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** తెలంగాణ రాష్ట్ర పాడిపరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ లోకా భూమారెడ్డి పదవీకాలాన్ని ప్రభుత్వం మరో రెండేండ్లు పొడిగించింది. ఈ మేరకు శుక్రవారం పశుసంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీచేశారు. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం రుయ్యాడి గ్రామానికి చెందిన లోక భూమారెడ్డి 1981 నుంచి 1992 వరకు రుయ్యాడి గ్రామ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా పనిచేశారు. అనంతరం 1992లో జరిగిన సహకార ఎన్నికల్లో ఉమ్డం ప్రాథమిక వ్యవసాయ సహకారసంఘం చైర్మన్‌గా ఎన్నికై, ఆదిలాబాద్ జిల్లా సహకారబ్యాంక్ చైర్మన్‌గా పనిచేశారు. 2001లో కేసీఆర్ పిలుపుమేరకు టీఆర్ఎస్‌లో చేరిన భూమారెడ్డి.. ప్రస్తుతం టీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు. 2017 ఫిబ్రవరి 17న తెలంగాణ రాష్ట్ర పాడిపరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య తొలిచైర్మన్‌గా భూమారెడ్డిని సీఎం కేసీఆర్ నియమించారు. పాడిపరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్‌గా మరోసారి అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్‌కు లోక భూమారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.



EPIONE
Center for Pain Relief & Beyond
Pain, Neurology & Regenerative Clinics
దక్షిణ భారతదేశంలోనే ప్రప్రథమంగా మోకాళ్ల నొప్పులకు ఆపరేషన్ అవసరం లేకుండా సమర్థమైన
ప్లేట్‌లెట్ రిచ్ ప్లాస్మా చికిత్స
వయసు మళ్లిన వారిలో ఎక్కువగా శరీరంలో కొన్ని రకాల అనారోగ్య సమస్యలు తరచుగా కనిపిస్తాయి. వారిలో సాధారణంగా కనిపించే సమస్య మోకాళ్ల నొప్పులు. ఈ సమస్య వారిని తీవ్రమైన నొప్పితో వారి జీవితం పట్ల నిరాశతో కూడిన పరిణామాలకు దారి తీస్తుంది. అటువంటి క్లిష్ట పరిస్థితులకు వారి మోకాళ్ల నొప్పుల నుండి ఉపశమనం పొందే విధంగా నూతన వైద్య విధానం ప్లేట్‌లెట్ రిచ్ ప్లాస్మా చికిత్స అందుబాటులో నిలిచింది. ఈ చికిత్స విధానంలో పేషంట్ రక్తంలోని ప్లాస్మాను సంగ్రహించి ఈ సమస్యతో బాధపడుతున్న వారి మోకాలు భాగంలో ప్రవేశపెట్టి చికిత్స చేస్తారు. ఈవిధంగా చేయడం వలన వారి సమస్య నుండి పూర్తిగా ఉపశమనం పొంది, వారి జీవన విధానంలో సరికొత్త ఆశ చిగురిస్తుంది.
మోకాళ్ల నొప్పులు మనం ఎదుర్కునే సాధారణ ఆరోగ్య సమస్య. ముఖ్యంగా వృద్ధులలో ఈ సమస్య అధికంగా కనిపిస్తుంది. యువకులలో క్రీడాకారులలో గాయాల వలన మరియు అధిక బరువుతో బాధపడే స్థూలకాయులలో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంది. ఈ మోకాళ్ల సమస్య కీళ్ల ప్రాంతంలోని గాయాలు మరియు స్నాయువు గాయాలు లేదా బుర్సిటిస్ వంటి వాటి వలన ప్రభావితమ-వుతుంది. మోకాలి ఆస్టియో ఆర్థరైటిస్ అనేది మృదులాస్థి అరిగిపోవడం వలన సంభవిస్తుంది. వృద్ధాప్యంలో మృదులాస్థి అరుగుదల వలన అధిక బరువు మోకాలు బాగంలో నిర్దిష్టమయి ఈ సమస్య ప్రభావితం అవుతుంది.
ఈ మోకాలు నొప్పి ప్రారంభంలో రోగులు ఫిజియోథెరపీ సలహా మేరకు కొన్ని రకాల శారీరక వ్యాయామాలు చేస్తారు. మరికొందరు నొప్పి ప్రభావాన్ని తగ్గించడానికి పెయిన్ కిల్లర్లను వాడతారు. ఇలా చేయడం వలన తరువాతి దశలలో వారు పెయిన్ కిల్లర్‌లకు బానిస అవుతారు. ఈ మందులు ప్రారంభంలో కలిగే రోగ లక్షణాల నుంచి ఉపశమనాన్ని కలిగిస్తాయి. ఇది మూత్రపిండాలు పాడయ్యే ప్రమాదాన్ని కలిగి ఉంటుంది. ఇలా చేయడం వలన పూర్తిగా మోకాలుని మార్పిడి చేయాల్సిన ప్రమాదం ఏర్పడుతుంది.
ప్లేట్‌లెట్స్ శరీరంలో ఉండే చిన్న కణాలు, ఇవి రక్తం గడ్డ కట్టే ప్రక్రియలో పాల్గొంటాయి. దెబ్బతిన్న ప్రదేశంలోకి ప్లేట్‌లెట్-రిచ్ ప్లాస్మా ఇంజెక్ట్ చేసిన తర్వాత. వృద్ధి కారకాలు ప్రేరేపించబడతాయి, ఈ విధంగా మొత్తం కణజాలం మళ్లీ పునరుత్పత్తి కావడానికి దాదాపు మూడు నెలలు పడుతుంది.
ఈ చికిత్స యొక్క ప్రధాన ప్రయోజనాలు ఏమిటంటే ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా చిన్న ఇంజక్షన్ ద్వారా ఈ సమస్య నుండి శాశ్వత పరిష్కారం దొరుకుతుంది. ఈ చికిత్స ప్రారంభం నుంచే నొప్పి తగ్గుముఖం పట్టి మీ పనిని పునరుద్ధించుకోనవచ్చును, భవిష్యత్తులో మోకాలు మార్పిడి వంటి శస్త్రచికిత్స చేయవలసిన అవసరం లేదు.
మోకాలు చికిత్స కోసం ఉన్న ఇతర చికిత్సా పద్ధతులు ప్లేట్‌లెట్-రిచ్ ప్లాస్మా చికిత్స విధానం కంటే సమర్థవంతంగా ఏది నిరూపించబడలేదు. దీనికి బెడ్ రెస్ట్ అవసరం లేదు మరియు ఇది మోకాలి కీళ్ల సమస్యలని నివారించడానికి మరియు మోకాలు నొప్పిని తొలగించడానికి సహజమైన మార్గం. దెబ్బతిన్న కీళ్ల సమస్యలతో బాధపడుతున్న రోగులందరికీ ప్లేట్‌లెట్-రిచ్ ప్లాస్మా వైద్యం ఒక వరం. మోకాలి నొప్పి నుండి శాశ్వత ఉపశమనం కోసం ప్లేట్‌లెట్-రిచ్ ప్లాస్మా వైద్యాన్ని కోరుకుంటారు.

డా. సుధీర్ దారా
ఫౌండర్ & డైరెక్టర్ ఆఫ్ ఇపియాన్
ఇంటర్‌వెన్షల్ పెయిన్ స్పెషలిస్ట్
4 వ అంతస్తు, అపురూప పిసిహెచ్, రోడ్ నెం.2, బంజారా హిల్స్, హైదరాబాద్.
కాల్: 84660 44441, 040 48554444
epionepainandspine.com
contact@epionepainandspine.com



పౌరసత్వ సవరణ చట్టం ఎవరి పౌరసత్వాన్ని రద్దుచేయదు. అలాగే మైనారిటీలకు, ముస్లింలకు వ్యతిరేకమైనది కాదు. పాకిస్థాన్‌లో మైనారిటీలుగా బాధితులైన వారిని గౌరవించాలని, వారికి పౌరసత్వం కూడా ఇవ్వాలని మహాత్మా గాంధీ కూడా చెప్పారు.

**అమిత్ షా, కేంద్రమంత్రి**

పౌరసత్వం సమస్యతో ముస్లింలను వేరుచేసి వారిని విదేశీయులుగా ప్రకటిస్తే మేం ఊరుకోం. దానికి వ్యతిరేకంగా మేం పెద్ద ప్రజా ఉద్యమం చేస్తాం. నిర్బంధ శిబిరాల్లో ముస్లింలను పెడితే వారిని విడిపిస్తాం.

**పి.చిదంబరం, కేంద్ర మాజీ మంత్రి**



**చరిత్రలో నేడు**



క్రీ.పూ.: 399

యువత ఆలోచనలను చెడగొడుతున్నాడన్న ఆరోపణతో తత్వవేత్త సోక్రటీస్‌కు మరణశిక్ష విధించిన రోమ్ ఏథెన్స్ కోర్టు.

1903

మొదటిసారి 'టెడ్డీ బేర్'ను తయారుచేసిన మోరిస్, రోస్ విక్టమ్.





1922

నిరంతర రేడియో ప్రసారాలను ప్రారంభించిన మార్కొనీ.

ఢిల్లీ నడిబొడ్డున ఉన్న గార్గీ మహిళా కళాశాల విద్యార్థులపై దాడిచేసి అమానవీయంగా, అనుచితంగా ప్రవర్తించిన పది మంది దుండగులను పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేశారు. దాడిచేసిన సమయంలో వారంతా తప్పతాగి ఉన్నారని తెలుస్తున్నది. దాదాపు 30 మంది తప్పతాగి దౌర్జన్యంగా కళాశాలలో చొరబడి విద్యార్థినుల పట్ల అనుచితంగా ప్రవర్తించారు. విద్యార్థులపై ఎలాంటి దాడిచేసినా పోలీసులు పట్టించుకోరనే భావనతోనే వారు ఈ దారుణానికి ఒడిగట్టారు.

**ది టైమ్స్ ఆఫ్ ఇండియా**

టెర్రరిస్టు కార్యకలాపాలకు ఆర్థిక సాయం అందిస్తున్నాడన్న ఆరోపణతో హాఫీజ్ సయీద్‌కు పాకిస్థాన్ కోర్టు జైలుశిక్ష విధించింది. 2008 ముంబై వరుస బాంబు పేలుళ్లలో కుట్రదారు అయిన సయీద్ పాక్‌లో ఆశ్రయం పొందుతున్నాడు. సయీద్ ప్రధాన అనుచరుడు మాలిక్ జాఫర్‌కు కూడా ఐదున్నరేండ్లు శిక్ష పడింది. టెర్రరిస్టు కార్యకలాపాలను ఎగదోస్తున్నందుకు గాను పాక్‌ను గ్రే లిస్టులో పెడుతామన్న ఐక్యరాజ్యసమితి ప్రకటించిన నేపథ్యంలో ఈ అరెస్టులు జరుగటం గమనార్హం.

**ది హిందూ**



# చట్టసభల ప్రక్షాళన

చట్టసభల్లో నేరచరితుల సంఖ్య నానాటికీ పెరిగిపోతున్న తీరు పట్ల సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నవారిని ఎన్నికల్లో అభ్యర్థులుగా ఎందుకు నిర్ణయించారో వివరణ ఇవ్వటంతోపాటు, ఆయా కేసుల జాబితాను రాజకీయపార్టీలన్నీ తమ వెబ్‌సైట్లలో ఉంచాలని స్పష్టం చేసింది. రాజకీయ పార్టీలన్నీ అభ్యర్థులను ఎంపికచేసిన 48 గంటల్లోగా లేదా, నామి నేషన్ల దాఖలు ప్రారంభమయ్యే తేదీకి కనీసం రెండువారాల ముందు అభ్యర్థుల నేర చరిత్రను ట్విట్టర్, ఫేస్‌బుక్ వంటి అన్ని సోషల్‌మీడియా వేదికలపై వెల్లడించాలని ఆదేశించింది. నేర వివరాలన్నీ జాతీయ, స్థానిక వార్తాపత్రికల్లోనూ ప్రకటనలుగా జారీచేయాలని చెప్పింది. అంతేకాకుండా ఈ ఆదేశాలను పాటిస్తున్నట్లు అన్ని రాజకీయపక్షాలు ఎన్నికల కమిషన్‌కు లిఖితపూర్వకంగా తెలుపాలని ఆదేశించటం గమనార్హం. అభ్యర్థులను ఎంపికచేసిన మూడురోజుల్లోగా ఈ పని పూర్తిచేయాలని కూడా ఆదేశించటం నేర రాజకీయాల పట్ల సుప్రీంకోర్టు ఎంత తీవ్రంగా ఆలోచిస్తున్నదో తెలుపుతున్నది. ఎన్నికల్లో గెలుస్తారన్న ఒకేఒక్క కారణంతో నేరచరితులకు టిక్కెట్లు ఇచ్చామని పార్టీలు చెప్పటం సరికాదు, వారి అర్హతలు, సమర్థత వంటి అంశాలను ప్రస్తావిస్తూ తగిన కారణాలు చూపాలని జస్టిస్ ఆర్.ఎఫ్.నారిమన్, జస్టిస్ రవీంద్రభట్‌ల బెంచ్ స్పష్టంచేయటం గమనించదగినది. రాజకీయాలు నేరపూరితం కావటంపై 2018 సెప్టెంబర్‌లో కోర్టు ఇచ్చిన తీర్పు అమలుకావటం లేదని, ఇది కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందని దాఖలైన పిటిషన్‌పై సుప్రీం ధర్మాసనం విచారణ చేపట్టిన సందర్భంగా ఈ విధంగా ఆదేశాలివ్వటం ఆహ్వానించదగిన పరిణామం.

**ప్రజాప్రతినిధుల అక్రమాలు, అవినీతి ఆరోపణలపై సుప్రీంకోర్టు ఇదివరకే అనేక చరిత్రాత్మక తీర్పులిచ్చింది. విచారణ సత్వరమే చేపట్టాలనీ, ఫాస్ట్‌ట్రాక్ కోర్టులతో విచారణ పూర్తిచేయాలని, శిక్షలు పడినవారిని అనర్హులుగా ప్రకటించాలని గతంలోనే ప్రకటించింది. అయినా వాటితో మన రాజకీయాల్లో గుణాత్మక మార్పు సంభవించిన దాఖలాలు కనిపించటం లేదు. తాజా తీర్పును కూడా అధికార పార్టీతో సహా అన్ని రాజకీయపక్షాలూ ఆహ్వానించటం హర్షణీయం. అయితే నేరచరితులను అరికట్టే క్రమంలో రాజకీయ వేధింపులకు గురైనవారిని వెలివేసే పరిస్థితి ఉండకూడదు.**

గత రెండు దశాబ్దాలుగా దేశ రాజకీయాల్లో పెనుమార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఎన్నికల వ్యవస్థను శాసిస్తున్న అంగబలం, అర్థబలాలు ప్రజాస్వామ్యానికి పెనుసవాళ్లు విసురుతున్నాయి. అవినీతికి రాజకీయం పర్యాయపదంగా మారిపోయింది. రాజకీయ పార్టీలకూ, ఆ పార్టీ తరపు న పోటీ చేస్తున్న అభ్యర్థులకూ రాజకీయ విధానాలు, అమలుచేయదల్చిన సంక్షేమ కార్యక్రమా లు, అభివృద్ధి పథకాల వాగ్దానాలు ప్రచారాస్త్రాలుగా ఉండటం లేదు. కులం, వర్గం పునాదిగా ధనబలమే నిర్ణయాత్మకశక్తిగా ఉంటున్నది. వారి నేపథ్యం ఎటువంటిదైనా గెలిచే అభ్యర్థులనే పార్టీలు బరిలో నిలుపుతున్నాయి. ఈ క్రమంలోనే ఏటా ఎన్నికల బరిలో నేరచరితుల సంఖ్య పెరిగిపోతున్నది. 2009లో 15వ లోక్‌సభలో 30 శాతం మంది నేరచరిత్ర కలిగి ఉన్నారు. 2014 నాటికి అది 34 శాతానికి పెరిగింది. ఓ పదేండ్ల కాలాన్ని పరిగణనలోకి తీసుకుంటే, 2009 నుంచి 2019 వచ్చేనాటికి ప్రజాప్రతినిధుల్లో నేరచరిత్ర కలిగినవారు 109 శాతా నికి పెరిగారు. ప్రస్తుత పార్లమెంట్‌లో ఉన్న 43 శాతం ఎంపీలపై క్రిమినల్ కేసులున్నాయని తెలుస్తున్నది. ఇందులో కిడ్నాప్‌లు, హత్యలు, దోపిడీలు, అత్యాచారాల వంటి తీవ్ర నేరాల్లో విచారణ ఎదుర్కొంటున్న వారు 20 శాతానికి పైగా ఉన్నారంటే పరిస్థితి ఎంత భయంకరంగా ఉన్న దో అర్థమవుతున్నది. ఇదంతా అభ్యర్థులు ఎన్నికల కమిషన్ ఆదేశం మేరకు తమ అఫిడవిట్లలో స్వచ్ఛందంగా తెలిపిన సమాచారమే. నేరమయ రాజకీయాలకు వ్యతిరేకంగా అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) లాంటి సంస్థ చేస్తున్న పోరాటానికి తోడు, కొన్ని స్వచ్ఛంద, పౌరసంఘాలు చేపడుతున్న చైతన్య కార్యక్రమాలు మంచి ఫలితాలనిస్తున్నాయి. సందర్భానుసారంగా కోర్టులు తగురీతిన స్పందిస్తూ రాజకీయాల ప్రక్షాళనకు నడుంకట్టడం హర్షణీయం.

కండబలానికి ధనబలం తోడైతే నేరమయ రాజకీయం పురుడుపోసుకుంటుంది. అన్ని విలువలనూ పాతరేసి అందలమెక్కుతుంది. ఈ పరిస్థితుల్లోంచి నేరచరితులు పుట్టుకొస్తున్నారు. ఈ క్రమంలోనే ఫలానా నేరాలున్నాయని పోటీచేస్తున్న నేతలు చెప్పుకోవటానికి సంకోచించడం లేదు. పార్టీలు కూడా నిస్సంకోచంగా అలాంటి అభ్యర్థులకు టిక్కెట్లు ఇస్తున్నాయి. దీనివల్ల ప్రజాస్వామ్య వ్యవస్థకే ముప్పు వాటిల్లుతున్నది. ప్రజాప్రతినిధుల అక్రమాలు, అవినీతి ఆరోపణలపై సుప్రీం కోర్టు ఇదివరకే అనేక చరిత్రాత్మక తీర్పులిచ్చింది. విచారణ సత్వరమే చేపట్టాలనీ, ఫాస్ట్‌ట్రాక్ కోర్టులతో విచారణ పూర్తిచేయాలని, శిక్షలు పడినవారిని అనర్హులుగా ప్రకటించాలని గతంలోనే ప్రకటించింది. అయినా వాటితో మన రాజకీయాల్లో గుణాత్మక మార్పు సంభవించిన దాఖలాలు కనిపించటం లేదు. తాజా తీర్పును కూడా అధికార పార్టీతో సహా అన్ని రాజకీయ పక్షాలూ ఆహ్వానించటం హర్షణీయం. అయితే నేరచరితులను అరికట్టే క్రమంలో రాజకీయ వేధింపులకు గురైనవారిని వెలివేసే పరిస్థితి ఉండకూడదు. అధికారపక్షం ప్రతిపక్ష నాయకులపై రాజకీయ దురుద్దేశంతో కేసులు పెట్టినప్పుడు వారిని విచారణకు ముందే అప్రతిష్ఠ పాలుచేసే పరిస్థితి ఉండకూడదు. ఎన్నికల కమిషన్, న్యాయస్థానాలు ఈ కోణాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. అంతిమంగా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత రాజకీయ పార్టీలదే.

**ముక్తసరి**



**దేవులపల్లి ప్రభాకరరావు**

# తలాక్, తలాక్!...

పార్లమెంట్‌లో రాష్ట్రపతి ప్రసంగంపై చర్చకు సమాధానంగా మోదీజీ ప్రసంగం ఢిల్లీ ఓటర్ల కోసం ఉద్దేశించినదని పరిశీలకులు భావించారు. ఆ ప్రసంగంలో మోదీజీ తెలంగాణపై చేసిన వ్యాఖ్యల్లో కొత్తదేం లేదు. ఇవెంతో కాలంనుంచి చంద్రబాబు, ఆయన మిత్రులు అలుపు లేకుండా ప్రచారం చేస్తున్న అపవాదులే. స్వేచ్ఛాయుతంగా తెలంగాణ బిల్లుపై చర్చ జరుగలేదన్నది మోదీజీ ఆరోపణ తాత్పర్యం. మోదీజీ ఎన్నడూ తెలంగాణకు అనుకూలంగా మాట్లాడలేదు.

దేశ రాజధాని ఢిల్లీ శాసనసభకు జరిగిన ఎన్నికల్లో ప్రజలు, ఓటర్లు నిర్ద్వంద్వంగా, చాలా స్పష్టంగా ఇచ్చిన తీర్పులో (2015లో మొదటి తీర్పు, 2020 ఫిబ్రవరిలో రెండవ తీర్పు ఆమ్ ఆద్మీ పార్టీకి, ఆ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌కు అనుకూలంగా అఖండ విజయం కలిగిస్తూ) తలాక్, తలాక్, తలాక్ నినాదాలు తీవ్రంగా, బలంగా, దృఢంగా, నిర్ణయాత్మకంగా విన్పించాయి. కేంద్రంలోని, పలు రాష్ట్రాల్లోని పాలకపక్షం బీజేపీకి, ఆ పార్టీ అధినేత, ప్రధానమంత్రి నరేంద్ర మోదీజీ నాయకత్వానికి, ఆయన అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా. స్వయంగా ప్రధానమంత్రి మోదీజీ, నిన్నమొన్నటి వరకు పార్టీ అధ్యక్షుడిగా ఉన్న ప్రస్తుత దేశ వ్యవహారాల మంత్రి అమిత్ షాజీ, కేంద్ర మంత్రులందరు, రెండు వందల మంది బీజేపీ పార్లమెంట్ సభ్యులు, వేలాది ఇతర కార్యకర్తలు ఢిల్లీ గల్లీ గల్లీ వెళ్లి పదివేల ర్యాలీలు, సభలు జరిపినా ఫలితం దక్కలేదు. బీజేపీ ఘోర పరాజయాన్ని రుచి చూడక తప్పలేదు. ఢిల్లీలోనే కాదు, 2019 లోక్‌సభ ఎన్నికల ముందు, ఆ ఎన్నికల తర్వాత శాసనసభలకు ఎన్నికలు జరిగిన వివిధ రాష్ట్రాల్లో అధిక సంఖ్యలో ప్రజలు, ఓటర్లు బీజేపీకి, మోదీజీ నాయకత్వానికి తలాక్ ఇచ్చారు. కేసీఆర్ నాయకత్వంలోని తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ డిపాజిట్లను దక్కించుకోలేకపోతున్నది. మొన్నటి ఢిల్లీ శాసనసభ ఎన్నికల్లో గెలుపు కోసం బీజేపీ తన పొదిలో ఉన్న అన్ని ఆయుధాలను ఉపయోగించింది. భవిష్యత్తుపై భ్రమలు కల్పించే కేంద్ర బడ్జెట్ (2020-21 సంవత్సరానికి) ఢిల్లీ ఎన్నికల ప్రచారం పతాకస్థాయిలో వచ్చింది. అయోధ్యలో రామాలయ నిర్మాణానికి సంబంధించిన ట్రస్ట్ నియామకం ప్రకటన అప్పుడే వచ్చింది, ఆ సమయంలోనే ప్రధానమంత్రి మోదీజీ పార్లమెంట్‌లో రాష్ట్రపతి ప్రసంగంపై చర్చకు సుదీర్ఘ సమాధానమిస్తూ జమ్ము-కశ్మీర్‌లో 370 ఆర్టికల్ రద్దు, పౌరసత్వ చట్టంలో సవరణ, జాతీయ జనాభా రిజిస్టర్, పౌరుల రిజిస్టర్ సమంజసమని గట్టిగా వాదిస్తూ (ఢిల్లీ ఓటర్లలో మతావేశాన్ని రెచ్చగొట్టడానికి) భారత స్వాతంత్ర్యోద్యమ నాయకుల మీద, ప్రథమ ప్రధాని మీద బురద చల్లారు. ఢిల్లీ ఎన్నికల ప్రచార కార్యక్రమం ఒకవంక ఉధృతంగా జరుగుతుండగా మరోవంక ఒక బీజేపీ ముఖ్య నేత జాతిపిత గాంధీజీని అవమానించే వ్యాఖ్యలు చేశారు. ఎన్ని చేసినా బీజేపీని ఢిల్లీ ప్రజలు తిరస్కరించి కేజ్రీవాల్ రెండవసారి ప్రభుత్వం ఏర్పాటుచేసే అవకాశం ఇచ్చారు. అందువల్ల, నిశ్చయంగా ఆప్‌ది ఘన విజయం. పరిమిత అధికారాలతో, స్వల్ప నిధులతో, లెఫ్టినెంట్ గవర్నర్‌ను ఒక అంకుశంగా ఉపయోగించి మోదీజీ ప్రభుత్వం (కేంద్ర ప్రభుత్వం) అడుగడుగునా దైనందిన పాలనలో ఆటంకాలు కల్పిస్తున్నప్పటికీ కేజ్రీవాల్ ప్రభుత్వం విద్య, ఆరోగ్యం, రవాణా రంగాల్లో గణనీయ సంక్షేమ పథకాలను అమలు జరిపి ఢిల్లీ ప్రజల మెప్పు పొందగలిగింది, అదీ గొప్ప విషయం. ఢిల్లీ పోలీసు వ్యవస్థ కేంద్ర ప్రభుత్వం చేతిలో ఉన్నది. ఢిల్లీ పోలీసులు ఒక సందర్భాన ముఖ్యమంత్రి కేజ్రీవాల్ కార్యాలయంలో ప్రవేశించి, సోదా చేసి అవమానించారు. కేజ్రీవాల్ ప్రభుత్వంలోని మంత్రులకు, ఉన్నతాధికారులకు, సిబ్బందికి మోదీజీ ప్రభుత్వం అష్టకష్టాలు కలిగించింది. ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా ఢిల్లీ ప్రభుత్వ ఉద్యోగులను, అధికారులను రెచ్చగొట్టి సమ్మెలు చేయించారు. ఢిల్లీ రాష్ట్రానికి ఇంతవరకు సంపూర్ణ రాష్ట్రస్థాయి (ఒక విధంగా ఇతర రాష్ట్రాలకున్న స్వతంత్ర ప్రతిపత్తి) లేనందువల్ల మోదీజీ ప్రభుత్వం లెఫ్టినెంట్ గవర్నర్‌ను ఉపయోగించి పెత్తనం చేయగలిగింది- రానున్న ఐదేండ్లలో తిరిగి ఈ పెత్తనం ఉండదని చెప్పలేం. ఢిల్లీ ముఖ్యమంత్రి అధికారాలేమిటి, లెఫ్టినెంట్ గవర్నర్ పరిధి, అధికారాలేమిటి అన్న వివాదం ఉత్పన్నమైనప్పుడు అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పు ఇవ్వలేకపోయింది. దేశ రాజధాని ఢిల్లీ ప్రజలు భయంకర కాలుష్యం కోరల్లో నుంచి విముక్తులై మరింత మేలు పొందాలంటే ఢిల్లీకి సంపూర్ణ రాష్ట్రస్థాయి, ప్రతిపత్తి లభించడం ముఖ్యం. ఈ దేశంలో నిజమైన ఫెడరల్ వ్యవస్థ ఏర్పడి పటిష్ఠం కావాలంటే ప్రాంతీయ పార్టీలన్నీ ఒక వేదికపెకై వచ్చి సంఘటితమై కీలకపాత్ర నిర్వహించాలన్న కేసీఆర్ సిద్ధాంతానికి ఢిల్లీలో ఆప్ విజయం మరింత ఊపు ఇస్తున్నది. నిజానికి ఈ రోజు ఏవీ జాతీయ పార్టీలుగా లేవు-కేసీఆర్ నాయకత్వంలో టీఆర్ఎస్ అద్భుత విజయాలను, ఫలితాలను సాధించి దేశ ప్రజల దృష్టిని ఆకర్షిస్తున్నది.

ఢిల్లీ ఎన్నికల సమయంలోనే పొరుగుదేశం శ్రీలంక (సింహళం) ప్రధానమంత్రి మహీంద రాజపక్స భారత పర్యటనకు వచ్చి ఢిల్లీలో ప్రధాని మోదీజీతో చర్చలు జరిపారు. ఈరోజు భారతదేశం విచ్ఛిత్తికి, విభజనకు, విద్వేషానికి కారణమవుతున్న సమస్యలను శ్రీలంక ఎంతో కాలం నుంచి ఎదుర్కొని ఇరువై ఏడేండ్ల అంతర్యుద్ధంతో సంక్షోభానికి గురయి వినాశనం పాలైంది. శ్రీలంక జనాభా 2 కోట్ల 30 లక్షలు. ఇందులో 75 శాతంతో అధిక సంఖ్యాకులు బౌద్ధులు, హైందవ తమిళులది 11వ శాతం, ముస్లింలది 10 శాతం. మెజారిటీ బౌద్ధుల వల్ల తమకు అన్యాయం జరుగుతున్నదంటూ న్యాయం కోసం లిబరేషన్స్ టైగర్స్ ఆఫ్ తమిళ్ ఈలం (ఎల్‌టీటీఈ) సాయుధ పోరాటం జరుపడంతో శ్రీలంక అంతర్యుద్ధం పాలైంది. శ్రీలంక అధ్యక్షుడిగా మహీంద రాజపక్స కఠినంగా వ్యవహరించడంతో 2009 మే నెలలో అంతర్యుద్ధం ముగిసింది. నాటి భారత ప్రధాని రాజీవ్‌గాంధీ చొరవతో కుదిరిన ఒప్పందంలో భాగంగా తమిళులు తదితర అల్పసంఖ్యాక వర్గాల హక్కుల పరిరక్షణకు శ్రీలంక రాజ్యాంగంలో 13వ సవరణ జరిగింది. ఈ సవరణకు అనుగుణంగా తమకు అధికారాలు లభించాలని, సమానత్వం, న్యాయం, గౌరవం, ప్రశాంతి చేకూరాలని శ్రీలంక తమిళులు కోరుతున్నారని మోదీజీ ఢిల్లీ చర్చల్లో మహీంద రాజపక్సతో అన్నారని వార్తలు వెల్లడించాయి. ఈ 13వ సవరణకు అనుగుణంగా శ్రీలంక ఉత్తర, తూర్పు భాగాలకు (తమిళులు అధిక సంఖ్యలో ఉన్న ప్రాంతాలు) ప్రత్యేక ప్రతిపత్తి కల్పించవలసి ఉంటుంది. వచ్చే ఏడాది రాష్ట్ర శాసనసభ ఎన్నికలు జరుగనున్న తమిళనాడులో కూడా 'తలాక్' లభించకుండా జాగరూకత వహించడానికి (సుప్రీంకోర్టు తీర్పు అనంతరం తలాక్ సంప్రదాయాన్ని నిషేధించే ఒక చట్టాన్ని రూపొందించడానికి మోదీజీ ఎంతో ఆసక్తితో పట్టుదల వహించారు. తలాక్‌ను నిషేధిస్తే ముస్లింల స్త్రీల ఓట్లన్ని తమ పెట్టెలో పడుతాయనుకున్నారు. మోదీజీ చొరవతో 2018లో తలాక్‌ను నిషేధించే చట్టం వచ్చింది. విచిత్రమేమంటే ఈ రోజు దేశమంతటా పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమాల్లో ముస్లిం స్త్రీలు, ముఖ్యంగా ముస్లిం విద్యార్థినులు అగ్రగామి పాత్ర నిర్వహిస్తున్నారు.) మోదీజీ శ్రీలంక తమిళుల హక్కుల కోసం గట్టిగా మాట్లాడే నైతికహక్కును కోల్పోయారు. జమ్ముకశ్మీర్‌లో 370వ ఆర్టికల్‌ను, ప్రత్యేక స్థాయిని రద్దుచేసిన మోదీజీ శ్రీలంకలో 13వ సవరణ చట్టాన్ని అమలుచేయాలని, అక్కడి అల్పసంఖ్యాక వర్గాల (మైనార్టీల) హక్కులను పరిరక్షించాలనలేదు. ఈ దేశంలో అల్పసంఖ్యాక వర్గాల హక్కులను హరిస్తున్న వారు ఆ దేశంలో మైనారిటీల హక్కుల కోసం గొంతెత్తలేరు.

పార్లమెంట్‌లో రాష్ట్రపతి ప్రసంగంపై చర్చకు సమాధానంగా మోదీజీ ప్రసంగం ఢిల్లీ ఓటర్ల కోసం ఉద్దేశించినదని పరిశీలకులు భావించారు. ఆ ప్రసంగంలో మోదీజీ తెలంగాణపై చేసిన వ్యాఖ్యల్లో కొత్తదేం లేదు. ఇవెంతో కాలం నుంచి చంద్రబాబు, ఆయన మిత్రులు అలుపు లేకుండా ప్రచారం చేస్తున్న అపవాదులే. స్వేచ్ఛాయుతంగా తెలంగాణ బిల్లుపై చర్చ జరుగలేదన్నది మోదీజీ ఆరోపణ తాత్పర్యం. మోదీజీ ఎన్నడూ తెలంగాణకు అనుకూలంగా మాట్లాడలేదు. తెలంగాణ ప్రజల స్వరాష్ట్రం డిమాండ్‌పై జరిగినంత చర్చ స్వతంత్ర భారతంలో ఇంకే డిమాండ్‌పై జరుగలేదు. పార్లమెంట్ ఉభయ సభల్లో ఒకసారి కాదు, రెండుసార్లు కాదు, వంద పర్యాయాలు తెలంగాణపై చర్చ జరిగి ఉంటుంది. ఎప్పుడైనా స్వేచ్ఛాయుతంగానే చర్చలు జరిగాయి. తెలంగాణ రాష్ట్ర డిమాండును వ్యతిరేకిస్తూ మాట్లాడేవారికే ఎక్కువ సమయం, ఎక్కువ అవకాశాలు లభించాయన్నది చారిత్రక సత్యం. తెలంగాణ వ్యతిరేకులు పార్లమెంట్‌కు కర్రలు, స్ప్రేలు తెచ్చి దాడులుచేసే స్వేచ్ఛ లభించింది. తెలంగాణ బిల్లును అడ్డుకోవడానికి రాజ్యసభలో చివరి నిమిషం వరకు జరిగిన గొడవ వల్లనే ఏపీ రాష్ట్రానికి ప్రత్యేకస్థాయి (ఎస్సీఎస్) కల్పించడానికి మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం అంగీకరించింది. ఆంధ్రప్రదేశ్ శాసనసభలో తెలంగాణకు వ్యతిరేకంగా ఎంత గొడవ జరిగిందో అందరికీ తెలుసు. తెలంగాణ పై చర్చలన్నీ ఎక్కడ జరిగినా స్వేచ్ఛాయుతం గానే జరిగాయి. ఇందిరాగాంధీ ప్రధానిగా లోక్‌సభలో కూర్చొని తనకు ఇష్టం లేకున్నా తెలంగాణ వాదుల ప్రసంగాలను విన్నారు. అంతిమ, అప్రతిమాన, శాంతియుత ఉద్యమానికి నాయకత్వం వహించి తెలంగాణ రాష్ట్రం సాధించిన కేసీఆర్ ఇంటింటికీ వెళ్లి తెలంగాణ రాష్ట్ర ఉద్యమం గురించి, ఆవశ్యకత గురించి దేశమంతటా వివరించి చెప్పారు. ఆయన ఓపికకు, ఓరిమికి మొక్కక తప్పదు. బలపరిచేవారు బలపరిచారు, వ్యతిరేకించేవారు వ్యతిరేకించారు-అందరూ స్వేచ్ఛాయుతంగానే. ఎక్కడినుంచో రహస్యంగా వచ్చిన ఆదేశాలతో తెలంగాణపై ఎవరూ మాట్లాడలేదు అప్పుడు. ఇప్పుడైతే ఇందుకు భిన్నంగా (370వ ఆర్టికల్ రద్దు బిల్లును రహస్యంగా ప్రవేశపెట్టినట్లు) జరిగేది.

> అంతిమ, అప్రతిమాన, శాంతియుత ఉద్యమానికి నాయకత్వం వహించి తెలంగాణ రాష్ట్రం సాధించిన కేసీఆర్ ఇంటింటికీ వెళ్లి తెలంగాణ రాష్ట్ర ఉద్యమం గురించి, ఆవశ్యకత గురించి దేశమంతటా వివరించి చెప్పారు. ఆయన ఓపికకు, ఓరిమికి మొక్కక తప్పదు. బలపరిచేవారు బలపరిచారు, వ్యతిరేకించేవారు వ్యతిరేకించారు-అందరూ స్వేచ్ఛాయుతంగానే.

# సత్వరన్యాయం దిశగా..

**న్యాయం**



**విక్రమ్ బాలసాని**

ఏదైనా నేరం జరిగినప్పుడు సత్వర న్యాయం అందిస్తే బాధిత కుటుంబాలకు స్వాంతన చేకూరుతుంది. సత్వర న్యాయం అందించడం ప్రభుత్వ, న్యాయవ్యవస్థల బాధ్యత. నేరాలు జరిగినప్పుడు ప్రభుత్వం ఎటువంటి కార్యాచరణ చేపడుతున్నదన్న అంశాన్ని విశ్లేషించకుండా విమర్శించడం తప్పవుతుంది. నేరాలు జరుగకుండా మూలాల నుంచి సంస్కరణలు తెచ్చే ప్రయత్నం చేస్తున్నప్పుడు, కార్యాచరణకు పూనుకున్నప్పుడు ఇంకా మాటలు చెప్పాల్సిన అవసరం ఉండదు. చర్యలు లేకుండా మీడియాలో మాట్లాడి వదిలేయడం స్పందన అనిపించుకోదు. బాధితులకు న్యాయం చేసే విధంగా తక్షణ చర్యలు చేపట్టడమే అసలైన స్పందన.

మహిళలు, చిన్నారులకు న్యాయం అందించే విషయంలో వ్యవస్థల్లో ఏండ్లుగా ఉన్న అలసత్వాన్ని తొలిగించి నూతన బాటలు పరిచే దిశగా తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. మహిళలు, చిన్నారులపై లైంగికదాడుల వంటి ఘటనల్లో సత్వర న్యాయం అందించే విషయంలో నూతన ఒరవడిని సృష్టించే ప్రయత్నాలు జరుగుతుండటం ఆహ్వానించదగిన పరిణామం. ఇటీవలి కాలంలో వరంగల్‌లో చోటుచేసుకున్న 9 నెలల చిన్నారిపై లైంగికదాడి, సమత, హాజీపూర్ ఘటనల్లో సత్వర న్యాయం జరిగింది. వరంగల్‌లో 9 నెలల చిన్నారిపై హత్యాచారం కేసులో ప్రభుత్వం వెంటనే స్పందించి ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటుచేసింది. అన్ని కోణాల్లో సాక్ష్యాధారాలను పరిశీలించిన వరంగల్ కోర్టు రెండు నెలల్లోపే దోషికి ఉరిశిక్ష విధించింది. దోషి అప్పీల్ చేసుకోవడంతో, హైకోర్టు ఉరిశిక్షను యావజ్జీవ శిక్షగా మార్పుచేసింది. దీనిపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని వరంగల్ పోలీసులు నిర్ణయించారు. బాధితులకు న్యాయం అందించే విషయంలో ప్రభుత్వ నిబద్ధతకు ఇది నిదర్శనం. హాజీపూర్ వరుస హత్యాచారాల కేసుల్లో కూడా వేగంగా స్పందించిన ప్రభుత్వం నల్గొండలో ప్రత్యేక కోర్టును ఏర్పాటుచేసింది. కేసు నమోదైన మూడు నెలల్లోనే పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేయడంతోపాటు చార్జిషీట్‌ను దాఖలుచేశారు. 101 మంది సాక్ష్యాలను పరిశీలించిన కోర్టు విచారణను పూర్తిచేసి నిందితుడికి ఉరిశిక్ష విధించింది. ఆదిలాబాద్ సమత కేసులో సైతం పోలీసులు తక్షణం స్పందించిన తీరుపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమయ్యాయి. సమతపై దారుణానికి ఒడిగట్టిన నిందితులు ముగ్గురికి ఆదిలాబాద్ కోర్టు ఉరిశిక్ష విధించింది. ఈ కేసులో కేవలం 67 రోజుల రికార్డు సమయంలో తీర్పు వెలువడింది. ఇది పోలీసుల పనితీరుకు నిదర్శనం.

హైదరాబాద్ వెటర్నరీ వైద్యురాలు దిశ కేసులో సత్వర న్యాయం అందించేందుకు ప్రభుత్వం మహబూబ్‌నగర్‌లో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటుచేస్తూ జీవో జారీచేసింది. దర్యాప్తులో భాగంగా నేరస్థలిలో క్రైం సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేసే క్రమంలో ఎన్‌కౌంటర్ ఘటన చోటుచేసుకొని నిందితులు మరణించడం గమనార్హం. నేరాల కట్టడికి ప్రభుత్వం చేపడుతున్న పటిష్ఠ చర్యలతో రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో క్రైం రేట్ మూడు శాతం తగ్గింది. దీంతోపాటు నేర నిరూపణ శాతం 34 నుంచి 42 శాతానికి పెరిగింది. దాదాపు ప్రతి రెండు నేరా ల్లో ఒక నేరానికి తప్పనిసరిగా శిక్ష పడుతున్నట్లు గణాంకాలు స్పష్టంచేస్తున్నాయి.

లైంగికదాడుల కేసుల్లో సత్వర శిక్షలు అమలు చేస్తేనే ప్రజల్లో విశ్వాసం కలుగుతుంది. ఈ ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా మహిళల దాడుల కేసుల్లో వేగంగా విచారణ జరిపేందుకు చర్యలు మొదలయ్యాయి. పిల్లల రక్షణ (పోక్సో) చట్టం కింద నమోదయ్యే కేసులను సత్వరం పరిష్కరించేందుకు 36 ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ప్రభుత్వం ఏర్పాటుచేసింది. పోక్సో కేసుల విషయంలో సుప్రీంకోర్టు గతంలో జారీచేసిన ఆదేశాలను అనుసరించి ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటయ్యాయి. ఇటీవలి దారుణ ఘటనల నేపథ్యంలో హైకోర్టు కూడా స్పందించింది. మహిళలపై జరిగే లైంగికదాడి, హత్యాచారం, ఇతర నేరాల్లో సత్వర న్యాయం అందించేందుకు చర్యలు చేపట్టింది. మహిళా కేసుల సత్వర విచారణకు విమెన్ అట్రాసిటీ ప్రత్యేక న్యాయస్థానాలకు న్యాయ మూర్తులను నియమించింది. దీంతో ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసుల్లో బాధితులకు న్యాయం అందనున్నది.

ప్రభుత్వం ప్రయోగాత్మకంగా ప్రారంభించి న షీ టీమ్స్ రాష్ట్రంలో విజయవంతమయ్యాయి. మహిళల పట్ల వేధింపులకు పాల్పడేవారి ఆట కట్టించేందుకు షీ టీమ్స్ మెరుపు వేగంతో పనిచేస్తూ కేసులు నమోదు చేస్తున్నాయి. భరోసా కేంద్రాలు, విమెన్ సేఫ్టీ వింగ్ మహిళల భద్రతకు అండగా నిలుస్తున్నాయి. సత్వర న్యాయం అందించడం, ఉన్నత న్యాయస్థానాలపై భారం తగ్గించేందుకు గ్రామ న్యాయాలయా ల చట్టం-2008 అమలు విషయంలో తెలంగాణ ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. ఈ చట్టం ప్రకారం రాష్ట్రంలో గ్రామీణ న్యాయాలయాలు ఏర్పాటు కానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా మండల స్థాయిలో 55 గ్రామీణ న్యాయాలయాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. జూనియర్ సివిల్ జడ్జి స్థాయి న్యాయాధికారులు గ్రామీణ న్యాయాలయాల్లో న్యాయమూర్తులుగా వ్యవహరిస్తారు. ఈ న్యాయాలయాల నిర్వహణకు కావాల్సిన సిబ్బంది నియామకానికి కూడా ప్రభుత్వం ఆమోదం తెలిపింది. గ్రామీణ న్యాయాలయాల ఏర్పాటుతో తాలూకా, జిల్లాస్థాయి కోర్టులపై భారం తగ్గి కేసుల సత్వర పరిష్కారానికి ఆస్కారం ఏర్పడుతుంది.

> నేర నియంత్రణ ఒక ఎత్తయితే, నేరాలు జరుగకుండా బాల్యం నుంచే నైతిక ప్రవర్తను నేర్పడం మరో ఎత్తు. అసలు నేరం జరుగకుండా మూలాల నుంచి చికిత్స ప్రారంభించడానికి చిత్తశుద్ధి ఉండాలి. ఇలాంటి వినూత్న ప్రయోగాన్ని చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. నైతిక విలువలను పాఠ్యాంశాల్లో చేర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. నైతిక విలువల అంశా న్ని పాఠ్యాంశంగా తీసుకురావడం చరిత్రాత్మక నిర్ణయంగా నిలువబోతున్నది. నైతిక విలువలు కొరవడటం వల్లే సమాజంలో చిన్నారులు, మహిళలపై అకృత్యాలు పెరిగిపోతున్నాయనేది వాస్తవం.

నేర నియంత్రణ ఒక ఎత్తయితే, నేరాలు జరుగకుండా బాల్యం నుంచే నైతిక ప్రవర్తను నేర్పడం మరో ఎత్తు. అసలు నేరం జరుగకుండా మూలాల నుంచి చికిత్స ప్రారంభించడానికి చిత్తశుద్ధి ఉండాలి. ఇలాంటి వినూత్న ప్రయోగాన్ని చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. నైతిక విలువలను పాఠ్యాంశాల్లో చేర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. నైతిక విలువల అంశాన్ని పాఠ్యాంశంగా తీసుకురావడం చరిత్రాత్మక నిర్ణయంగా నిలువబోతున్నది. నైతిక విలువలు కొరవడటం వల్లే సమాజంలో చిన్నారులు, మహిళలపై అకృత్యాలు పెరిగిపోతున్నాయనేది వాస్తవం. ప్రస్తుత పాఠ్యాంశాల్లో జనరల్ సైన్స్, సోషల్ సహా ఇతర సబ్జెక్టుల్లో సమూల మార్పులు జరుగాల్సిన అవసరం ఉన్నది. సైన్స్‌లో పర్యావరణానికి సంబంధించిన అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. విదేశాల్లో ఇప్పటికే అమల్లో ఉన్న 'గుడ్ టచ్-బ్యాడ్ టచ్' వంటి విషయాలను పిల్లలకు బోధించాలి. తద్వారా చిన్నారుల్లో అప్రమత్తత, జాగరూకత పెంపొందించాలి. మహిళలపై హింసకు కారణమవుతున్న సామాజికాంశాలను రూపుమాపాలి.

**జనగళం**

## విద్యార్థులూ.. మనోధైర్యం కోల్పోవద్దు

విద్యార్థులు తమకు పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయని నిరుత్సాహపడటం, ఫెయిల్ అయ్యామని ఆత్మహత్యలకు పాల్పడటం మనం తరచూ పత్రికల్లో చదుతున్నాం, టీవీల్లో చూస్తున్నాం. విద్యార్థులూ ఇక్కడ ఒక్కటి గమనించాలి. మార్కులు, ర్యాంకులే ప్రధానం కాదు. ఓటమిని గుణపాఠంగా స్వీకరిస్తేనే విజయానికి మార్గం సుగమమవుతుంది. చదువులో వెనుకబడినంత మాత్రాన ప్రపంచంలోని దారులన్నీ మూసుకుపోవు. ప్రపంచంలో ఎన్నో లక్ష్యాలు, మార్గాలున్నాయి. అందులో మనమూ ఒక లక్ష్యాన్ని అందుకుందాం. గెలుపునకు తుదిమెట్టు అంటూ ఏదీ ఉండదు. ఓటమి ఎప్పుడూ అపాయకారి కాదు. మనకు ఈ రెండింటినీ సాధించాల్సిన దానికి కావాల్సింది మనోధైర్యం, ఆత్మవిశ్వాసం, పట్టుదల మాత్రమే.

విద్యార్థులు ఎప్పుడూ, ఏ దశలోనూ నిరాశా నిస్పృహలకు లోనుకావద్దు. మానసిక దృఢత్వంతో సాధించాలనే కసిని పెంచుకోవాలి. సమస్యలను సమర్థంగా ఎదుర్కొన్నప్పుడే జీవితం సార్థకమవుతుంది. ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారు. అంతేకానీ మానసిక స్థైర్యాన్ని కోల్పోయి తల్లిదండ్రులేమంటారో, తోటి స్నేహితులు ఏ విధంగా వ్యవహరిస్తారోనని ముందుగానే తమకు తాము మానసికంగా కృంగిపోయి నిండుజీవితాన్ని మధ్యలోనే ముగించకూడదు. జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలో విద్యార్థులకు తెలియజేసే బాధ్యత ముందు తల్లిదండ్రులు, ఆ తర్వాత, గురువులు, స్నేహితులు తీసుకోవాలి. జీవన పోరాటంలో విజయాలు, వైఫల్యాలు సహజం. నేడున్న ఈ పోటీ ప్రపంచంలో తామనుకున్నది సాధించాలనే కాంక్ష విద్యార్థుల ఆలోచనల్లో పుట్టడం సహజం.ఈ క్రమంలో ఒత్తిళ్లకు, ఆందోళనలకు లోనయ్యేవారు విద్యార్థులు ఎందరో ఉన్నారు. ఇలాంటి విద్యార్థుల్లో అపసవ్యత నెలకొంటుంది. ఈ క్రమంలో ఆ విద్యార్థులు శారీరక అనారోగ్యాలకు గురవుతారు.

ఒకటి నేర్చుకోవాలనుకుంటున్నప్పుడు అది ఎంత కఠినమైనదైనా వెనుకడుగు వేయకూడదు. తోటి మిత్రులు, మేధావులతో చర్చించడం కానీ, విజేతల సాయం తీసుకోవడం కానీ చేయాలి. ఇలా ఎంతోమంది విద్యార్థులు చేసి లక్ష్యానికి చేరువయ్యారు. ఉన్నత శిఖరాలకు ఎదిగారు. ఇలా మనం విజేతలను ఆదర్శంగా తీసుకొని భావితరాలకు స్ఫూర్తిగా నిలుద్దాం.

**- అట్ల శ్రీనివాస్‌రెడ్డి, కరీంనగర్**


**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా:** 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118



Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.



epaper.ntnews.com

# ముమ్మరంగా సమ్మక్క బరాజ్ పనులు

3 షిఫ్టుల్లో 3,500 మంది కార్మికుల పని

**ఏటూరునాగారం(ములుగు):**

ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకుల గూడెం వద్ద నిర్మిస్తున్న సమ్మక్క బరాజ్ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. దేవాదుల ప్రాజెక్టు ఎగువన గోదావరి నదిపై రూ.1,625 కోట్ల వ్యయంతో 7.95 టీఎంసీల సామర్థ్యంతో సమ్మక్క (తుపాకులగూడెం) బరాజ్ నిర్మాణం జరుగుతున్నది. ఇందుకోసం 59 గేట్లను ఏర్పాటుచేస్తున్నారు. నిత్యం 3,500 మంది కార్మికులు 3 షిఫ్టలలో 24 గంటలపాటు పనులు చేపడుతున్నారు. ప్రస్తుతం 59 పిల్లర్లు నిర్మిస్తున్నారు. ఇందులోభాగంగా 54 పిల్లర్ల పనులు దాదాపు పూర్తికాగా, మరో ఐదింటి పనులను వేగంగా జరుగుతున్నాయి. మార్చి నెలాఖరులో సివిల్ పనులు పూర్తిచేసేందుకు నీటిపారుదలశాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. గోదావరిపై నిర్మించే బరాజ్ పనులు పూర్తయితే ఎగువప్రాంతంలో ఉన్న దేవాదుల ఎత్తిపోతల పథకంలో ఏడాదిపాటు నీటినిల్వలు కొనసాగించే అవకాశాలు ఉన్నాయి. సమ్మక్క బరాజ్ పనులను త్వరగా పూర్తిచేసేందుకు సీఎం కేసీఆర్‌తోపాటు మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సీఎంవో ప్రత్యేక కార్యదర్శి స్మితాసబర్వాల్ తదితరులు పలుమార్లు బరాజ్‌ను సందర్శించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు.



కొనసాగుతున్న సమ్మక్క బరాజ్ పనులు

## 10 వేల సీడ్ బాల్స్ తయారీ

సీఎం పుట్టినరోజున

అడవిలో చల్లేందుకు ఏర్పాట్లు

**వీర్నపల్లి :** ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టినరోజును పురస్కరించుకొని ఈ నెల 17న మొక్కలు నాటాలని మంత్రి కేటీఆర్ ఇచ్చిన పిలుపుమేరకు విద్యార్థులు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లిలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు 10 వేల విత్తన బంతులు తయారు చేశారు. వీటిని అటవీ ప్రాంతంలో చల్లేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సీడ్ బాల్స్ తయారీని జెడ్పీటీసీ కళావతి శుక్రవారం పరిశీలించారు.



జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణంలో జరుగుతున్న తిక్కవీరేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మార్కెట్ సబ్ యార్డు ఆవరణలో ఎరుకలి సంఘం ఆధ్వర్యంలో పందుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు తెలంగాణ, ఏపీ, కర్ణాటక రాష్ట్రాల నుంచి 10 జతల పందులను తీసుకొచ్చారు. ఈ పోటీలను భక్తులు ఆసక్తిగా తిలకించారు. - అయిజ





నారాయణపేట జిల్లా కోస్గి మండలం పోలేపల్లిలో రేణుకా ఎల్లమ్మ సిడె వైభవంగా జరిగింది. శుక్రవారం సాయంత్రం ప్రారంభమైన జల్దీ కార్యక్రమంతో ఉత్సవాన్ని ప్రారంభించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని సిడెలో ఉంచి ఆలయం చుట్టూ ఐదుసార్లు ప్రదక్షిణలు చేయించారు. ఈ వేడుకను తిలకించడానికి పొరుగు జిల్లాలతోపాటు, మహారాష్ట్రలోని షోలాపూర్, భీవండి, గుజరాత్‌లోని అహ్మదాబాద్, సూరత్ నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. - కోస్గి

# మంత్రి కేటీఆర్ ఔదార్యం

- సారంపల్లిలోని కూలీకి వెన్నెముక శస్త్రచికిత్సకు సాయం
- రూ.లక్ష ఎల్‌వోసీ మంజూరు
- మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన బాధిత కుటుంబం

**సిరిసిల్ల రూరల్ :** రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ మరోసారి ఔదార్యాన్ని చాటుకున్నారు. వ్యవసాయ కూలీ వెన్నెముక శస్త్ర చికిత్సకు ఆపన్నహస్తం అందించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం సారంపల్లికి చెందిన సుంకరి కనకయ్య వ్యవసాయంతోపాటు కూలీగా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా వెన్నెముక సమస్యతో బాధపడుతున్నాడు. పలు దవాఖానలు తిరిగిన కనకయ్య, సికింద్రాబాద్‌లోని ఓ దవాఖానలో పరీక్షలు చేయించుకున్నాడు. శస్త్రచికిత్స చేయించుకోవాలని వైద్యులు సూచించారు. తన వద్ద ఉన్న రూ.లక్షతో హస్పిటల్‌లో చేరిన కనకయ్యకు ఆపరేషన్ కోసం డబ్బులు లేకపోవడంతో స్థానిక సర్పంచ్ కొయ్యడ రమేశ్‌కు విషయం చెప్పాడు. రమేశ్ ఈ విషయాన్ని మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లాడు. వెంటనే స్పందించిన మంత్రి రూ.లక్ష ఎల్‌వోసీని మంజూరు చేయించారు. ఆ పత్రాన్ని శుక్రవారం బాధిత కుటుంబానికి సర్పంచ్ రమేశ్, ఎంపీటీసీ గుగ్గిల్ల లావణ్య, ఉపసర్పంచ్ పర్శరాములు, ఆంజనేయులు అందజేశారు. ఈసందర్భంగా మంత్రి కేటీఆర్‌కు కనకయ్య, అతని కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# నెరవేరనున్న సొంతింటి కల

- పంపిణీకి సిద్ధంగా సిరిసిల్ల డబుల్ బెడ్‌రూం ఇండ్లు
- సకల వసతులతో 1,320 గృహాల నిర్మాణం
- ఉగాది కానుకగా అందించేందుకు సన్నాహాలు
- మంత్రి కేటీఆర్ ఆదేశాలతో ఏర్పాట్లలో అధికారులు

**సిరిసిల్ల రూరల్:** సిరిసిల్ల పేదల సొంతింటి కల అతిత్వరలో సాకారం కాబోతున్నది. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం మండెపల్లి శివారులో పనులు పూర్తయి.. డబుల్ బెడ్‌రూం ఇండ్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. రూ.80 కోట్లతో 30 ఎకరాల సువిశాల స్థలంలో అధునాతన హంగులు, సకల వసతులతో 1,320 ఇండ్లు నిర్మాణం పూర్తిచేసుకున్నాయి. ఐటీ, మున్సిపల్‌శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ ప్రత్యేక చొరవతో విశాలమైన రోడ్లు.. డ్రైనేజీలు.. అన్ని హంగులతో పంపిణీకి సిద్ధమయ్యాయి. ఇటీవల జరిగిన సమీక్ష సమావేశంలో డబుల్ బెడ్‌రూం ఇండ్లను ప్రారంభించడానికి సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించడంతో, అధికారులు వేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఇండ్లను సిరిసిల్లవాసులకు ఉగాది కానుకగా అందించనుండగా.. పేద, మధ్యతరగతి వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం మండెపల్లి శివారులో పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇండ్లు. (ఇన్‌సెట్‌లో) 2018లో పనులను పరిశీలిస్తున్న మంత్రి కేటీఆర్ (ఫైల్)

**సకల వసతులు..**

తంగళ్లపల్లి మండలం మండెపల్లి శివారులో 2017 మార్చి 10న డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణ పనులకు మంత్రి కేటీఆర్ భూమిపూజ చేశారు. వీటి నిర్మాణ బాధ్యతలను జాతీయస్థాయిలో పేరున్న హైదరాబాద్‌కు చెందిన నవతేజ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీకి అప్పగించారు. ఇందులో సిరిసిల్ల వాసులకు 1,260, మండెపల్లివాసులకు 60ఇండ్లు కేటాయించారు. రూ.80 కోట్లతో జీ+4 విధానంలో ఒక్కో బ్లాక్‌కు 12 ఇండ్ల చొప్పున మొత్తం 105 బ్లాకుల్లో నిర్మాణాలు చేపట్టారు. మరో రూ.21 కోట్లు కేటాయించి సుందరీకరణ పనులు పూర్తిచేశారు. రూ.8 కోట్లతో మండెపల్లి నుంచి ఇండ్ల వరకు 1.8 కి.మీ. బీటీ డబుల్ రోడ్డు వేశారు. ఇంటింటికీ మిషన్ భగీరథ నీటిని అందించనున్నారు. ప్రహరీ, రోడ్డుకు ఇరుపక్కలా డ్రైనేజీలు, ఐదెకరాల్లో పార్కులు, పైలాన్ ఏర్పాటుచేశారు. 40 ఫీట్ల ప్రధాన రహదారి, 30 ఫీట్ల కాలనీ రోడ్లు, ప్రధాన గేటుతో కాలనీని నిర్మించారు.

**రాష్ట్రానికే తలమానికంగా..**

సిరిసిల్లలో నిర్మించే డబుల్ బెడ్‌రూం ఇండ్లు రాష్ట్రానికే తలమానికంగా ఉండాలని మంత్రి కేటీఆర్ ఆకాంక్షించారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ఇరుకు గదుల్లా కాకుండా పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా ఈ డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించి ఇవ్వాలని భావించారు. అమాత్యుడి ఆలోచనకు అనుగుణంగా సిరిసిల్ల పట్టణంలో అనువైన స్థలం లేకపోవడంతో తంగళ్లపల్లి మండలం మండెపల్లి శివారులోని 30 ఎకరాల్లో 1,320 డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణాల పనులను ఏకకాలంలో చేపట్టారు. నిర్మాణాలు ప్రారంభమైనప్పటి నుంచి పూర్తయ్యే వరకు మంత్రి నిరంతరం పర్యవేక్షించారు. ఎప్పటికప్పుడు అధికారులకు దిశానిర్దేశం చేస్తూ సుందరీకరణ, మౌలిక వసతుల కల్పనతోపాటు భద్రతకు పెద్దపీట వేశారు.

**కేసీఆర్ నగర్‌గా నామకరణం!**

మండెపల్లి శివారులో దాదాపు 5 వేల మంది నివసించేలా నిర్మించిన 1,320 డబుల్ బెడ్‌రూం ఇండ్ల కాలనీకి సీఎం కేసీఆర్ పేరు పెట్టాలని.. కేసీఆర్ నగర్ పేరుతో కాలనీని ప్రారంభించే యోచనలో మంత్రి కేటీఆర్ ఉన్నట్టు తెలిసింది. ఉగాది పండుగకు సిరిసిల్ల ప్రజలకు కానుకగా ఈ ఇండ్లను అందించేందుకు మంత్రి ఆదేశాలతో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## రాజన్న సన్నిధిలో ఉద్యోగి చేతివాటం

**వేములవాడ కల్చరల్:** రాజన్న ప్రసాదాల కౌంటర్‌లో ఓ ఉద్యోగి చేతివాటాన్ని ప్రదర్శించాడు. దాదాపు రూ.లక్ష సొంతానికి వాడుకున్నాడు. ఆలయంలోని లడ్డూకౌంటర్‌లో విధులు నిర్వర్తిస్తున్న నరాల రాజు గత జనవరి 28 నుంచి ఫిబ్రవరి 8వరకు సెలవుపై వెళ్లారు. ఆ సమయంలో లాల రాజు అనే మరో ఉద్యోగి లడ్డూ కౌంటర్ విధులు చేపట్టాడు. సెలవులు పూర్తికావడంతో నరాల రాజు 9వ తేదీన విధుల్లో చేరారు. లడ్డూ టికెట్ల సొమ్ము తక్కువ రావడంతో ఆలయ పర్యవేక్షకునికి సమాచారం ఇచ్చారు. ఆలయంలోని ప్రసాదాల కౌంటర్‌లో టికెట్ల ద్వారా వచ్చిన లక్షా రెండు వేల రూపాయలను లాలా రాజు వాడుకున్నట్టు తెలిసింది. దీంతో ఈవో కృష్ణవేణి అతడిని సస్పెండ్ చేసినట్టు ఆలయ అధికారులు తెలిపారు.

## వరంగల్ జిల్లా పాడిరైతులకు శుభవార్త

**వరంగల్ (రెడ్డికాలనీ):** వరంగల్ విజయ డెయిరీ పాలసేకరణ ధర లీటర్‌కు రూ.2 పెంచినట్టు డెయిరీ ఉపసంచాలకులు రవికుమార్ శుక్రవారం తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని జనగామ మినహా 3,500 పాడి రైతులు రోజూ 10 వేల లీటర్ల పాలు పోస్తున్నారని పేర్కొన్నారు. ఆవుపాలు, గేదెపాలు లీటర్‌కు రూ.2 పెంచామని.. ఈ పెంపు ఫిబ్రవరి ఒకటి నుంచి వర్తిస్తుందన్నారు.

# పెద్దపల్లి జిల్లాలో కాల్పుల కలకలం

- సోషల్ మీడియాలో తుపాకీ కాల్పుల వీడియో వైరల్
- జనవరి ఒకటిన పేల్చిన సీఆర్పీఎఫ్ మాజీ జవాన్
- అరెస్టు చేసిన పోలీసులు



తిరుమల్ రెడ్డి

**పెద్దపల్లి ప్రతినిధి, నమస్తేతెలంగాణ:** సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన సాయంపేట తుపాకీ కాల్పుల ఘటనలో సీఆర్పీఎఫ్ మాజీ జవాన్ బద్దం తిరుమల్‌రెడ్డి(40)తోపాటు మరో ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. పెద్దపల్లి జోన్ డీసీపీ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం సాయంపేటకు చెందిన బద్దం తిరుమల్‌రెడ్డి 2002 నుంచి 2019 మే వరకు సీఆర్పీఎఫ్‌లో పనిచేశాడు. ఉద్యోగ విరమణ తర్వాత డీబీబీఎల్ లైసెన్స్‌డ్ వెపన్, 20 బుల్లెట్లు తీసుకున్నాడు. గత జనవరి ఒకటిన రాత్రి స్నేహితులు, సన్నిహితుల ప్రోత్సాహంతో గ్రామంలో గాలిలోకి కాల్పులు జరిపాడు. దీన్ని కొంతమంది సెల్‌ఫోన్‌లో వీడియోతీశారు. ఈ క్రమంలో గురువారం రాత్రి గ్రామంలో జరిగిన ఓ వివాహ వేడుకలో తిరుమల్‌రెడ్డికి మరికొందరికి మధ్య గొడవ జరిగింది. తిరుమల్‌రెడ్డితో గొడవపడ్డ వారు ఆయన గతంలో జరిపిన కాల్పుల వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్‌చేయగా వైరల్ అయింది. విషయం పోలీసుల దృష్టికి వెళ్లడంతో పెద్దపల్లి డీసీపీ రవీందర్ సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టారు. తిరుమల్‌రెడ్డి బహిరంగంగా కాల్పులు జరిపిన విషయాన్ని ధ్రువీకరించి శుక్రవారం అతడి వద్ద నుంచి వెపన్‌తోపాటు ఆరు బులెట్లను స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేశారు. కాల్పులకు ప్రోత్సహించిన బద్దం కార్తీక్‌రెడ్డి, బొల్లం శ్రీనివాస్, బొడిగె శ్రీకాంత్, కూకట్ల వెంకటేశ్, బద్దం లక్‌పతిరెడ్డి, నేరెళ్ల రాకేశ్‌ను కూడా అరెస్టు చేసినట్టు డీసీపీ వెల్లడించారు.

# కొనసాగుతున్న ఎత్తిపోతలు

- నంది, గాయత్రి పంపుహౌసుల్లో నడుస్తున్న మోటర్లు
- ఎస్సారార్‌కు చేరిన రెండు టీఎంసీలు

**కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తేతెలంగాణ:** కాళేశ్వరం లింక్-2లో గోదావరి జలాల ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. కరీంనగర్ జిల్లా రామడుగులోని గాయత్రి పంప్‌హౌస్ ద్వారా ఈ నెల 10 నుంచి రాత్రి వేళల్లో ఇప్పటివరకు రెండు టీఎంసీలు ఎత్తిపోసినట్టు అధికారులు తెలిపారు. ఆరో ప్యాకేజీలో భాగంగా పెద్దపల్లి జిల్లా నందిమేడారంలోని నంది పంప్‌హౌస్‌లో శుక్రవారం రాత్రి 8గంటలకు మళ్లీ మోటర్లు ప్రారంభించారు. 2, 3, 5, 6వ మోటర్ల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని కాళేశ్వరం ఏడో ప్యాకేజీలోని నంది రిజర్వాయర్‌లోకి తరలిస్తున్నారు. ఇక్కడి నుంచి జలాలు ఎనిమిదో ప్యాకేజీ రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రి పంపుహౌస్ సర్జ్‌పూల్‌కు చేరుతున్నాయి. ఇక్కడ శుక్రవారం రాత్రి 9 గంటల తర్వాత 2, 3, 4, 7వ మోటర్లను ప్రారంభించారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రాజెక్టు ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు సూచనలతో జలాలను ఎత్తిపోస్తున్నారు. ఐదు టీఎంసీలను ఎస్సారార్‌కు తరలించడమే లక్ష్యంగా అధికారులు నిరంతరం కృషి చేస్తుండగా ఇప్పటివరకు 2 టీఎంసీల నీటిని ఎత్తిపోసినట్టు తెలిపారు.



శుక్రవారం రాత్రి పెద్దపల్లి జిల్లా నంది పంప్‌హౌస్ డెలివరీ సిస్టర్న్‌ల నుంచి ఉప్పొంగుతున్న నీరు

**ఎస్సారార్ నుంచి 6 వేల క్యూసెక్కుల అవుట్‌ఫ్లో**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం శ్రీరాజరాజేశ్వర జలాశయం నుంచి ఎల్‌ఎండీకి శుక్రవారం 6 వేల క్యూసెక్కుల నీటిని పంపించారు. జలాశయంలో 24.778 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది.

**ఎల్‌ఎండీకి ఇన్‌ఫ్లో**

ఎస్సారార్ రిజర్వాయర్ నుంచి ఎల్‌ఎండీకి 4,987 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 5,751 క్యూసెక్కుల నీరు అవుట్‌ఫ్లో నమోదైనట్టు అధికారులు తెలిపారు. ఎల్‌ఎండీలో ప్రస్తుతం 8.370 టీఎంసీల నీరు ఉన్నట్టు చెప్పారు.

**నిండుగా లక్ష్మి బరాజ్**

**మహదేవపూర్:** కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్మించిన లక్ష్మి బరాజ్ నిండుకుండలా మారింది. ఎగువ నుంచి వస్తున్న నీటి ప్రవాహం బరాజ్‌లో చేరుతుండటంతో క్రమంగా నీటి నిల్వ పెరుగుతున్నది. బరాజ్‌లో శుక్రవారం 14.287 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు సంబంధిత అధికారులు పేర్కొన్నారు. లక్ష్మిబరాజ్ పూర్తి సామర్థ్యం 16.17 టీఎంసీలు, 100 మీటర్ల ఎత్తు కాగా, మరి కొన్ని రోజుల్లో పూర్తి సామర్థ్యాన్ని చేరుకునేలా నీటి ప్రవాహం కొనసాగుతున్నది. బరాజ్‌లో 99.400 మీటర్ల ఎత్తులో ప్రవాహం కొనసాగుతున్నట్టు అధికారులు తెలిపారు.

# బీమా డబ్బుల కోసం..

- వరుసకు బాబాయిని హత్య చేసిన ఘనుడు
- పథకం ప్రకారం ఆరునెలల క్రితమే రూ.50లక్షల బీమా

**మునగాల:** లారీల వ్యాపారంతో పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయిన ఓ వ్యక్తి.. తాను బయటపడేందుకు వరుసకు బాబాయి అయ్యే వ్యక్తిని అంతమొందించాడు. దాదాపు ఆరు నెలల ముందే అతడి పేరిట రూ.50 లక్షల బీమా చేయించి.. ఆ సొమ్మును దక్కించుకునేందుకు గతనెల 24న హత్యచేశాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా మునగాల మండలంలో చోటుచేసుకున్నది. మునగాల సీఐ శివశంకర్‌గౌడ్ శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. మునగాల మండలం తాడ్వాయికి చెందిన ముంజల రమేశ్ గతంలో లారీ క్లీనర్‌గా పనిచేశాడు. తెలిసిన వారి వద్ద అప్పు చేయడంతోపాటు ఫైనాన్స్ తీసుకొని నాలుగు లారీలు కొనుగోలు చేసి సరుకు రవాణా చేసేవాడు. వ్యాపారంలో నష్టపోయి ఆర్థికంగా చితికిపోయాడు. దీంతో ఫైనాన్స్ నిర్వాహకులు లారీలను తీసుకెళ్లారు. కాగా రమేశ్‌కు వరుసకు బాబాయి అయ్యే ముంజల సైదులుతో జమానతుతో రెండు లారీలను ఫైనాన్స్ ద్వారా కొనుగోలు చేశాడు. వాటికి కూడా కిస్తీలు చెల్లించకపోవడంతో ఫైనాన్స్ నిర్వాహకులు లాక్కెళ్లారు. అప్పులు తీర్చేందుకు క్రిమినల్ ఆలోచనలకు పదును పెట్టాడు. సైదులు పేరిట కోదాడ ఐసీఐసీఐ బ్యాంకులో 2019 జూలైలో రూ.50 లక్షల బీమా పాలసీ చేసి రూ.12,575 ప్రీమియం చెల్లించాడు. తరువాత సైదులును హత్య చేసేందుకు నిర్ణయించుకొని అదే గ్రామానికి చెందిన స్నేహితులు గంధం మహేశ్, మాతంగా శోభన్ బాబులకు విషయం చెప్పాడు. సైదులును అంతమొందిస్తే రూ.50 లక్షలు వస్తాయని, అందులో ఇద్దరికి రూ.5 లక్షల చొప్పున ఇస్తానని చెప్పాడు. గత జనవరి 24న సైదులు చేత బాగా మద్యం తాగించి జాతీయ రహదారిపై గల ఇందిరానగర్ పార్కింగ్ స్థలంలో బొలెరో వాహనంతో ఢీకొట్టి హత్యచేశారు. తొలుత రోడ్డుప్రమాదంగా భావించిన పోలీసులు విచారణ చేపడుతున్న సమయంలో సైదులు పేరిట రూ.50 లక్షల బీమా ఉన్నట్టు గుర్తించారు. రమేశ్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేయడంతో బీమా డబ్బుల కోసం హత్య చేసినట్టు తేలింది. రమేశ్‌తోపాటు అతడికి సహకరించిన గంధం మహేశ్, మాతంగి శోభన్‌లను కూడా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ శివశంకర్‌గౌడ్ తెలిపారు.

## కేంద్ర బడ్జెట్ బూటకం

- 24 నుంచి ఆందోళనలు
- ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పెద్ద బూటకమని ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ ఆరోపించారు. 2020-21 బడ్జెట్ పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా, కార్మికులకు వ్యతిరేకంగా ఉన్నదని విమర్శించారు. శుక్రవారం ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. లాభాల్లో నడుస్తున్న ప్రభుత్వరంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం కారుచౌకగా కార్పొరేట్లకు కట్టబెడుతున్నదని మండిపడ్డారు. బీపీసీఎల్‌ను (భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్) పూర్తిగా, ఎల్‌ఐసీలో 10 శాతం వాటాలను కార్పొరేట్లకు విక్రయించాలని కేంద్రం నిర్ణయించడం సరికాదన్నారు. కేంద్రప్రభుత్వ విధానాలకు నిరసనగా ఈ నెల 24 నుంచి మార్చి 2 వరకు దేశ వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతున్నట్టు అమర్‌జిత్‌కౌర్ పేర్కొన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు బాల్‌రాజ్, ప్రధాన కార్యదర్శి బోస్ తదితరులు పాల్గొన్నారు.

## జగన్ సీబీఐ కేసులు 28కి వాయిదా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఏపీ సీఎం వైఎస్ జగన్ ఆదాయానికి మించిన ఆస్తుల కేసు ఈ నెల 28కి వాయిదా పడింది. ఢిల్లీ పర్యటనలో ఉన్నందున విచారణకు హాజరుకాలేకపోతున్నానని, వ్యక్తిగత హాజరుపై హైకోర్టులో కేసులు విచారణలో ఉన్నాయని జగన్ దాఖలుచేసిన ఆబ్సెంట్ పిటిషన్‌ను సీబీఐ కోర్టు అనుమతించింది. ఈ కేసులో పలువురు అధికారులు విచారణకు హాజరయ్యారు.

# నకిలీ వీసాల ముఠా అరెస్ట్

- దుబాయ్ మీదుగా కువైట్‌కు మహిళల అక్రమ తరలింపు
- నిందితులను అరెస్టుచేసిన శంషాబాద్ ఎస్‌వోటీ పోలీసులు



మీడియా సమావేశంలో కేసు వివరాలు వెల్లడిస్తున్న సీపీ సజ్జనార్

**శేరిలింగంపల్లి:** నకిలీ వీసాలతో మహిళలను అక్రమంగా కువైట్‌కు పంపుతున్న ముఠాను శంషాబాద్ జోన్ స్పెషల్ ఆపరేషన్ టీంఅరెస్టుచేశారు. శుక్రవారం సైబరాబాద్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లా తణుకు ప్రాంతానికి చెందిన రెల్లు కుబేందర్‌రావు అలియాస్ చిన్నా (32) 2016లో హైదరాబాద్‌కు వచ్చి రాజేంద్రనగర్‌లో ఎయిర్‌టికెట్లను బుక్‌చేసే ఆఫీసుప్రారంభించాడు. రెండేండ్ల తర్వాత నకిలీ వీసాలు, పత్రాలు తయారుచేసి మహిళలను అక్రమంగా కువైట్ పంపించడం మొదలుపెట్టాడు. కువైట్‌కు వెళ్లి పనిచేయాలనుకొనే మహిళల నుంచి డబ్బులు తీసుకొని అక్రమంగా దుబాయ్ మీదుగా కువైట్ పంపేవాడు. సాధారణంగా కువైట్ వెళ్లాలంటే ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్ సర్టిఫికెట్ అవసరం. ఈ క్రమంలో కుబేందర్‌రావు దుబాయ్ టూరిస్టు వీసాలు వచ్చేలాచేసి ముందుగా అక్కడికి పంపేవాడు. అక్కడ తన ఏజెంట్ల ద్వారా ఆ మహిళలను కువైట్‌కు తరలించేవాడు. వారికి పోలీస్ క్లియరెన్స్, వీసా స్టాంపింగ్, మెడికల్ సర్టిఫికెట్లన్నీ నకిలీవి తయారుచేసి ఇచ్చేందుకు తమిళనాడులోని కుంభకోణంకు చెందిన షేక్ బషీర్, బాలుప్రసాద్ సహాయం తీసుకొనేవాడు. కువైట్‌లో ఏజెంట్లు లక్ష్మి, శారద, శ్రీను, సారా వారికి ఉద్యోగం చూపించేవారు. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన కాశీకుమారి ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టిన శంషాబాద్ జోన్ ఎస్‌వోటీ పోలీసులు శుక్రవారం కుబేందర్‌రావు, షేక్ బషీర్‌ను అదుపులోకి తీసుకొన్నారు. బాలుప్రసాద్ పరారీలో ఉన్నా డు. సబ్‌ఏజెంట్లుగా వ్యవహరిస్తున్న పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన కనపాల మోహన్‌రావు, ఇందేటి అగస్టిన్, శ్రీమువళ్ల రుత్తమ్మ, కొల్లాటి రామకృష్ణ, తూర్పుగోదావరి జిల్లాకు చెందిన యన్నమడల సునీతను కూడా పోలీసులు అరెస్టుచేశారు. ఒక్కొక్కరి నుంచి లక్షకుపైగా వసూలుచేసి 21 మందిని నకిలీ వీసాలతో కువైట్‌కు పంపిచినట్టు విచారణలో తేలింది.



శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ పట్టుకున్న బంగారం బిస్కట్లు

## 1,200 గ్రాముల బంగారం పట్టివేత

**శంషాబాద్:** శంషాబాద్ ఎయిర్‌పోర్టులో శుక్రవారం తెల్లవారుజామున కస్టమ్స్, ఎయిర్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఏఐయూ) అధికారులు కిలోపైగా స్మగ్లింగ్ బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. జెడ్డానగరం నుంచి హైదరాబాద్‌కు ఎయిరిండియా విమానంలో వచ్చిన ఓ ప్రయాణికుడి లగేజీని సోదాచేయగా నాలుగు బంగారం బిస్కట్లు లభించాయి. పట్టుబడిన 1200 గ్రాముల స్మగ్లింగ్ బంగారం విలువ రూ.48 లక్షలు ఉంటుందని, స్మగ్లర్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు అధికారులు తెలిపారు.

## చంద్రబాబు ఆస్తుల కేసుపై 26న నిర్ణయం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఏపీ మాజీ సీఎం చంద్రబాబునాయుడు ఆదాయానికి మించిన ఆస్తులపై దర్యాప్తుచేపట్టాలని లక్ష్మీపార్వతి దాఖలుచేసిన ఫిర్యాదుపై ఈ నెల 26న నిర్ణయం తీసుకొంటామని హైదరాబాద్‌లోని ఏసీబీ కోర్టు వెల్లడించింది. కేసు ఇంకా ఫిర్యాదు దశలోనే ఉన్నందున చంద్రబాబు తరఫు న్యాయవాదుల వాదనలు వినాల్సిన అవసరం లేదని కోర్టు తెలిపింది. సివిల్, క్రిమినల్ కేసుల దర్యాప్తులో విధించిన స్టేలు ఆరునెలలకు మించి కొనసాగరాదని గత ఏడాది సుప్రీంకోర్టు ఉత్తర్వులు వెలువరించింది. సుప్రీంకోర్టు ఉత్తర్వుల తర్వాత మళ్లీ హైకోర్టు నుంచి స్టే పొందారా? లేదా? అనే అంశాన్ని కోర్టు పరిశీలించనున్నది.

# జాగిలాల పాసింగ్ అవుట్ పరేడ్

- విధుల్లోకి 37 జాగిలాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ ఇంటెలిజెన్స్ ట్రైనింగ్ అకాడమీ (ఐఐటీఏ) ఆధ్వర్యంలో శిక్షణ పొందిన 37 జాగిలాలకు శుక్రవారం మొయినాబాద్‌లోని జాగిలాల శిక్షణాకేంద్రంలో పాసింగ్ అవుట్ పరేడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఇంటెలిజెన్స్ ఐజీ నవీన్ చంద్ మాట్లాడుతూ.. 16 ఏండ్ల క్రితం ప్రారంభించిన ఐఐటీఏలో ఇప్పటివరకు 885 జాగిలాలకు తర్ఫీదునిచ్చినట్టు తెలిపారు. పలు ముఖ్యమైన కేసులను ఛేదించడంలో పోలీసుజాగిలాలు కీలకపాత్ర పోషించాయన్నారు. పేలుడు పదార్థాల గుర్తింపు, ప్రమాదకర ప్రాంతాలకు చేరుకోవడం, వీఐపీల భద్రత వంటి అత్యంత కీలకమైన అంశాల్లో జాగిలాలు సహకరిస్తున్నాయని సెక్యూరిటీ విభాగం ఐజీ ఎంకే సింగ్ పేర్కొన్నారు. ఐఐటీఏలో ఇతర రాష్ట్రాల శునకాలకు శిక్షణ ఇస్తున్నామన్నారు. బీహార్‌కు చెందిన 20 శునకాలకు ఇటీవలే అక్రమమద్యం గుర్తించేందుకు ప్రత్యేకశిక్షణ ఇచ్చామని చెప్పారు. పరేడ్ హాజరైన పలువురు అధికారులు జాగిలాలు నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా జాగిలాల ప్రదర్శనలు, సాహకకృత్యాలు ఆకట్టుకున్నాయి. ఉత్తమశిక్షణ పొందిన జాగిలాలు, వాటిశిక్షకులకు ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో సీఐఎస్‌ఎఫ్ ఐజీ సీవీ ఆనంద్, శిక్షణా సంస్థ ప్రిన్సిపాల్ తాజొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



పోలీస్ జాగిలాల పాసింగ్ అవుట్ పరేడ్‌కు హాజరైన ఇంటెలిజెన్స్ ఐజీ నవీన్‌చంద్


తెలంగాణ ప్రభుత్వం
అటవీ శాఖ

T.No: 04/2019-20/S3, ఇ-ప్రాక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన తేది: 13-02-2020

పనుల సంఖ్య: (2), **పనుల పేరు:** దిగువ సంతకందారు పరిధిలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ క్వార్టర్ మరియు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ క్వార్టర్ నిర్మాణం. **మొత్తం ECV: రూ. 48.37 లక్షలు.** బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్: 15-02-2020న ఉ|| 11.30 గం. నుండి. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్‌కు ముగింపు తేది: 24-02-2020న ఉ|| 11.30 గం. టెండరు దాఖలు కొరకు చివరి తేది: 24-02-2020న మ|| 12.00 గం. సాంకేతిక బిడ్ తెరచుట: 24-02-2020న మ|| 1.00 గం. ధర బిడ్ తెరచుట: 24-02-2020న మ|| 2.00 గం. తదుపరి వివరాలను https://tender.telangana.gov.in నుండి పొందవచ్చును.

DIPR RO.No. 2442-DP/CL/ADVT/1/2019-20, Dt: 14-02-2020 సం/- **జిల్లా అటవీ అధికారి, రాజన్న సిరిసిల్ల & కరీంనగర్**

తెలంగాణ ప్రభుత్వం
పంచాయతీరాజ్ ఇంజినీర్ శాఖ

**ఇ-ప్రాక్యూర్‌మెంట్ టెండరు నోటీస్ NIT నం.లు 88 to 94/RO/2019-20, తేది: 27-12-2019 & 99 to 121 (Except 116)/RO/2019-20, తేది: 30-12-2019 & 122 to 125/RO/2019-20, తేది: 02-01-2020 ఆఫ్ RO PR ఆదిలాబాద్‌కు సవరణ నం.4 తేది: 13-02-2020.** NIT నం.లు 88 to 94/RO/2019-20, తేది: 27-12-2019 & 99 to 121 (Except 116)/RO/2019-20, తేది: 30-12-2019 & 125/RO/2019-20, తేది: 02-01-2020 కొరకు టెండర్ ప్రకటన. ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్‌లో టెండర్ లభించు తేదీలు ఇప్పుడు మార్చబడినవి మరియు లభించు తేదీలు 22-02-2020 వరకు. 22-02-2020కి ముందు టెండర్ ప్రచురించబడిన తేదీ నుండి (07) రోజులు టెండర్ చెల్లుబాటుగా ఉంటుంది. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ www.tender.telangana.gov.in నుండి పొందవచ్చును.

సం/- **రీజినల్ ఆఫీసర్ (PR), రీజినల్ ఆఫీస్, ఆదిలాబాద్**

**DIPR RO. No. 2436-DP/CL/Advt/1/2019-20, Dt: 14/02/2020**

సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయం
తెలంగాణ రాష్ట్ర విద్య, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ, హైదరాబాద్

ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

**టెండరు ప్రకటన నం. SE/TSEWIDC/HYD/NIT/771 to 781/2019-20 తేది: 13-02-2020**

తెలంగాణ రాష్ట్రంలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలలో (11) నంబర్లు కామన్ సర్వీస్ సెంటర్ల నిర్మాణం కొరకు అర్హతగల కాంట్రాక్టర్లు అందరినుండి టెండర్లు కోరబడుచున్నవి (రూ. 140-00 లక్షలు/ఒక్కొక్కటి). ఆన్‌లైన్ బిడ్ దాఖలు, స్వీకరణకు ఆఖరి తేది: 04-03-2020, సా. 4.00గం.వరకు. పూర్తి వివరాలను https://tender.telangana.gov.inలో చూడవచ్చును లేదా స్వయంగా సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయం, TSEWIDC,3వ బ్లాక్, 4వ అంతస్తు, రాజీవ్ విద్యా మిషన్ బిల్డింగ్, SCERT కాంపౌండ్, E-గేట్ ఎదుట, LB స్టేడియం, హైదరాబాద్, ఫోన్ నం. 23326692ను సంప్రదించవచ్చును.

సం/- **సూపరింటెండింగ్ ఇంజినీర్, TSEWIDC, హైదరాబాద్**

**DIPR RO. No. 670-PP/CL/Advt/1/2019-20, Dt: 14/02/2020**

వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్ కార్యాలయం
తెలంగాణ ప్రభుత్వం, హైదరాబాద్

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

**ఇ-ప్రొక్యూర్‌మెంట్ T.No. SE(AM)/TS/HYD/Ep/11/2019-20 తేది: 11-02-2020**

**వరంగల్, సంగారెడ్డి, జనగామ, జగిత్యాల, జయశంకర్ (భూపాలపల్లి), యాదాద్రి భువనగిరి, నాగర్‌కర్నూల్, సిద్దిపేట, నిజామాబాద్, నల్గొండ మరియు హైదరాబాద్** జిల్లాలలోని వివిధ మార్కెట్ యార్డుల వద్ద దిగువ (20) పనుల కొరకు నమోదిత సివిల్ కాంట్రాక్టర్లు, ఎలక్ట్రికల్ కంట్రాక్టర్లు గ్రేడ్ A లేదా B లైసెన్స్ కలిగినవారు, గాల్వల్యూమ్ షీట్ రూఫింగ్ కొరకు ప్రముఖ ఏజెన్సీలు మరియు ప్రముఖ, నమోదిత సంస్థల నుండి సూపరింటెండింగ్ ఇంజినీర్ (AM), హైదరాబాద్ వారిచే ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. వ్యయం: **రూ.8,30,93,286/-** ఇ-ప్రొక్యూర్‌మెంట్ సైట్ ప్రారంభ తేది: **క్ర.సం. 1 నుండి 18 కొరకు 14-02-2020న రా. 9.00 గం.** మరియు **క్ర.సం. 19 మరియు 20 కొరకు** సైట్ ప్రారంభ తేది: **12-02-2020న రా. 9.00 గం.** వాపసురాని ప్రాసెసింగ్ రుసుమును ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలి మరియు రిసీట్ జర్నల్ నంబరు/UTR నంబరుతో బ్యాంకర్లు సంతకంచేసిన కౌంటర్‌ఫాయిల్/రిసీట్‌ను స్కాన్‌చేసి, బిడ్లతోపాటు అప్‌లోడ్ చేయాలి. ఏదేని ఇతర సమాచారాన్ని **https://tender.telangana.gov.in** నుండి లేదా సూపరింటెండింగ్ ఇంజినీర్ (AM) కార్యాలయం, హైదరాబాద్ నుండి పొందవచ్చును.

**సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్ (AM) అఫీషియేటింగ్**
**వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్ కార్యాలయం, తెలంగాణ ప్రభుత్వం.**

# మీరు కొంటున్నది నగలు.. శ్రద్ధ చాలా ముఖ్యం!

## ప్రతి గ్రాములోనూ మీ శ్రమ ఉంది

### నాణ్యత

BIS 916 హాల్‌మార్క్ నగలను మాత్రమే కొనండి. హాల్‌మార్కు లేకుండా నగలు కొంటే బంగారం నాణ్యత ఏంటనేది తెలియదు. అంత డబ్బులు పెట్టి మనం ఏం కొంటున్నామో కూడా తెలియకపోతే ఎలా?




### బిల్లు

దయచేసి బిల్లు లేకుండా నగలు కొనకండి. జీఎస్టీ చెల్లించి బిల్లు తీసుకుంటే మీ కొనుగోలు సంపూర్ణం అవుతుంది. దేశానికి, ప్రభుత్వానికి కూడా మేలు చేకూరుతుంది. బిల్లులో నగల వివరాలు ఉన్నందువల్ల భవిష్యత్తులో మీకు భద్రత ఉంటుంది.



### డిజైన్

మావద్ద లక్షలాది డిజైన్లు ఉన్నాయి. అవి కాకుండా మీకు నచ్చిన డిజైన్ ఫొటో మాకు చూపిస్తే మీకోసం ప్రత్యేకంగా 15 నుంచి 25 రోజుల్లో అందంగా చేసిస్తాం.

మీరు ఆర్డరిచ్చే ప్రత్యేకమైన డిజైన్లను మా వద్ద అతి తక్కువ తరుగుకు కొనవచ్చు.



**వజ్రాభరణాలు: క్యారెట్‌కు రూ.3000 తగ్గింపు! రూ.~~46000~~ రూ. 43000 నుంచి! V.A. గ్రాముకురూ.975 మాత్రమే**

## వజ్రాభరణాల విక్రయాలలోనే ఎక్కువ జిమ్మిక్కులు ఉన్నాయి. ఈ విషయాలను తప్పక చదవి జాగ్రత్త పడండి.



**అథెంటిసిటీ (నాణ్యత నిర్ధారణ) సర్టిఫికెట్**

షోరూంవాళ్లు సొంతంగా తయారు చేసే 'ఇన్‌హౌస్' సర్టిఫికెట్‌ను నమ్మకండి. ఎందుకంటే, తమ వస్తువు నాణ్యతలేనిదని ఎవరైనా చెబుతారా? గుర్తింపు పొందిన మూడోవ్యక్తి (సంస్థ) ఇచ్చే నాణ్యత సర్టిఫికెట్ కావాలని అడగండి. (లలితా జ్యువెల్లరిలో ప్రతి వజ్రాభరణం అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందిన జెమ్మాలజీ సంస్థ ఇచ్చే సర్టిఫికెట్ పొందినవే.)

**ఎక్స్ఛేంజ్ పాలసి**

వజ్రాభరణాలకు మార్పిడికైతే 100% బైబ్యాక్, నగదుగా, బంగారు నగలుగా అయితే 85% బైబ్యాక్ ఉండాలి. (ఎక్స్ఛేంజ్ చేసుకునే రోజు నాటి మా వజ్రపు ధర ప్రకారం. లలితా జ్యువెల్లరిలో మార్పిడి చేసుకోవచ్చు.)

**కలర్ & క్లారిటీ**

మీరు కొనే వజ్రాభరణాలకు E-F కలర్‌గ్రేడ్ మరియు VVS క్లారిటీ ఉన్నాయా అని సరిచూసుకోండి. తక్కువ ధరకు లభిస్తున్నాయనే కారణం వల్ల G-H కలర్‌గ్రేడ్ వంటి నాణ్యత తక్కువైన ఆభరణాలను కొనకూడదు. (లలితా జ్యువెల్లరిలో E-F కలర్‌గ్రేడ్, VVS క్లారిటీ వజ్రాభరణాలు మాత్రమే అందజేస్తున్నాం.)

**క్యారెట్‌కు అధిక ధర చెల్లిస్తే ఏమవుతుంది?**

4 క్యారెట్ బరువున్న వజ్రాభరణానికి కేవలం రూ.5,000 అధికంగా ఇచ్చినా కానీ రూ.20,000 కోల్పోవాల్సి వస్తుంది! లలితా జ్యువెల్లరిలో రూ.43,000లకే అందిస్తున్న ఈ వజ్రాభరణాన్ని మార్కెట్‌లో రూ.60,000, రూ.70,000 అంటూ విక్రయిస్తున్నారు. ఆఖరి ధరల్లో వ్యత్యాసమేంటో మీరే లెక్కగట్టి తెలుసుకోవచ్చు!

**ధరలు చెక్ చేయండి!**



| వజ్రపు వ్యాసం (సెంట్లలో) | మార్కెట్లో వజ్రపు ధర క్యారెట్‌కి | లలితా జ్యువెల్లరిలో వజ్రపు ధర క్యారెట్‌కి |
|---|---|---|
| 0 నుంచి 0.0749 | రూ.60000 నుంచి 76000 | రూ.43000 |
| 0.0750 నుంచి 0.1349 | రూ.76000 నుంచి 85000 | రూ.63500 |
| 0.1350 నుంచి 0.1749 | రూ.98500 నుంచి 105000 | రూ.80000 |
| 0.1750 నుంచి 0.2249 | రూ.108500 నుంచి 112000 | రూ.91000 |

ధరలు సర్వదేశ ఎగుమతి దిగుమతులకు తగినట్టు నిర్ణయించబడతాయి.

## నగల కొనుగోలు పథకం

లలితా జ్యువెల్లరి మాత్రమే అందిస్తోంది. **మార్కెట్‌లోనే అధిక ప్రయోజనాలు అందించే 2 పథకాలు !**

**11 నెలల 'నగల కొనుగోలు పథకం'.**

**తొలి వాయిదా ఉచితం**
**+**
**తరుగు (V.A.) 50% ఉచితం**

అన్ని బంగారు నగలకు వర్తిస్తుంది.

చిన్న వాయిదాలు: రూ.1000 / రూ.1500 / రూ.2000 / రూ.2500

ప్రతినెల మీరు చెల్లించే నగదు, ఆరోజునాటి విలువ ప్రకారం 22 క్యారెట్ బంగారంగా జమా చేయబడుతుంది.

**అడ్వాన్స్ నగల బుకింగ్ స్కీమ్**

One Time Payment !

**ఏ నగకూ 100% V.A. లేదు**

5 నెలల నుంచే ఫలితం!

11 నెలల తర్వాత నగను కొనేటప్పుడు, 14% లేదా 16% వరకు V.A. ఉన్న నగ అయినప్పటికీ.. 1% V.A. కూడా చెల్లించనక్కర్లేదు.

మీ పాత నగలను ఇచ్చి కూడా ఈ పథకంలో చేరొచ్చు.

కేవలం అరశాతం (0.5%) మీ పాత బంగారు నగలను మెల్టింగ్, ప్యూరిఫికేషన్ చేసేందుకు పట్టుకుంటాం.

## తప్పక చూడండి!

**డాక్టర్ ఎం.కిరణ్‌కుమార్ ఇంటర్వ్యూను తప్పకుండా చూడండి.**

యువత జీవితంలో విజయం సాధించేందుకు పలు సలహాలు, సూచనలు ఇందులో ఉన్నాయి. నగలు కొనడం, డబ్బు ఆదా చేయడానికి సంబంధించి, అవగాహన కల్పించే విషయాలు కూడా ఉన్నాయి.

https://youtu.be/HYBogKvFscY

1.4 M VIEWS

అద్వితీయమైన మా నగల కొనుగోలు పథకానికి సంబంధించి వివరాలను ఈ వీడియో ద్వారా తెలుసుకోండి.

https://youtu.be/6qdydUnfIVI

## వెండివస్తువులు

బంగారు నగలు, వజ్రాభరణాలు మాదిరిగా వెండి వస్తువుల ధరలను కూడా బాగా పోల్చి కొనాలి. ఎందుకంటే, ప్రతిరూపాయి ముఖ్యం!

**90% వెండి వస్తువులకు మజూరి, తరుగు లేదు**



Lalithaa®

www.lalithaajewellery.com

100% నాణ్యత - BIS 916 హాల్‌మార్క్ లక్షలాది డిజైన్లు!

## లలితా జ్యువెల్లరి మార్ట్ ప్రై. లిమిటెడ్

హైదరాబాద్ - సోమాజిగూడ: 6-3-883, SBR సౌక్, రాజీవ్‌గాంధీ విగ్రహం ఎదురుగా. ఫోన్: 040 - 6748 6677.

కూకట్‌పల్లి : 2-22-298, PNR ఎంపైర్, కళామందిర్ పక్కన, KPHB మెట్రో స్టేషన్ సమీపం. ఫోన్: 040 - 2384 2277 / 2200 / 2299.

విజయవాడ • వైజాగ్ • రాజమహేంద్రవరం • భీమవరం • కాకినాడ • తిరుపతి • హైదరాబాద్ • చెన్నై • తిరువళ్లూరు • గుడియాత్తం

మదురై • తిరుచ్చి • పుదుచ్చేరి • కుంభకోణం • రామనాథపురం • కోయంబత్తూరు • సేలం • నాగర్‌కోవిల్ • ఈరోడ్ • బెంగళూరు

epaper.ntnews.com

# పతకం ఖాయం

## ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్



**మనీలా (ఫిలిప్పీన్స్):** ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత పురుషుల జట్టు పతకం ఖాయం చేసుకుంది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో 3-2తో థాయ్‌లాండ్‌ను చిత్తు చేసిన భారత్ సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. తొలి సింగిల్స్ మ్యాచ్‌లో బరిలోకి దిగిన సాయిప్రణీత్ 14-21, 21-14, 12-21తో వాంగ్‌చరోన్ చేతిలో ఓడాడు. రెండో సింగిల్స్‌లో శ్రీకాంత్ 20-22, 14-21తో కున్లావత్ వితిద్‌సరన్ చేతిలో వరుస గేమ్‌ల్లో పరాజయం పాలవడంతో భారత్ 0-2తో వెనుకంజలో పడింది. పురుషుల డబుల్స్‌లో అర్జున్-ధృవ్ జోడి 21-18, 22-20తో కిట్టినుపోంగ్-వి రియాంగ్‌కురా జంటపై నెగ్గగా.. మూడో సింగిల్స్ మ్యాచ్‌లో యువ ఆటగాడు లక్ష్య సేన్ 21-19, 21-18తో సుప్పను విశింగ్‌సనోన్‌పై గెలిచాడు. దీంతో భారత్ 2-2తో పోటీలోకి వచ్చింది. రెండో డబుల్స్ మ్యాచ్‌లో శ్రీకాంత్-చిరాగ్ శెట్టి జోడీ 21-15, 16-21, 21-15తో మనీపాంగ్-నిపిట్‌ఫాన్ ద్వయంపై నెగ్గడంతో భారత్ విజయం ఖాయమైంది. సెమీస్‌లో మనవాళ్లు ఇండోనేషియాతో తలపడనున్నారు

## సీఎం కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలకు ఏర్పాట్లు

### ముస్తాబవుతున్న ఎల్బీ స్టేడియం



**సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ(సాట్స్) ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలకు ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా శుక్రవారం మీడియా సమావేశంలో సాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి వివరాలు వెల్లడించారు. ఈనెల 17న సీఎం కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కటింగ్, మొక్కలు నాటడంతో వేడుకలు మొదలవుతాయన్నారు. సీఎం టీ-10 క్రికెట్ టోర్నీలో మొత్తం తొమ్మిది జట్లు పాల్గొంటున్నాయని అన్నారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో పతకాలు సాధించిన వారితో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన వారికి చెక్కులు ఇస్తామని పేర్కొన్నారు. రక్తదానంతోపాటు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

## అంతర కళాశాలల హ్యాండ్‌బాల్ లీగ్ షురూ



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి:** ఎల్బీ స్టేడియం వేదికగా తొలి అంతర్ కళాశాలల హ్యాండ్‌బాల్ లీగ్‌ను శుక్రవారం జాతీయ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు జగన్‌మోహన్ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్న ఆయన లీగ్‌లో క్రీడాకారులు మెరుగ్గా రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. రెండు రోజుల పాటు జరిగే టోర్నీలో మొత్తం 25 జట్లు పోటీపడుతున్నాయి.



## సత్తాచాటిన పావని కుమారి

**న్యూఢిల్లీ:** ఆసియా యూత్ అండ్ జూనియర్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో తెలుగమ్మాయి కేవీఎల్ పావని కుమారి అదరగొట్టింది. ఉజ్బెకిస్థాన్‌లో జరుగుతున్న టోర్నీ లో యూత్, జూనియర్ విభాగాల్లో కలిపి మొత్తం ఆరు పతకాలు ఖాతాలో వేసుకుంది. 45 కేజీల విభాగంలో బరిలో దిగిన పావని స్నాచ్‌లో 66 కేజీల బరువెత్తి రెండు విభాగాల్లో స్వర్ణాలు చేజిక్కించుకోవడంతో పాటు.. క్లీన్ అండ్ జెర్క్‌లో 79 కేజీలెత్తి రెండు రజతాలు గెలుచుకుంది. ఓవరాల్‌గా 145 కిలోలతో రెండు విభాగాల్లోనూ రజత పతకాలు సొంతం చేసుకుంది. హకీంపేటలోని స్పోర్ట్స్ స్కూల్ లో ఇంటర్మీడియట్ చదువుతున్న పావని.. కోచ్ మాణిక్యాల రావు వద్ద శిక్షణ పొందుతున్నది. ఆమెతో పాటు మరో భారత లిఫ్టర్ హర్షద (45 కేజీలు) ఐదు క్యాంస్యాలు నెగ్గడంతో టోర్నీ తొలి రోజే భారత్ ఖాతాలో 11 పతకాలు చేరాయి.

## స్మృతి మంధాన @ 4



**దుబాయ్:** ముక్కోణపు టీ20 టోర్నీలో అదిరిపోయే ప్రదర్శన కనబరిచిన భారత మహిళల జట్టు ఓపెనర్ స్మృతి మంధాన (732) ఐసీసీ ర్యాంకింగ్స్‌లో నాలుగో స్థానానికి చేరింది. జెమీమా రోడ్రిగ్స్ (663 ) ఏడో స్థానం దక్కించుకోగా.. హర్మన్‌ప్రీత్ కౌర్ (643) తొమ్మిదో ప్లేస్‌లో కొనసాగుతున్నది. బౌలింగ్ విభాగంలో రాధా యాదవ్, దీప్తి శర్మ వరుసగా నాలుగు, ఐదు ర్యాంకుల్లో నిలిచారు.

## కష్టాల్లో హైదరాబాద్

**హైదరాబాద్:** రంజీ ట్రోఫీలో హైదరాబాద్ పేలవ ప్రదర్శన కొనసాగుతున్నది. టాపార్డర్ మరోసారి విఫలమవడంతో శుక్రవారం ఆట ముగిసే సమయానికి హైదరాబాద్ రెండో ఇన్నింగ్స్‌లో 7 వికెట్ల నష్టానికి 139 పరుగులు చేసింది. సుమంత్ (25), అనికేత్ రెడ్డి (1) క్రీజులో ఉన్నారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 242/4తో మూడోరోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన విదర్భ 333 పరుగులకు ఆలౌటైంది.

# హనుమ విహారి సూపర్ సెంచరీ

చెలరేగిన పుజారా

భారత్ 263 ఆలౌట్

న్యూజిలాండ్ ఎలెవన్‌తో ప్రాక్టీస్ మ్యాచ్




**హామిల్టన్:** టీ20 సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసి.. వన్డే ఫార్మాట్‌లో వైట్‌వాష్‌కు గురైన టీమ్‌ఇండియా.. టెస్టు సిరీస్‌కు ముందు జరిగిన ప్రాక్టీస్ మ్యాచ్‌లో పెద్దగా ఆకట్టుకోలేకపోయింది. న్యూజిలాండ్ ఎలెవన్‌తో శుక్రవారం ప్రారంభమైన మూడు రోజుల టూర్ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 78.5 ఓవర్లలో 263 పరుగులకు ఆలౌటైంది. తెలుగు ఆటగాడు హనుమ విహారి (182 బంతుల్లో 101; 10 ఫోర్లు, 3 సిక్సర్లు) సెంచరీతో అదరగొట్టగా.. చతేశ్వర్ పుజారా (211 బంతుల్లో 93; 11 ఫోర్లు, ఒక సిక్సర్) తృటిలో శతకం చేజార్చుకున్నాడు. కివీస్ బౌలర్లు కుగ్‌లిన్ (3/40), సోధి (3/72) ధాటికి ఎనిమిది మంది భారత బ్యాట్స్‌మెన్ సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు.

### ముగ్గురు ఓపెనర్లు విఫలం

గాయం కారణంగా రోహిత్ శర్మ కివీస్ పర్యటనకు దూరం కావడంతో.. టెస్టు సిరీస్‌లో ఓపెనింగ్ స్థానాల కోసం పోటీపడుతున్న ముగ్గురు యువ ఆటగాళ్లు పృథ్వీ షా (0), మయాంక్ అగర్వాల్ (1), శుభ్‌మన్ గిల్ (0)ఈ మ్యాచ్‌లో ఘోరంగా విఫలమయ్యారు. టాస్ గెలిచిన భారత్ మొదట బ్యాటింగ్ ఎంచుకోవడంతో.. మనవాళ్లకు చక్కటి మ్యాచ్ ప్రాక్టీస్ లభిస్తుందనుకుంటే సీన్ రివర్స్ అయింది. ఇన్నింగ్స్ ఆరంభించడానికి వచ్చిన పృథ్వీ తొలి ఓవర్‌లోనే ఔట్ కాగా.. మయాంక్, గిల్ ఏడో ఓవర్‌లో వరుస బంతుల్లో పెవిలియన్ చేరారు. పృథ్వీ, గిల్ బౌన్స్‌కు బొక్కబోర్లా పడితే.. స్వింగ్ బంతులు ఆడేందుకు తడబడ్డ మయాంక్ కీపర్‌కు క్యాచ్ ఇచ్చాడు. దీంతో 5 పరుగులకే భారత్ మూడు వికెట్లు కోల్పోయింది. టీమ్‌ఇండియా టెస్టు వైస్‌కెప్టెన్ అజింక్యా రహానే (18) కూడా ఎక్కువ సేపు నిలువలేకపోయాడు. ఫలితంగా భారత్ 38/4తో పీకల్లోతు కష్టాల్లో పడింది.

### భారీ భాగస్వామ్యం

మరో ఎండ్‌లో వరుసగా వికెట్లు పడుతున్నా.. వన్‌డౌన్‌లో వచ్చిన చతేశ్వర్ పుజారా క్రీజులో పాతుకుపోయాడు. కివీస్ బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొంటూ స్కోరుబోర్డును ముందుకు తీసుకెళ్లాడు. అతడికి హనుమ విహారి చక్కటి సహకారం అందించాడు. వీరిద్దరూ సింగిల్స్, డబుల్స్‌తో ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. న్యూజిలాండ్ ఎలెవన్ కెప్టెన్ డారిల్ మిషెల్ ఎంత మంది బౌలర్లను మార్చినా ఈ జోడీని విడదీయలేకపోయారు. ఐదో వికెట్‌కు 195 పరుగులు జోడించాక పుజారా కీపర్‌కు క్యాచ్ ఇచ్చి ఔట్ కాగా.. మరికాసేపటికే శతకం పూర్తి చేసుకున్న విహారి ఇన్నింగ్స్ చాలించాడు.

### చివర్లో టపాటపా..

పుజారా-విహారి భాగస్వామ్యంతో కుదురుకున్నట్లు కనిపించిన భారత్ 30 పరుగుల వ్యవధిలో చివరి 6 వికెట్లు కోల్పోయి తక్కువ స్కోరుకే పరిమితమైంది. ఈ పర్యటనలో ఒక్క మ్యాచ్‌లో కూడా తుదిజట్టులో చోటు దక్కని రిషభ్ పంత్ (7) ఆకట్టుకోలేకపోయాడు. సోధి వేసిన బంతిని గాల్లోకి లేపి మూల్యం చెల్లించుకున్నాడు. రెగ్యులర్ వికెట్ కీపర్ వృద్ధిమాన్ సాహా (0), అశ్విన్ (0) డకౌట్ కాగా.. ఉమేశ్ యాదవ్ (9), జడేజా (8) కొన్ని పరుగులు చేశారు.

### ఓపెనింగ్‌కైనా రెడీ: విహారి

కీలక సిరీస్‌కు ముందు ఓపెనింగ్ స్థానం కోసం పోటీపడుతున్న ముగ్గురు ఆటగాళ్లు విఫలమైన చోట చక్కటి ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్న హనుమ విహారి.. ఇన్నింగ్స్ ఆరంభించేందుకు కూడా సిద్ధమే అంటున్నాడు. 'ఒక ఆటగాడిగా ఏ స్థానంలో బరిలో దిగేందుకైనా సిద్ధమే. ఓపెనింగ్ చేయాల్సిందిగా నన్నెవరూ కోరలేదు. ఒకవేళ జట్టు ప్రయోజనాల కోసం ఇన్నింగ్స్ ఆరంభించాల్సి వస్తే సంతోషంగా స్వీకరిస్తా. టీమ్‌ఇండియా స్వదేశంలో టెస్టులు ఆడే సమయంలో ఐదుగురు బౌలర్ల ఫార్ములాకు కట్టుబడి ఉంటుందని తెలుసు. అందుకే గత రెండు సిరీస్‌ల్లో నాకు చోటు దక్కలేదు. జట్టు కూర్పును అర్థం చేసుకోవాలి. దానికి తగ్గట్లే ఎంపిక ప్రక్రియ సాగుతుంది. నేనేంటో ఎవరికో నిరూపించుకోవాల్సిన అవసరం లేదు. న్యూజిలాండ్ పేస్ దళం బలంగా ఉంది. అనుభవం ఉన్న ఇలాంటి పేసర్లను ఎదుర్కోవాలంటే సం యమనం అవసరం'అని విహారి పేర్కొన్నాడు.

### స్కోరు బోర్డు

**భారత్:** పృథ్వీ షా (సి) రవీంద్ర (బి) కుగ్‌లిన్ 0, మయాంక్ (సి) క్లీవర్ (బి) కుగ్‌లిన్ 1, పుజారా (సి) క్లీవర్ (బి) గిబ్సన్ 93, గిల్ (సి) సీఫెర్ట్ (బి) కుగ్‌లిన్ 0, రహానే (సి) బ్రూస్ (బి) నీషమ్ 18, విహారి (రిటైర్డ్ ఔట్) 101, పంత్ (సి) కుగ్‌లిన్ (బి) సోధి 7, సాహా (సి) క్లీవర్ (బి) గిబ్సన్ 0, అశ్విన్ (ఎల్బీ) సోధి 0, ఉమేశ్ (నాటౌట్) 9, జడేజా (సి) అలెన్ (బి) సోధి 8, **ఎక్స్‌ట్రాలు:** 26, **మొత్తం:** 78.5 ఓవర్లలో 263 ఆలౌట్. **వికెట్ల పతనం:** 1-0, 2-5, 3-5, 4-38, 5-233, 6-245, 7-246, 8-246, 9-250, 10-263, **బౌలింగ్:** కుగ్‌లిన్ 14-2-40-3, టిక్నర్ 15-3-37-0, డారిల్ 7-1-15-0, నీషమ్ 13-3-29-1, గిబ్సన్ 10-1-26-2, సోధి 14.5-0-72-3, రవీంద్ర 5-1-30-0.

# వాణిజ్య

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 41,258 | 12,113 |
| ↘ 202 | ↘ 61 |

ముడి చమురు (బ్రెంట్) ↗ 56.79 డాలర్లు

## ట్రంప్‌తో భేటీకానున్న వ్యాపార దిగ్గజాలు!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:** ఈ నెల చివర్లో భారత పర్యటనకు రానున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో పలువురు దేశీయ వ్యాపార దిగ్గజాలు భేటీకాబోతున్నారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య, వ్యాపార ఒప్పందాలపై ఈ నెల 25న జరుగనున్న సీఈవో రౌండ్ టేబుల్ సమావేశానికి రిలయన్స్ ఇండస్ట్రీస్ సీఎండీ ముకేశ్ అంబానీ, భారతీ ఎయిర్‌టెల్ చైర్మన్ సునీల్ భారతి మిట్టల్, టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్, మహీంద్రా గ్రూపు చైర్మన్ ఆనంద్ మహీంద్రా, లార్సెన్ అండ్ టుబ్రో చైర్మన్ ఏఎం నాయక్, బయోకాన్ సీఎండీ కిరణ్ మజుందార్ షాతోపాటు సీనియర్ బ్యూరోక్రాట్లు, అమెరికాకు చెందిన టాప్ ఎగ్జిక్యూటివ్‌లు కూడా హాజరవనున్నట్లు తెలుస్తున్నది. న్యూఢిల్లీలో ఉన్న అమెరికా రాయబార కార్యాలయం నిర్వహిస్తున్న ఈ సమావేశానికి హాజరుకానున్న వారి జాబితాను వైట్‌హౌజ్‌కు నివేదించింది. అక్కడి నుంచి ఇంకా క్లియరెన్స్ రాలేదని తెలుస్తున్నది. ట్రంప్‌తో భేటీ అయ్యేవారి పేర్లను సూచించాలని భారత పరిశ్రమల సమాఖ్య( సీఐఐ), అమెరికా-ఇండియా వ్యాపార సంస్థలను కోరినట్లు మరో అధికారి వెల్లడించారు. ఈ నెల 24 నుంచి 25 వరకు ట్రంప్ భారత పర్యటనకు రాబోతున్న విషయం తెలిసిందే.

## నీరసించిన ఎగుమతులు

### జనవరిలో 1.66 శాతం క్షీణత.. వరుసగా ఆరో నెలలో తగ్గుదల




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:** దేశీయ ఎగుమతులు మళ్లీ నీరసించాయి. పెట్రోలియం, ప్లాస్టిక్, కార్పెట్లు, జెమ్స్ అండ్ జ్యూవెల్లరీ, చర్మ ఉత్పత్తులకు విదేశాల్లో డిమాండ్ పడిపోవడంతో జనవరి నెలకుగాను ఎగుమతులు 1.66 శాతం తగ్గి 25.97 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. వరుసగా ఎనిమిది నెలలుగా తగ్గుతూ వచ్చిన దిగుమతులు కూడా 0.75 శాతం తగ్గి 41.41 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. అయినప్పటికీ వాణిజ్యలోటు(ఎగుమతులు, దిగుమతుల మధ్య వ్యత్యాసం) ఏడు నెలల గరిష్ఠ స్థాయి 15.17 బిలియన్ డాలర్లను తాకింది. క్రితం ఏడాది ఇదే నెలలో లోటు 15.05 బిలియన్ డాలర్లుగా ఉన్నది. జూన్ 2019లో నమోదైన 15.28 బిలియన్ డాలర్లు ఇప్పటి వరకు ఇదే గరిష్ఠం. 30 కీలక రంగాల్లో 18 రంగాలు ప్రతికూల వృద్ధిని నమోదు చేసుకోగా..కేవలం 12 మాత్రం ఆశాజనక పనితీరు కనబరిచాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జనవరి మధ్యకాలానికిగాను ఎగుమతులు 1.93 శాతం తగ్గి 265.26 బిలియన్ డాలర్లకు పడిపోగా, ఇదే సమయంలో దిగుమతులు 8.12 శాతం తగ్గి 398.53 బిలియన్ డాలర్లుగా ఉన్నది. దీంతో వాణిజ్య లోటు 133.27 బిలియన్ డాలర్లుగా నమోదైంది.

### భారీగా తగ్గిన పసిడి దిగుమతులు

పసిడి దిగుమతులు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. ఏడాది ప్రాతిపదికన గత నెలలోనూ తొమ్మిది శాతం తగ్గి 1.58 బిలియన్ డాలర్లకు పరిమితమైనట్లు వాణిజ్య మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. గత నెలలో పెట్రోలియం ప్రొడక్ట్ 7.42 శాతం పడిపోగా, ప్లాస్టిక్ 10.62 శాతం, కార్పెట్లు 5.19 శాతం, జెమ్స్ అండ్ జ్యూవెల్లరీ 6.89 శాతం, చర్మ ఉత్పత్తులు 7.54 శాతం చొప్పున పడిపోయాయి. దేశ వృద్ధిరేటు ఆరేండ్ల కనిష్ఠ స్థాయి 5 శాతానికి పడిపోగా, పారిశ్రామిక వృద్ధి 0.3 శాతం తగ్గాయి. గత నెలలో చమురు దిగుమతులు 15.27 శాతం పెరిగి 12.97 బిలియన్ డాలర్లకు చేరుకోగా, చమురేతర ఉత్పత్తుల దిగుమతులు 6.72 శాతం తగ్గి 28.17 బిలియన్ డాలర్లకు పరిమితమైనట్లు వాణిజ్య మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. అత్యవసరంగా ఎగుమతులు పెరుగాలంటే టెక్స్‌టైల్ రంగానికి కేంద్ర ప్రభుత్వం చేయూతనివ్వాల్సిన అవసరం ఉన్నదని ఏఈపీసీ చైర్మన్ ఏ శక్తివేల్ తెలిపారు.

## పది నెలల గరిష్ఠానికి టోకు ద్రవ్యోల్బణం

### జనవరిలో 3.1 శాతంగా నమోదు

**న్యూఢిల్లీ:** టోకు ధరల సూచీ కూడా పది నెలల గరిష్ఠ స్థాయిని తాకింది. ఆహార పదార్థాల్లో ముఖ్యంగా ఉల్లి, బంగాళాదుంపల ధరలు భగ్గుమనడంతో గత నెలకుగాను టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం 3.10 శాతానికి చేరుకున్నది. కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాలు ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాయి. డిసెంబర్‌లో 2.59 శాతంగా ఉన్న టోకు ధరల సూచీ ఆ తర్వాతి నెలకుగాను భారీగా పెరిగింది. గతేడాది ఇదే నెలలో 2.76 శాతంగా ఉన్నది. అంతకుముందు ఏప్రిల్ 2019లో నమోదైన 3.18 శాతం ఇప్పటి వరకు ఉన్న గరిష్ఠ స్థాయి. ఆహార పదార్థాలకు సంబంధించిన ధరల సూచీ 11.51 శాతం స్థిరంగా ఉండగా, వీటిలో కూరగాయలకు సంబంధించిన సూచీ 52.72 శాతానికి ఎగబాకింది. వీటిలో ముఖ్యంగా ఉల్లిగడ్డ ధర ఏకంగా 293 శాతం ఎగబాకగా, బంగాళాదుంప ధరల సూచీ 87.84 శాతంగా నమోదైంది. గత కొన్ని నెలలుగా ప్రతికూల వృద్ధిని నమోదు చేసుకుంటున్న తయారీ ఆహార విభాగం జనవరిలో 0.34 శాతానికి చేరుకోగా, చమురు 3.42 శాతంగాను, పవర్ -1.46 శాతంగా నమోదయ్యాయి. ఇతర దేశాల నుంచి దిగుమతి అవుతున్న పలు వస్తువులపై కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని పెంచడంతో భవిష్యత్తులో టోకు ధరల సూచీ మరింత పెరిగే అవకాశాలున్నాయని ఇక్రా ప్రధాన ఆర్థికవేత్త అదితి నాయర్ తెలిపారు.

# న్యాయం ఉన్నదా?

- ఏజీఆర్ బకాయిలు ఎందుకు చెల్లించలేదు?
- మా తీర్పు అమలుపైనే స్టే విధిస్తారా?
- డెస్క్ ఆఫీసర్‌కు అంత కావరమా?
- తీర్పులకు విలువలేకపోతే కోర్టులెందుకు?
- డీవోటీ, టెల్కోలపై సుప్రీంకోర్టు ఆగ్రహం

మీపై ఎందుకు చర్యలు చేపట్టకూడదు?



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:** టెలికం కంపెనీలపై సుప్రీంకోర్టు శుక్రవారం తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. జనవరి 23లోగా టెలికం విభాగానికి (డీవోటీకి) రూ.1.47 లక్షల కోట్ల ఏజీఆర్ (సర్దుబాటుచేసిన స్థూల ఆదాయ) బకాయిలు చెల్లించాలంటూ గతంలో ఇచ్చిన తీర్పును టెల్కోలు పాటించకపోవడంపై సుప్రీంకోర్టు ఆగ్రహాన్ని వ్యక్తంచేస్తూ.. అసలు ఈ దేశంలో న్యాయం ఉన్నదా? అని ప్రశ్నించింది. తమ తీర్పును పాటించకపోవడాన్ని కోర్టు ధిక్కార నేరంగా పరిగణించి ఎందుకు చర్యలు చేపట్టకూడదో వివరణ ఇవ్వాలని టెల్కోలను ఆదేశించింది. ఏజీఆర్ బకాయిల వ్యవహారంలో తామిచ్చిన తీర్పుపై స్టే విధిస్తూ టెలికం విభాగ డెస్క్ ఆఫీసర్ ఉత్తర్వు జారీచేయడంపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తంచేసింది. ఏజీఆర్ బకాయిలు చెల్లించాలంటూ టెల్కోలపై ఒత్తిడి తీసుకురాకూడదని, వాటిపై ఎలాంటి బలవంతపు చర్యలు చేపట్టకూడదని డివోటీ డెస్క్ ఆఫీసర్ ఒకరు అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్‌కు, ఇతర రాజ్యాంగ సంస్థలకు లేఖ రాశారని సుప్రీంకోర్టు పేర్కొన్నది. ఏజీఆర్ బకాయిలను చెల్లించేందుకు తమకు మరింత గడువు ఇవ్వాలని కోరుతూ వొడాఫోన్ ఐడియా, భారతీ ఎయిర్‌టెల్, టాటా టెలిసర్వీసెస్ దాఖలుచేసిన పిటిషన్లపై జస్టిస్ అరుణ్ మిశ్రా, జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్, జస్టిస్ ఎంఆర్ షాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ జరుపుతూ.. సుప్రీంకోర్టు తీర్పు అమలుపై ఓ డెస్క్ అధికారి ఏవిధంగా స్టే విధిస్తారని ప్రశ్నించింది. సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పుపై ఓ డెస్క్ అధికారి ఏవిధంగా స్టే విధిస్తారు? అసలు దేశంలో న్యాయం ఉన్నదా? మీరు కోర్టులను పరిగణించే తీరు ఇదేనా? అని ధర్మాసనం నిలదీసింది. 'ఇలాంటి పనికిమాలిన పనులు చేస్తున్నదెవరో మాకు తెలియదు. దేశంలో న్యాయం ఉన్నదా? అని ప్రశ్నించుకొంటే బాధ కలుగుతున్నది. ఈ కోర్టులో, ఈ వ్యవస్థలో పనిచేయకూడదన్న భావన కలుగుతున్నది. ఇవి కోపంతో అంటున్న మాటలు కాదు. బాధ్యతతో చెప్తున్న మాటలు. ఇలాంటి వ్యవస్థలో, దేశంలో ఎలా పనిచేయాలో నాకు అర్థంకావడంలేదు' అని జస్టిస్ అరుణ్‌మిశ్రా ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా క్షమాపణ చెప్తూ.. డెస్క్ అధికారి ఆ పని చేయకూడదన్నారు. దీంతో ధర్మాసనం మరోసారి ఘాటుగా స్పందించింది. 'ఈ దేశానికి సొలిసిటర్ జనరల్‌గా మీరు ఆ ఉత్తర్వును ఉపసంహరించుకోవాల్సిందిగా ఆయనకు (డెస్క్ అధికారికి) సూచించారా? ఇలాంటి పనులను సహించకూడదు. ఇలాంటి పరిస్థితుల్లో మేము పనిచేయలేం. మీ డెస్క్ అధికారికి అంత అధికారం ఉంటే న్యాయస్థానాలు ఎందుకు? సుప్రీంకోర్టును మూసేద్దాం. మీ డెస్క్ అధికారి సుప్రీంకోర్టు ఉత్తర్వునే నిలిపివేశాడు. ఆయన సుప్రీంకోర్టు నెత్తిపై కూర్చుంటాడా? ఎలా కూర్చుంటాడు? ఇలాంటి పనులను ప్రోత్సహిస్తున్నదెవరు? ఈ దేశంలో జీవించడం కంటే దేశాన్ని వదిలివెళ్లడం మంచిదనిపిస్తున్నది. ఈ వ్యక్తి (డెస్క్ అధికారి)తోపాటు ఏజీఆర్ బకాయిలు చెల్లించని టెలికం కంపెనీలపై మేము కోర్టు ధిక్కార చర్యలు చేపట్టాలి. ఆ కంపెనీలు ఎలా ప్రవర్తిస్తున్నాయో తెలుస్తున్నదా? ఏజీఆర్ బకాయిల్లో ఇప్పటివరకు నయాపైసా చెల్లించలేదు. ఆ కంపెనీల రివ్యూ పిటిషన్లను డిస్మిస్ చేస్తున్నాం. మీ డెస్క్ అధికారి మా ఉత్తర్వు అమలును నిలిపివేశాడు. ఈ దేశ దుస్థితిని, న్యాయవ్యవస్థ పరిస్థితిని చూస్తుంటే ఆందోళన కలుగుతున్నది' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ అంశంపై తదుపరి విచారణ జరిగే మార్చి 17న సంబంధిత టెలికం కంపెనీల ఎండీలు, డైరెక్టర్లు తమ ఎదుట హాజరై ఏజీఆర్ బకాయిలను ఎందుకు చెల్లించలేదో, వారిపై కఠిన చర్యలు ఎందుకు చేపట్టకూడదో వివరణ ఇవ్వాలని ధర్మాసనం ఆదేశించింది. అంతేకాకుండా సుప్రీంకోర్టు తీర్పుపై స్టే విధించినందుకు డీవోటీ డెస్క్ ఆఫీసర్‌పై తగిన చర్యలు ఎందుకు తీసుకోకూడదన్న దానిపై ఆయన కూడా వివరణ ఇవ్వాలని స్పష్టం చేసింది.

### 20లోగా రూ.10 వేలకోట్లు చెల్లిస్తాం: ఎయిర్‌టెల్

**ఓవైపు** సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేయడం, మరోవైపు డీవోటీ తాజాగా ఉత్తర్వులు జారీచేయడంతో ఏజీఆర్ ఉత్తర్వులపై భారతీ ఎయిర్‌టెల్ స్పష్టత ఇచ్చింది. ఈ నెల 20లోగా రూ.10 వేల కోట్లు చెల్లిస్తామని, ఏజీఆర్ బకాయిలపై సుప్రీంకోర్టు తదుపరి విచారణ జరిపేలోగా మిగిలిన బకాయిలన్నీ చెల్లిస్తామని శుక్రవారం టెలికం విభాగానికి రాసిన లేఖలో ఎయిర్‌టెల్ తెలిపింది.

## టెల్కోలకు డీవోటీ షాక్

- ఏజీఆర్ బకాయిలన్నీ తక్షణమే చెల్లించాలని ఆదేశం
- శుక్రవారం అర్ధరాత్రి వరకు గడువు

**సుప్రీంకోర్టు** చివాట్ల నేపథ్యంలో టెలికం కంపెనీలకు డీవోటీ షాకిచ్చింది. ఏజీఆర్‌కు సంబంధించిన బకాయిలన్నీ శుక్రవారం అర్ధరాత్రిలోగా చెల్లించాలని ఆదేశిస్తూ భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా లిమిటెడ్ (వీఐఎల్), టాటా టెలిసర్వీసెస్ తదితర సర్వీస్ ప్రొవైడర్లకు సర్కిళ్లవారీగా నోటీసులు జారీచేయడం మొదలుపెట్టింది. అంతేకాకుండా ఏజీఆర్ బకాయిలు చెల్లించని టెల్కోలపై బలవంతంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దంటూ గతనెలలో తాము జారీచేసిన ఉత్తర్వును తక్షణమే ఉపసంహరించుకొంటున్నట్టు డీవోటీ ప్రకటించింది. ఏజీఆర్ బకాయిల వసూలుపై గతేడాది అక్టోబర్‌లో ఇచ్చిన తీర్పును పాటించేందుకు అవసరమైన చర్యలను తక్షణమే చేపట్టాలని తమ ఫీల్డ్ ఆఫీసర్లను ఆదేశిస్తున్నట్టు డీవోటీ తెలిపింది. టెలికం కంపెనీల నుంచి ఏజీఆర్ బకాయిల వసూలును నిలిపివేసినందుకు సుప్రీంకోర్టు నుంచి ఆగ్రహం ఎదురవడంతో డీవోటీ ఈ దిద్దుబాటు చర్యలు చేపట్టింది. 'లైసెన్సు ఫీజులు, స్పెక్ట్రమ్ వినిమయ చార్జీలకు సంబంధించిన పాత బకాయిలన్నీ శుక్రవారం (14-02-2020) రాత్రి 11:59 గంటల్లోగా చెల్లించాలని ఆదేశిస్తున్నాం' అని టెల్కోలకు జారీచేసిన నోటీసుల్లో స్పష్టం చేసింది. ఏజీఆర్ బకాయిల చెల్లింపున కోసం డీవోటీ నుంచి తమకు డిమాండ్ నోటీసు అందినట్టు ఓ టెలికం కంపెనీ ధ్రువీకరించింది. దేశంలో 15 టెలికం కంపెనీలు లైసెన్సు ఫీజు రూపంలో రూ.92,642 కోట్లు, స్పెక్ట్రమ్ వినిమయ చార్జీల రూపంలో మరో రూ.55,054 కోట్ల చొప్పున కేంఅద ప్రభుత్వానికి మొత్తం రూ.1.47 లక్షల కోట్ల పాత బకాయిలు చెల్లించాల్సి ఉన్నది. వీటిలో వొడాఫోన్ ఐడియా లిమిటెడ్ బకాయిలే రూ.53 వేల కోట్లు ఉండగా.. భారతీ ఎయిర్‌టెల్ రూ.35,586 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉన్నది. ఇందులో శుక్రవారం అర్ధరాత్రిలోగా ఎంతమొత్తాన్ని చెల్లించాలని డీవోటీ ఆదేశించిందో ఇంకా తెలియరాలేదు.

### కుదేలైన వొడాఫోన్ ఐడియా షేరు

వొడాఫోన్ ఐడియా షేరు కుదేలైంది. శుక్రవా రం స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి కం పెనీ షేరు 23.21 శాతం పతనం చెంది రూ. 3.44కి జారుకున్నది. దీంతో కంపెనీ మార్కె ట్ విలువ రూ.2,988.03 కోట్లు కరిగిపోయి రూ.9,884.97 కోట్లకు జారుకున్నది.


4,00,000 రకాల
పట్టు చీరల ప్రదర్శన & అమ్మకం
పెళ్ళి పట్టు చీరల
మేళ
మన కరీంనగర్‌లో
18850 ₹13995
16650 ₹11995
4450 ₹3295
1950 ₹1495
2750 ₹1995
8150 ₹5995
4244 ₹2896
1650 ₹1295
ధర్మవరం, కంచి, ఆరణి,
పోచంపల్లి ఉప్పాడ,
వెంకటగిరి, గద్వాల్, బెనారస్, కోయంబత్తూర్, కేరళ నుండి
ప్రత్యేకమైన పెళ్ళి పట్టు చీరలు మరియు డిజైనర్ శారీస్,
హైఫ్యాన్సీ శారీస్, క్యాటలాగ్ శారీస్ ఇంకామరెన్నో...
చందేరి పట్టు
Father & son twinning
ఈ వెడ్డింగ్ సీజన్‌కై సరికొత్త
మెన్స్ ఎత్నిక్ వేర్ కలెక్షన్
సౌత్ ఇండియా
షాపింగ్ మాల్
ఉస్మాన్‌పుర, కరీంనగర్.
ఫోన్: 0878-224 0225
24X7 ONLINE SHOPPING VISIT www.SISMO.in
77 999 65 656
Follow us on: southindiashoppingmall southindiashopping


వివాహ వైభవం ఇక్కడినుండే ప్రారంభం!
Samudrika Pattu
Saatvika Pattu
Parinaya Pattu
Sampradaya Pattu
Gandharva Pattu Sarees
Vastrakala pattu
పెళ్ళి పట్టు చీరలపై
33% వరకు తగ్గింపు
VIVAAHA COLLECTIONS
1650 ₹1095 Pasidi Pattu Saree
2195 ₹1495 Narayani Pattu Saree
2750 ₹1795 Meenakshi Pattu Saree
Avishkara Pattu Saree 3295 ₹2250
Swarna Pattu Saree 4244 ₹2596
Satyabhama Pattu Saree 6996 ₹4695
Grand Groom Collection
UPTO 30% OFF ON SUITING SHIRTINGS
Raymond Arvind LinenClub OCM Gasim DIGJAM
UPTO 20% OFF ON ETHNIC WEAR
Manyavar Manish UVAAM TATTVA ETHOS
916 బంగారు ఆభరణాలు | పట్టు శారీస్
డిజైనర్ శారీస్ | ఫ్యాన్సీ శారీస్ | కాటన్ శారీస్
సల్వార్ సూట్స్ | గాగ్రాస్ | మెన్స్ వేర్ | కిడ్స్‌వేర్
రెగ్యులర్ వేర్ వస్త్రాలపై వేరెవ్వరూ ఇవ్వలేని
అద్భుత ఆఫర్లు
First time ever!
Bridal Jewellery
25% OFF on V.A.
On Gold Jewellery
DIAMOND JEWELLERY Starts from 43,666 PER CARAT
EF-VVS & IGI Certified Diamond Jewellery
The CHENNAI SHOPPING MALL
HYDERABAD & SECUNDERABAD
VAN HEUSEN Allen Solly Levi's CLASSIC POLO LOUIS PHILIPPE mufti WHITE HOUSE PAN AMERICA TWILLS KILLER DUKE
Celebrate today, pay later. Bringing you great EMI options.
BAJAJ FINSERV
PhonePe
All Credit Card and Debit Card Accepted Here

నమస్తే తెలంగాణ
/nt.zindagi
WWW. NTNEWS.COM
జిందగీ
శనివారం 15 ఫిబ్రవరి 2020

దేశంకోసం ప్రాణాలు అర్పించడంలోనే తమ సంతోషాన్ని వెతుక్కున్నారు. ముష్కరుల పన్నాగమేదైనా.. ప్రాణాలు ఎదురొడ్డి నిలబడ్డారు. 'నీకు ఈ కొలువెందుకు బిడ్డా..' అంటే.. 'చావు ఎప్పడైనా వస్తదే అవ్వ.. అందుకే దేశం కోసం సస్తున్నా..' అంటూ పుట్టిన నేల రుణం తీర్చుకున్నారు ఈ వీర జవానులు. పుల్వామాలో జరిగిన నరమేధానికి ఏడాది పూర్తవడంతో.. ఆ అమరుల యాదిలో వివిధ ఘటనల్లో వీరమరణం పొందిన తెలుగు రాష్ట్రాలకు చెందిన 18 మంది జవాన్లకు సీఆర్‌పీఎఫ్ అధికారులు, కుటుంబ సభ్యులుఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమరుల కుటుంబసభ్యులను కొందరిని 'జిందగీ' పలుకరించగా.. తమ బిడ్డల వీర త్యాగాల గురించి చెబుతూ కంటతడిపెట్టుకున్నారు.






# వీర జవానులారా వందనం..

ఒక్కొక్కరిది ఒక్కో కథ. మాటలకందని బాధ. ఉబికి వస్తున్న కన్నీళ్లు ఒకవైపు.. దేశం కోసం బిడ్డలను ఇచ్చామన్న గర్వం మరోవైపు. ఉప్పొంగే ఉద్వేగం.. తమ బిడ్డల స్మారక స్థూపాల వద్ద ఆపుకోలేని కన్నీటి ధార.. ఇదీ వీర జవాన్ల తల్లిదండ్రులు, వారి సతీమణులు, కుటుంబసభ్యుల పరిస్థితి. ఎవ్వరిని కదిలించినా బిడ్డలను కోల్పోయామన్న బాధకంటే.. దేశసేవలో తమ బిడ్డ ఉన్నాడన్న సంతృప్తి కనిపించింది. కష్టాల కడలిలో మధ్యలో వదిలివెళ్లినా.. వారి త్యాగాలను గుర్తు చేసుకుంటూ గడుపుతున్నారు వారి కుటుంబసభ్యులు. పుల్వామా సహా పలు ఘటనల్లో అమరులైన తెలంగాణ, ఏపీకి చెందిన 18 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్ల కుటుంబసభ్యులను సీఆర్‌పీఎఫ్ సదరన్ సెక్టార్‌లో ఘనంగా సత్కరించారు. ఆ అమరుల త్యాగాలకు సంబంధించి వారు పంచుకున్న విషయాలు వారి మాటల్లోనే..

## మంచి పేరు తెచ్చుకున్నాడు..



మాది అనంతపురం జిల్లా కదిరి తాలూకా, నల్లమడ గ్రామం. మా కొడుకు రామ్మోహన్ మిలిటరీలో చేరడం, దేశం కోసం పనిచేయడం అంటే ఎంతో ఇష్టం అనే వాడు. అన్నట్టే 2011లో సీఆర్‌పీఎఫ్‌లో జాయిన్ అయ్యిండు. ఎక్కడ ఉన్నా సరే తప్పకుండా రోజుకు ఒక్కసారైన ఫోన్ చేసి మాట్లాడేటోడు. ఎంతో ధైర్యంగా ఉండేవాడు. ఏ పనైనా ముందుండి చేసే టోడు.. ట్రైనింగ్‌ల కూడా అందిరికంటే ముందే ఉండేవాడంట. అట్లనే డ్యూటీల కూడా. ఎక్కడ ఉన్నా మంచి పేరు ఉండేదంట. బెటాలియన్ మొత్తానికి మీ వోడు తెలుసు అని అందరూ చెప్పేటోళ్లు. 2014, డిసెంబర్‌లో ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయాడు. ఎక్కడ ఉన్నా మంచి పేరు ఉండేది.. ఇప్పుడు దేశం కోసం కొడుకును ఇచ్చారన్న మంచి పేరు మాకు ఇచ్చి పోయిండు.'

**- అమరజవాన్ రామ్మోహన్ తండ్రి వెంకటస్వామి, తల్లి కిష్టమ్మ**

## మా కుటుంబానికే ధైర్యం వాడు..



'మా కుటుంబం మొత్తానికి ధైర్యమే మా వాడు గోవర్ధన్ రెడ్డి. డిగ్రీ ఫస్టియర్‌లో ఉండగానే సీఆర్‌పీఎఫ్‌లో ఉద్యోగం వచ్చింది. అంత కష్టమైన ఉద్యోగం ఎందుకురా అని మేం వద్దన్నా, నా కొడుకు వినలేదు. 'మనకు ప్రభుత్వ ఉద్యోగాలు త్వరగా రావు. వచ్చినప్పుడే వెళ్లాలి. ఇది దేశానికి సేవ చేసే ఉద్యోగం. ఇది నాకు మంచి అవకాశం'అని చెప్పిండు. సీఆర్‌పీఎఫ్‌లో చేరిన నాలుగేండ్లలో ఢిల్లీలో కొన్నాళ్లు, పంజాబ్, కేరళ, నాగ్‌పూర్ తర్వాత ఛత్తీస్‌గఢ్‌కి వచ్చాడు. ఎంతో ధైర్యంగా ఉండేవాడు. ఎప్పుడు ఫోన్ చేసినా నాకేం ఫర్వా లేదు. నేను బాగానే ఉన్నా అనేవాడు. అడవుల్లో డ్యూటీలో ఉన్నా.. ఎప్పుడూ ఇంత కష్టం ఉంటదని చెప్పేటోడు కాదు. కానీ మాకుమాత్రం ఎప్పుడు నేను బాగానే ఉన్నా.. మీరు జాగ్రత్తగా ఉండుర్రి అని చెప్పేటోడు. మా కుటుంబానికే ధైర్యం వాడు. ఇంటికి సంబంధించి ఏ విషయమైనా ఇట్లా చేసుకోవాలి..అట్లా చేసుకోవాలి అని చెప్పేవాడు. 2014 డిసెంబర్‌లో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, బీజాపూర్ జిల్లాలో జరిగిన నక్సల్ దాడిలో అమరుడయ్యాడు. దేశంకోసం వాడు ఇప్పుడు పోయాడు. బాధ ఉన్నా.. కొంత గర్వంగా కూడా ఉంటది మాకు.'

**- అమర జవాన్ గోవర్ధన్‌రెడ్డి తల్లిదండ్రులు కరుణారెడ్డి, లలితమ్మ**



అమర జవాను రామ్మోహన్ తల్లిదండ్రులను సన్మానిస్తున్న సీఆర్‌పీఎఫ్ సదరన్ సెక్టార్ ఐజీ ఎంఆర్ నాయక్

## ఎక్కడున్నా చావు తప్పదన్నాడు...



'నా పేరు ఆలేటి ప్రతాప్‌రెడ్డి. మాది నాగర్‌కర్నూల్ జిల్లాలో మాది లింగసానిపల్లె గ్రామం. నాకు ఇద్దరు కొడుకులు. విజయభాస్కర్‌రెడ్డి చిన్నవాడు. ముందు నుంచి పోలీస్ అంటే చాలా ఇష్టం. 'పోలీస్ ఉద్యోగం ఎందుకు రా.. ఎప్పుడు ఏం జరుగుతదో తెల్వదు అన్నా' అయినా వినలేదు. 'చావు ఎక్కడ ఉన్నా వస్తది నాన్నా.. నేను చచ్చినా, బతికినా పోలీస్‌గానే ఉంటాను' అని చెప్పిండు. డిగ్రీ రెండో సంవత్సరంలో ఉండగానే సీఆర్‌పీఎఫ్ జవాన్‌గా ఉద్యోగం వచ్చింది. ఐదేండ్లు జమ్ముకాశ్మీర్‌లో చేసి వచ్చాడు. అక్కడి నుంచి పశ్చిమ బెంగాల్‌కు 2011లో వచ్చిండు. వచ్చిన ఏడాదికి పశ్చిమ బెంగాల్‌లో జంగల్ డ్యూటీలో ఉన్నప్పుడు ఎదురు కాల్పుల్లో చనిపోయాడు. అప్పటికి పెండ్లి అయి ఏడాది అయింది. కొడుకును పోగొట్టుకున్న దుఃఖం ఇంకా కలిచి వేస్తనే ఉంది. ప్రభుత్వం నుంచి వచ్చిన ఆర్థిక సాయం కూడా అంతా కోడలికే వెళ్లింది. తల్లిదండ్రులుగా మాకు ఏ ఆధారం లేకుండా పోయింది. కష్టం చేసుకుంటేనే జరుగుబాటు ఉంది. తల్లిదండ్రులుగా మాకు కూడా ప్రభుత్వ సాయం ఇవ్వాలని కోరుతున్నా.'

**- అమరజవాన్ విజయభాస్కర్‌రెడ్డి తండ్రి ప్రతాప్‌రెడ్డి**

## కొడుకొస్తడనుకుంటే.. బట్టలొచ్చినయ్!



'మాది సిద్ధిపేట జిల్లా అక్కన్నపేట మండలం, పోస్టు కట్కూర్, గ్రామం రాజాతండా. నాకు ముగ్గురు బిడ్డలు. ఒక్కడే కొడుకు. పోలీస్ ఉద్యోగం వద్దురా అన్నా వినలేదు. 'నాకు ఏం కాదు. దేశం కోసం పోరాడుతున్నా..' అని చెప్పేటోడు. 2005లో సీఆర్‌పీఎఫ్‌ల చేరిండు. అసోంలో ట్రైనింగ్.. ఆ తర్వాత జమ్మూకశ్మీర్, తమిళనాడు, మహారాష్ట్రలో చేసి, సుకుమ జిల్లాకు వచ్చిండు. రోజుకు మూడుసార్లు ఫోన్ చేసి, 'ఏం చేస్తున్నరు. తిన్నరా.. బాగున్నరా.. నేను బానే ఉన్నా.. తొందర్లనే వస్త' అని చెప్పేటోడు. 2014 ఏప్రిల్ 9న సుక్మాజిల్లా చింతగుంట దగ్గర జరిగిన నక్సలైట్ల దాడిలో నా కొడుకు నర్సింహా చనిపోయిండు. అక్కడి నుంచి సార్లు ఫోన్ చేసింర్రు. ఆ ఫోన్ రావడంతోనే నేను సోయి లేకుండా పడిపోయిన. కంతల నుంచి, పక్కటెముకల నుంచి ఒకటి రెండు బుల్లెట్లు తాకినయి, చనిపోయిండు అని చెప్పింర్రు. కొడుకు ఇంటికి వస్తడు అనుకుంటే చినిగిపోయిన బట్టలు వచ్చినయ్. అటిని సూస్తే మహా దుఃఖం వస్తది. ఉన్న ఒక్క కొడుకు పోయినా, దేశం కోసం పోరాటం చేసిండన్న సంతోషం అయితే ఉంటది.'

**- అమరజవాన్ నర్సింహ తండ్రి లింగయ్య**

## అండగా నిలువడం మా కర్తవ్యం



దేశ రక్షణ కోసం గత పదేండ్లలో ఏపీ, తెలంగాణ నుంచి అమరులైన 18 మంది కుటుంబాలకు సీఆర్‌పీఎఫ్ ఎప్పుడూ అండగా ఉంటుంది. అది మా కర్తవ్యం. అమర వీరుల కుటుంబాలకు కేవలం ప్రభుత్వం తరపున ఆర్థికసాయం అందించడంతో సరిపెట్టకుండా, వారి కుటుంబాల్లో అర్హులైన వారికి వారి విద్యార్హతను బట్టి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు మేం చర్యలు తీసుకుంటున్నాం. మా ఉన్నతాధికారులను వారి ఇండ్లకు పంపి వారికి కావాల్సిన సహాయ సహకారాలు అందించి, వారిలో భరోసా నింపుతున్నాం.

**- ఎంఆర్ నాయక్, ఐజీ, సదరన్ సెక్టార్, సీఆర్‌పీఎఫ్**

... నాగోజు సత్యనారాయణ,
స్టేట్ క్రైం రిపోర్టర్

# అందం కేరాఫ్ ఆయుర్వేదం



- తరచూ ముఖానికి పసుపు రాసుకునేవారికి మొటిమలు రావని చెబుతున్నారు ఆయుర్వేద నిపుణులు. తలస్నానం చేసే గంట ముందు పాలల్లో, నీళ్లలో పసుపు కలిపి ముఖానికి రాసుకుంటే ముఖం కాంతివంతమవుతుంది.
- కొందరికి ఎన్ని షాంపూలు పెట్టినా చుండ్రు మాత్రం పోదు. ఇలాంటి వారు షాంపూలకు బదులు కుంకుడు కాయలను వాడాలి. అంతే కాకుండా తలస్నానం చేసే ముందు కురులకు కొబ్బరినూనెను బాగా పట్టించాలి. గంట తర్వాత కుంకుడు కాయలు రుద్దుకొని తలస్నానం చేస్తే జుట్టు బలంగా తయారవుతుంది. చుండ్రు రాదు.
- ప్రస్తుతం చాలామంది చర్మ సంరక్షణకు మాయిశ్చరైజర్స్ వాడుతున్నారు. పూర్వం చర్మ సంరక్షణకు తాజా వెన్నను ఉపయోగించేవారు. దీనివల్ల వారి స్కిన్ లేతగా మారుతుంది. చర్మం పొడిబారకుండా ఉంటుంది.
- పెదాలు పగిలిపోతే లిప్‌బామ్స్, క్రీమ్స్ ఏవీ వాడకుండా కొబ్బరినూనె, వెన్న కూడా వాడొచ్చు. చర్మ సంరక్షణకు పెసరపిండి, శనగపిండి, పసుపును చర్మానికి పట్టించి నలుగు పెడితే చర్మం కాంతివంతంగా మారుతుంది.

# బ్రిటన్ అటార్నీ జనరల్‌గా సుయెల్లా..



**బ్రిటిష్ వారు ఒకప్పుడు భారతదేశ ప్రజల్ని బానిసలుగా చేసుకొని పాలించారు. ఇప్పుడు అదే బ్రిటిష్‌రాజ్యంలో భారత సంతతికి చెందిన వ్యక్తులు ఎన్నికల్లో గెలుపొంది భారతీయుల తెగువను చాటుతున్నారు. ఆక్కడి ప్రభుత్వంలో కీలక పదవులను చేపట్టే స్థాయికి ఎదుగుతున్నారు. బ్రిటన్ దేశ మంత్రివర్గ విస్తరణలో మన దేశ సంతతికి చెందిన సుయెల్లా బ్రేవర్‌మన్ అటార్నీ జనరల్‌గా ఎంపికయ్యారు.**

ఇటీవల బ్రిటన్ ప్రధానమంత్రి బోరిస్ జాన్సన్ మంత్రివర్గ విస్తరణలో మన సంతతికి చెందిన ముగ్గురు వ్యక్తులకు అవకాశం కల్పించారు. రిషి సునక్ ఆర్థిక శాఖ, అలోక్ శర్మ, సుయెల్లా బ్రేవర్‌మన్ అటార్నీ జనరల్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. గోవాకు చెందిన 39 ఏండ్ల సుయెల్లా బ్రేవర్‌మన్‌పై నమ్మకంతో బ్రిటన్ ప్రధానమంత్రి బోరిస్ జాన్సన్ ఆమెను అటార్నీ జనరల్‌గా నియమించారు.

ఉమా ఫెర్నాండేజ్, క్రిస్టీ దంపతులకు జన్మించారు సుయెల్లా. గోవాకు చెందిన ఉమా ఫెర్నాండేజ్ 1960 తర్వాత ఆమె బ్రిటన్‌కు వలస వెళ్లారు. 45 ఏండ్ల పాటు నర్సుగా సేవలందించిన ఉమా.. కొన్నాళ్లు కౌన్సిలర్‌గానూ పనిచేశారు. ఆమె భర్త క్రిస్టీ హౌజింగ్ సొసైటీలో పనిచేశారు. గ్రేటర్ లండన్‌లోని హరోవ్ ప్రాంతంలో పుట్టి, వెంబ్లీ నగరంలో పెరిగారు సుయెల్లా బ్రేవర్‌మన్. చిన్నప్పటి నుంచే చదువులో ముందుండే సుయెల్లా.. స్కాలర్ షిప్‌తోనే ప్రాథమిక విద్యను పూర్తి చేశారు. ఆ తర్వాత కేంబ్రిడ్జిలోని క్వీన్స్ కాలేజీలో 'లా' చదివారు. పాంథియోన్ సోర్బోన్నే విశ్వవిద్యాలయంలో యూరోపియన్, ఫ్రెంచ్ భాషల్లో న్యాయశాస్త్రంలో మాస్టర్స్ చేశారు. కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ కన్జర్వేటివ్ అధ్యక్షురాలిగా కూడా ఆమె పనిచేశారు. 2005 నుంచి 2015 వరకు న్యాయవాదిగా సేవలందించారు. విద్య, వైద్యం, సామాజిక న్యాయం వంటి అంశాలపై ఆమె పలు పత్రికల్లో కథనాలు రాశారు. సామాన్య ప్రజలకు న్యాయం చేకూర్చేందుకు పలు కేసులను వాదించారు. 2015లో జరిగిన ఎన్నికల్లో సుయెల్లా తొలిసారిగా పార్లమెంటు సభ్యురాలిగా పోటీ చేసి గెలుపొందారు. ఈ ఎన్నికల్లో 56.1 శాతం (22వేల ఓట్ల మెజారిటీ) సాధించారు సుయెల్లా. విద్యావ్యవస్థలో ఉండే అసమానతలను తొలగించేందుకు కృషి చేసి విజయం సాధించారు. మైఖేలా కమ్యూనిటీ స్కూల్ గవర్నర్ల అధ్యక్షురాలిగా సేవలందించారు. పలు స్వచ్ఛంద సంస్థలకు సలహాదారుగా ఉన్నారు. ఉచిత విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. 2017లో జరిగిన ఎన్నికల్లో లేబర్ పార్టీ తరపున సుయెల్లా విజయఢంకా మోగించారు. 2018లో యూరోపియన్ యూనియన్‌కు సెక్రటరీగా, బ్రెగ్జిట్ మంత్రిగా, ట్రెజరీకి పార్లమెంటరీ ప్రైవేటు కార్యదర్శిగా ఆమె సేవలందించారు. గతేడాది 'రెల్' అనే వ్యక్తిని వివాహం చేసుకున్నారు సుయెల్లా. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. 2019లో జరిగిన అక్కడి ఎన్నికల్లో ఫేర్‌హామ్‌లో కన్జర్వేటివ్ పార్టీ తరపున బరిలోకి దిగారు. ఆ ఎన్నికల్లో సుయెల్లా 26వేలకు పైగా మెజార్టీ సాధించారు. 'అందరికీ న్యాయం చేయాలనే ఆకాంక్ష ఈ పదవి ద్వారా చేయగలనని నమ్ముతున్నాను. అటు ప్రభుత్వానికి, ప్రజలకు అవసరమైన సేవలను అందించి మెరుగైన పరిపాలనకు కృషి చేస్తాను' అని అంటున్నారు సుయెల్లా బ్రేవర్‌మన్.

# ద్రవరూప ఆహారం



- క్యారెట్ రసంలో ఉండే కెరోటిన్ కాలేయానికి మేలు చేస్తుంది. బరువు తగ్గేందుకు కంటిచూపును మెరుగుపరిచేందుకు ఉపయోగపడుతుంది. ఉదర సంబంధ వ్యాధులతోపాటు క్యాన్సర్లను నిరోధించే శక్తి ఉంది.
- ప్రతిరోజూ భోజనం చేసే గంట ముందు రోజుకు రెండు సార్లు చొప్పున తోటకూర రసం తీసుకుంటే రక్తంలోని షుగర్ స్థాయిలు తగ్గుతాయి.
- వారానికోసారి టమాటా రసం తీసుకుంటే గుండె సంబంధ వ్యాధులు రాకుండా చూసుకోవచ్చు.
- కీరారసం కీళ్ల రుగ్మతలను పోగొడుతుంది. దీనిలో ఉండే అత్యున్నత స్థాయి పొటాషియం కిడ్నీలను శుభ్రపరుస్తుంది. రక్తపోటును తగ్గిస్తుంది. చర్మ సమస్యలను నివారించే మంచి ఔషధంలానూ పనిచేస్తుంది.
- కొత్తిమీరలో కాల్షియం కంటెంట్ ఎక్కువ. ఇది ఎముకలకు బలాన్ని చేకూరుస్తుంది. నెలసరి సమయంలో వేధించే నొప్పులు, ఇబ్బందులను దూరం చేసుకోవచ్చు.
- బీట్‌రూట్ రసం తాగితే రక్తపోటు అదుపులో ఉంటుంది. పెదాలు పొడిబారకుండా ఉంటాయి.



ప్రపంచ వ్యాప్తంగా కరోనా వైరస్ విస్తరిస్తున్న నేపథ్యంలో హైదరాబాద్‌లోని చార్మినార్‌ను సందర్శించేందుకు వచ్చిన పర్యాటకులు మాస్కులు ధరించిన దృశ్యం

# అమెరికాలో భారత ఉబెర్ డ్రైవర్‌కు ఏడాది జైలు

## దేశంలోకి అక్రమంగా ప్రవేశించినవారిని తరలించినందుకు శిక్ష

**న్యూయార్క్, ఫిబ్రవరి 14:** భారత సంతతికి చెందిన 30 ఏండ్ల యువకుడికి గురువారం అమెరికా కోర్టు ఏడాది జైలు శిక్ష విధించింది. అమెరికాకు అక్రమంగా వచ్చారని తెలిసి కూడా డబ్బు కోసం వారిని రవాణా చేసినందుకు అతడికి కోర్టు 12 నెలల కారాగార శిక్ష వేసింది. ఫిలడెల్ఫియా రాష్ట్రంలో నివాసముంటున్న భారత సంతతికి చెందిన జస్విందర్‌సింగ్ ఉబెర్ డ్రైవర్. అమెరికాలోకి అక్రమంగా చొరబడ్డారని తెలిసి కూడా అనేక మంది విదేశీయులను 2019 జనవరి ఒకటి నుంచి మే 20 మధ్య డబ్బు కోసం కారులో తరలించారనే అభియోగంపై జస్విందర్‌సింగ్‌ను పోలీసులు 2019 మే 20న అరెస్టుచేశారు. కెనెడా నుంచి అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించిన చిన్నారితోపాటు మరొకరిని పికప్ చేసుకోవడానికి న్యూయార్క్ స్టేట్‌కు కారు నడుపుకుంటూ వెళ్లాడు. వారిని పికప్‌చేసుకొన్న తర్వాత వారినుంచి సింగ్ కొంతమొత్తం తీసుకున్నారు. అమెరికాలో ఆశ్రయం పొందిన అనేక మందిని కూడా ఇలాగే తమ గమ్యస్థానాలకు తరలించాడనే ఆరోపణలు రుజువు కావడంతో న్యాయస్థానం సింగ్‌కు జైలు శిక్ష విధించింది.





గత ఏడాది కశ్మీర్‌లోని పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన 41 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లకు హైదరాబాద్‌లో నివాళులర్పిస్తున్న బజరంగ్‌దళ్ కార్యకర్తలు.

# పేలుతున్న పెయింట్ డబ్బాలు!

- సగం వాడి పడేసిన డబ్బాల్లో రసాయనిక చర్య
- ప్రాణాలమీదకొస్తున్న అవగాహన లోపం
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న నిపుణులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సగం వాడి పడేసిన రంగు డబ్బాలు పేలుతున్న ఘటనలు ఇటీవల వరుసగా చోటుచేసుకుంటున్నాయి. ఈ ప్రమాదాల్లో మృతి చెందుతుండటం, పలువురు తీవ్రంగా గాయపడుతుండటం ఆందోళన కలిగిస్తున్నది. ఎక్కువమంది బాధితులు చెత్త ఏరుకునేవాళ్లు, యాచకులు, కూలీ పనులు చేసుకొనే అమాయకులే ఉంటుండటం గమనార్హం. తాజాగా ఆదివారం రామోజీ ఫిల్మ్‌సిటీలో పాత పెయింట్ డబ్బా తెరిచేందుకు ప్రయత్నించగా పేలుడు జరిగి ఓ కార్మికుడు గాయపడ్డ ఘటనే ఇందుకు ఉదాహరణ. గత జనవరి 9న యూసుఫ్‌గూడలో పెయింట్ డబ్బా పేలి మాణిక్‌రావు అనే వ్యక్తి మృతిచెందగా, ఇటీవల రాజేంద్రనగర్‌లో జరిగిన ఘటనలో సయ్యద్ ఖాజా అలీ మృతిచెందాడు. ఈ నెల 8న ముషీరాబాద్‌లో, గత నవంబర్ 9న హైదరాబాద్ శివారు బాలాపూర్ మండలం జిల్లెలగూడ విజయ్‌నగర్ కాలనీలోనూ సగం వాడేసిన పెయింట్ డబ్బాలను తెరిచే ప్రయత్నంలో అవి పేలి పలువురు గాయపడ్డారు. అత్యాశ, అవగాహన లోపంతోనే ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నట్టు నిపుణులు చెప్తున్నారు. జాగ్రత్తలు పాటిస్తే ఇలాంటి ప్రమాదాలను నివారించవచ్చని సూచిస్తున్నారు. ఒక్కసారిగా పెద్ద శబ్దాలతో పేలుళ్లు సంభవిస్తుండటంతో అటు పోలీసులు, ఇటు స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. పెయింట్ డబ్బాలు ఎందుకు పేలుతున్నాయి? పేలకుండా ఎలా నిరోధించాలి? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? అన్నదానిపై హైదరాబాద్ క్లూస్ టీం హెచ్‌వోడీ డాక్టర్ వెంకన్న పలు అంశాలను 'నమస్తే తెలంగాణ'తో పంచుకున్నారు.



ముషీరాబాద్ హరినగర్‌లో పేలుడు జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న క్లూస్ టీం (ఫైల్)

### పెయింట్ డబ్బాలు ఎందుకు పేలుతున్నాయి?

రంగు వేయగానే వేగంగా ఆరిపోయేందుకు వీటిలో రసాయన మిశ్రమాలు, ద్రావణాలు కలుపుతుంటారు. వాస్తవానికి పెయింట్లు స్మూత్‌గా వచ్చేందుకు వీటిలో ఈథర్ బేస్డ్ ఆర్గానిక్ సాల్వెంట్ కలుపుతారు. ఇలా కలిపిన మిశ్రమం గాలిలోని ఆక్సిజన్‌తో జతకూడితే పెరాక్సైడ్స్‌గా మార్పు చెందుతాయి. ఈ పెరాక్సైడ్ మిశ్రమాలను ఎక్కువకాలం మూతపెట్టి ఉంచితే ఈథైల్ మిథైల్ పెరాక్సైడ్‌లుగా రూపాంతరం చెందుతాయి. లోపలి మిశ్రమం అలాంటి స్థితిలో ఉన్న డబ్బాలను తెరవడంలో ఏ చిన్న ఒత్తిడికి గురిచేసినా, వేడి తగిలినా అది బాంబు మాదిరిగా పేలుతుంది. ఈ పేలుడు తీవ్రత సెకన్‌కు 6000 మీటర్ల వేగంతో ఉంటుంది.

### ఇలా చేస్తే పేలవు

ఇండ్లలో, దుకాణాల్లో పాత పెయింట్ డబ్బాలు ఉన్నా, చెత్తకుండీల్లో సగం వాడేసిన పెయింట్ డబ్బాలు కనిపించినా అవి పేలుతాయేమోనని భయంతో విసిరేయొద్దు. గట్టిగా విసరడం, తొక్కడం, కాల్చడం ఏదిచేసినా అవి పేలే ప్రమాదం ఉంటుంది. పెయింట్ డబ్బాను ఒక పెద్దపాత్రలో లేదా బకెట్‌లో చల్లటి నీటిని, వీలైతే ఐస్ ముక్కల మధ్య దాదాపు రెండు గంటలపాటువేసి ఉంచితే వాటిలో రసాయనాలు చల్లబడి పేలుడు స్వభావాన్ని కోల్పోతాయి. తర్వాత నెమ్మదిగా డబ్బా మూతను తెరిచి అందులో మిగిలిన రంగును దూరంగా పారబోస్తే మేలు.

## కశ్మీర్‌పై పాక్‌కు అండగా నిలుస్తాం

### టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్



**ఇస్లామాబాద్, ఫిబ్రవరి 14:** కశ్మీర్ అంశంపై పాకిస్థాన్‌కు అండగా నిలుస్తామని టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్ ప్రకటించారు. రెండు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం పాక్‌కు వచ్చిన ఎర్డోగాన్ గురువారం ఆ దేశ పార్లమెంట్, సెనెట్ సంయుక్త సమావేశంలో మాట్లాడారు. ఘర్షణ, అణచివేత విధానాలతో కాకుండా న్యాయం, నిష్పాక్షికత ప్రాతిపదికన కశ్మీర్ అంశం పరిష్కారం కావాలని, అందుకు పాక్‌కు తమ మద్దతు ఉంటుందన్నారు. భారత్, పాకిస్థాన్ మధ్య ద్వైపాక్షిక అంశమైన కశ్మీర్‌పై ఆయన మరోసారి జోక్యం చేసుకున్నారు. భారత్ గతేడాది ఆగస్టు ఐదో తేదీన కశ్మీర్‌కు స్వయంప్రతిపత్తినిచ్చే 370 అధికరణాన్ని రద్దు చేసిన నేపథ్యాన్ని ఎర్డోగాన్ గుర్తు చేస్తూ.. 'కశ్మీరీలు కొన్ని దశాబ్దాలుగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇటీవలి కాలంలో కొన్ని ఏకపక్ష నిర్ణయాల వల్ల వారు బాధలు పడుతున్నారు' అని ఆందోళన వ్యక్తం చేశారు. కశ్మీర్ అంశం చర్చల ద్వారా పరిష్కారం కావాలన్నారు. న్యాయం, శాంతి కోసం టర్కీ కృషి చేస్తుందన్నారు. మొదటి ప్రపంచ యుద్ధంలో విదేశీ ఆధిపత్యం వల్ల తమ దేశం (టర్కీ) ఎదుర్కొన్న ఇబ్బందులను ఇప్పుడు కశ్మీరీలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కశ్మీర్ అంశాన్ని ఎర్డోగాన్ లేవనెత్తడం ఇది రెండోసారి. గతేడాది ఐక్యరాజ్యసమితి సాధారణ అసెంబ్లీ సర్వ సభ్య సమావేశాల్లో కశ్మీర్ అంశాన్ని ఆయన ప్రస్తావించారు. దీనిపై భారత్ అభ్యంతరం తెలిపింది. కశ్మీర్ సమస్య తమ రెండు దేశాల ద్వైపాక్షిక అంశమని పేర్కొంది.

## హథీరాంజీ మఠంలో మహంత్ అర్జున్‌దాస్ ఆందోళన

**తిరుపతి:** ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో గల హథీరాంజీ మఠంలో మహంత్ అర్జున్‌దాస్ శుక్రవారం ఆందోళనకు దిగారు. మఠం బాధ్యతలు స్వీకరించేందుకు ఉదయం మహంత్ అర్జున్‌దాస్ హథీరాంజీ మఠానికి చేరుకున్నారు. అయితే మహంత్‌కు బాధ్యతలు అప్పగించకుండానే కస్టోడియన్ అక్కడినుంచి వెళ్లిపోయారు. దీనిపై ఆగ్రహం వ్యక్తంచేసిన అర్జున్‌దాస్ మఠంలో బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మఠం బాధ్యతలు అప్పగించకపోతే కోర్టు ధిక్కరణ అవుతుందని తెలిపారు. తనను అడ్డుకొనే అధికారం ఎవరికీ లేదని పేర్కొన్నారు.



## మోదీజీ! ప్రమాణ స్వీకారానికి రండి

### ప్రధానికి ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ ఆహ్వానం

### ఢిల్లీ బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలకు కూడా

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:** ఆదివారం జరుగనున్న తన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రావాలని ప్రధాని నరేంద్రమోదీకి ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆప్) కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఆహ్వానించారు. ఈ నెల 16న ఉదయం 10 గంటలకు ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో ఢిల్లీ సీఎంగా కేజ్రీవాల్ ప్రమాణం చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రధాని మోదీకి శుక్రవారం ఉదయం ఆహ్వానం పలుకుతూ లేఖ పంపినట్లు ఆప్ ఢిల్లీ కన్వీనర్ గోపాల్‌రాయ్ చెప్పారు. అయితే, కేజ్రీవాల్ ప్రమాణ స్వీకారానికి ప్రధాని మోదీ హాజరవుతారా? లేదా? అన్న సంగతి తెలియరాలేదు. ముందుగా నిర్ణయించుకున్న షెడ్యూల్ ప్రకారం ప్రధాని మోదీ ఆదివారం తన సొంత నియోజకవర్గం వారణాసిలో 30కి పైగా ప్రాజెక్టుల ప్రారంభానికి వెళ్లనున్నారు. ఢిల్లీ నుంచి లోక్‌సభకు ఎన్నికైన ఏడుగురు బీజేపీ ఎంపీలు, ఎనిమిది మంది నూతన ఎమ్మెల్యేలను కేజ్రీవాల్ ప్రమాణ స్వీకారానికి హాజరు కావాలని ఆహ్వానాలు పంపామని గోపాల్ రాయ్ పీటీఐకి తెలిపారు. ఇతర రాష్ట్రాల సీఎంలు, రాజకీయ నాయకులను ఆహ్వానించడం లేదన్నారు. వరుసగా మూడోసారి సీఎంగా ప్రమాణం చేయనున్న కేజ్రీవాల్ ఆ వేడుకకు హాజరు కావాలని ఢిల్లీ వాసులను కోరుతూ అన్ని దినపత్రికల్లో మొదటి పేజీలో వాణిజ్య ప్రకటనలు జారీ చేశారు.

## కాంగ్రెస్ అంతర్ధానం వల్లే

# ఢిల్లీలో ఓడిపోయాం

### ఎన్నికల ఫలితాలపై కేంద్రమంత్రి జవదేకర్ వ్యాఖ్య



**పుణె, ఫిబ్రవరి 14:** ఎన్నికల బరి నుంచి కాంగ్రెస్ పార్టీ ఆకస్మిక అంతర్ధానం వల్లే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓటమి పాలైందని కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అదృశ్యంతో ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆప్)కు, తమ పార్టీకి మధ్య ముఖాముఖీ పోటీ జరిగిందన్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ ఆకస్మిక అంతర్ధానం ఆ పార్టీ సొంత వ్యవహారం అని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఓటుబ్యాంక్ ఆప్‌కు బదిలీ అయ్యిందని శుక్రవారం మీడియాతో చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో 26 శాతం ఓట్లు పొందిన కాంగ్రెస్.. ఈ ఎన్నికల్లో కేవలం నాలుగు శాతానికి పరిమితమైందన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ 62 స్థానాలు, బీజేపీ ఎనిమిది స్థానాల్లో గెలుపొందాయి. కాంగ్రెస్ పార్టీ వరుసగా రెండోసారి ఖాతా తెరవలేకపోయింది. 'మాకు 42 శాతం ఓట్లు వస్తాయి. ఆప్‌కు 48 శాతం ఓట్లు వస్తాయని అంచనా వేశాం. కానీ మా అంచనాలు విఫలమయ్యాయి. మాకు (బీజేపీ) 39 శాతం ఓట్లు లభిస్తే, ఆప్‌కు 51 శాతం ఓట్లు పోలయ్యాయి' అని తెలిపారు. ఎన్నికల్లో గెలుపోటములు, ఒడిదుడుకులు ఉంటాయన్నారు. కానీ బీజేపీ అన్ని అంశాలను విశ్లేషిస్తుందన్నారు. తానెప్పుడూ కేజ్రీవాల్‌ను 'ఉగ్రవాది' అని అనలేదని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వ్యాఖ్యలు, అభిప్రాయాలు చాలా ముఖ్యం అని జవదేకర్ పేర్కొన్నారు. విజయాలు, ఓటముల నుంచి గుణపాఠాలను నేర్చుకుంటామని తెలిపారు.



శుక్రవారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో పోర్చుగల్ అధ్యక్షుడు మర్సెలో రెబెలో డిసూజాతో కరచాలనం చేస్తున్న ప్రధాని మోదీ

## భారత్, పోర్చుగల్ మధ్య ఏడు ఒప్పందాలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:** నాలుగు రోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు వచ్చిన పోర్చుగల్ అధ్యక్షుడు మర్సెలో రెబెలో డిసూజాతో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక అంశాలపై ఇరువురు విస్తృతంగా చర్చించారు. అనంతరం భారత్, పోర్చుగల్ మధ్య ఏడు ఒప్పందాలు కుదిరాయి. పెట్టుబడులు, రవాణా, పోర్టులు, సాంస్కృతిక రంగం, పరిశ్రమలు, మేధో సంపత్తి హక్కుల విషయంలో ఇరుదేశాలు సహకరించుకోవాలని ఇరువురు నేతలు నిర్ణయించారు. 2017లో పోర్చుగల్‌లో పర్యటించిన ప్రధాని మోదీ అప్పట్లో ఆ దేశంతో 11 ఒప్పందాలు చేసుకున్నారు. దానికి కొనసాగింపుగానే ఇప్పుడు ఇరుదేశాల మధ్య ఏడు ఒప్పందాలు కుదిరాయి. అధికారులు మాట్లాడుతూ భారత్, పోర్చుగల్ మధ్య ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంతోపాటు వాణిజ్యం, పెట్టుబడులు, విద్య తదితర కీలక అంశాలపై విస్తృతంగా చర్చలు జరిగాయని చెప్పారు. ఈ నాలుగు రోజుల్లో సౌసా మహారాష్ట్ర, గోవాలోనూ పర్యటించనున్నారు.



కరీంనగర్ జిల్లా శంకరపట్నంలో కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న తెలంగాణ రైతు సంఘం నాయకులు

## కేంద్ర బడ్జెట్ ప్రతులు దహనం

- పెట్టుబడికి అదనంగా 50 శాతం మద్దతు ధర ఇవ్వాలి
- కరీంనగర్ జిల్లా శంకరపట్నం రైతుల డిమాండ్

**శంకరపట్నం:** కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండల కేంద్రంలోని కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు శుక్రవారం కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెల్మారెడ్డి రాజిరెడ్డి మాట్లాడుతూ రైతులు పెట్టిన పెట్టుబడికి అదనంగా 50 శాతం మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 1న కేంద్రం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతులకు మేలుచేసేలా లేదని చెప్పారు. రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని బడ్జెట్‌లో కేంద్రం ప్రతిబింబించలేదని అసంతృప్తి వ్యక్తంచేశారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ప్రగల్భాలు పలికిన కేంద్రం, కనీస మద్దతు ధర కల్పించడంలో విఫలమైందని విమర్శించారు. కనీస మద్దతు ధర అమలుచేయకపోవడంతో రైతులు ఏటా రూ.3 లక్షల కోట్లు నష్టపోతున్నట్టు గణాంకాలో తేలిందని పేర్కొన్నారు. ఏటా 10 వేల నుంచి 12 వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామీణ పేదలకు ఎంతగానో ఉపయోగపడుతున్న ఉపాధిహామీ పథకాన్ని నీరుగార్చడం సరికాదని అభిప్రాయపడ్డారు. ఈ పథకానికి గత బడ్జెట్‌లో రూ.71,000 కోట్లు కేటాయించిన సర్కారు, ఈ సారి బడ్జెట్‌లో రూ. 61,000 కోట్లకు తగ్గించడం విస్మయం కలిగించిందని చెప్పారు. ఇప్పటికైనా కేంద్రం వ్యవసాయ రంగానికి, గ్రామీణ ప్రాంతాలకు పెద్దపీట వేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో తెలంగాణ రైతు సంఘం నాయకులు గోపు వీరమల్లు, దుర్గాప్రసాద్, తోట రాము, సమ్మయ్య, వెంకటేశ్, సురేశ్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.



ఏపీలోని నెల్లూరు జిల్లా తడ మండలం పన్నంగాడు వద్ద ప్రమాదం దృశ్యం

## నెల్లూరు జిల్లాలో ఘోర ప్రమాదం

### నిలిచి ఉన్న పాల ట్యాంకర్‌ను ఢీకొట్టిన కారు

### నలుగురి మృతి.. ఒకరి పరిస్థితి విషమం

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా తడ మండలం పన్నంగాడు వద్ద శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృత్యువాతపడ్డారు. ప్రకాశం జిల్లా దర్శి మండలానికి చెందిన ఓ కుటుంబం కొంతకాలంగా ఒంగోలులోని రైలుపేటలో నివాసం ఉంటున్నది. గురువారం ఈ కుటుంబానికి చెందిన ఆరుగురు చెన్నై వెళ్లారు. అమెరికా వెళ్తున్న తల్లిదండ్రులను చెన్నై ఎయిర్‌పోర్టులో విమానం ఎక్కించి యశ్వంత్, ఇతర కుటుంబసభ్యులు తిరిగి ఒంగోలుకు బయలుదేరారు. తడ మండలం పన్నంగాడు వద్దకు రాగానే జాతీయ రహదారిపై ఆగి ఉన్న పాల ట్యాంకర్‌ను వీరు ప్రయాణిస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విజయలక్ష్మి (37), అను సెల్వీ (27), చిన్నారి రియాన్ (1) అక్కడికక్కడే మృతి చెందగా, మరో చిన్నారిని దవాఖానకు తరలిస్తుండగా ప్రాణాలు విడిచింది. యశ్వంత్ (35) పరిస్థితి విషమంగా ఉన్నదని వైద్యులు తెలిపారు.

## డీసీఎం బోల్తాపడి ఏడు ఆవులు మృతి

**కేతేపల్లి:** నల్లగొండ జిల్లా కేతేపల్లి మండల పరిధి కొర్లపహాడ్ గ్రామశివారులో 65వ నంబరు జాతీయరహదారిపై గల టోల్‌ప్లాజా సమీపంలో శుక్రవారం డీసీఎం వాహనం బోల్తా పడి ఏడుఆవులు మృతిచెందాయి. ఎస్సై బీ రామకృష్ణ, స్థానికులు తెలిపిన వివరాలిలా ప్రకారం.. విజయవాడ వైపు నుంచి హైదరాబాద్ వైపునకు 24 ఆవులతో బయలుదేరిన డీసీఎం, టోల్‌ప్లాజా సమీపంలోకి రాగానే అదుపు తప్పి పక్కనే ఉన్న గుంతలో బోల్తాపడింది. ప్రమాదంలో ఏడు ఆవులు అక్కడికక్కడే మృతిచెందాయి. మిగిలిన ఆవులకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని ఆవులను సూర్యాపేట సమీపంలో గల గోశాలకు తరలించారు. డ్రైవర్ పరారీలో ఉన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.



నల్లగొండ జిల్లా కొర్లపహాడ్ శివారులో బోల్తా పడిన డీసీఎంలో మృతిచెందిన ఆవులు

## కార్గో సేవలపై ఆర్టీసీ కసరత్తు

- పౌరసరఫరాలశాఖతో చర్చలు
- సాధ్యాసాధ్యాలపై ప్రాథమికంగా అధ్యయనం
- రవాణా కోసం ఏటా రూ.300 కోట్లు ఖర్చుచేస్తున్న పౌరసరఫరాలశాఖ





**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వివిధ ప్రభుత్వ శాఖలకు సరుకు రవాణా (కార్గో) సేవలను అందించడానికి తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ (టీఎస్‌ఆర్టీసీ) ముమ్మర కసరత్తు చేస్తున్నది. కార్గో సేవల కోసం ఇప్పటికే దాదాపు 50 బస్సులను సిద్ధంచేసిన అధికారులు.. వీటి సంఖ్యను 800కు పెంచేందుకు ప్రణాళికలు సిద్ధంచేస్తున్నారు. కార్గో సేవల విజయవంతానికి వివిధ ప్రభుత్వశాఖలను భాగస్వాములను చేయాలని నిర్ణయించిన అధికారులు.. ఇప్పటికే పౌరసరఫరాలశాఖతో సంప్రదింపులు జరిపి, ప్రాథమిక అంశాలపై చర్చించినట్టు తెలుస్తున్నది. పౌరసరఫరాల శాఖ సరుకు రవాణా కోసం ఏటా దాదాపు రూ.300 కోట్లు ఖర్చుచేస్తున్నట్టు సమాచారం. రేషన్ దుకాణాలకు, సంక్షేమ హాస్టళ్లకు బియ్యాన్ని సరఫరాచేసేందుకు 600 నుంచి 700 లారీలను ఉపయోగిస్తున్నారు. 170 నుంచి 200 మంది కాంట్రాక్టర్లు ఈ ప్రక్రియను పూర్తిచేస్తున్నారు. ఇందులో అవినీతి జరుగకుండా ఇప్పటికే పౌరసరఫరాల శాఖ జీపీఎస్ ద్వారా నిత్యం సమీక్షిస్తున్నది. పౌరసరఫరాలశాఖ సహకారాన్ని అందిపుచ్చుకొంటే.. ఆదాయం సమకూరుతుందని ఆర్టీసీ అధికారులు భావిస్తున్నారు. దీంతోపాటు ఎరువులు, విత్తనాల సరఫరా కోసం వ్యవసాయశాఖ కూడా పెద్ద మొత్తంలో రవాణాఖర్చులు చెల్లిస్తున్నట్టు ఆర్టీసీ అధికారులు గుర్తించారు. విద్య, వైద్యం, బేవరేజస్ తదితర శాఖల్లోనూ రవాణా కోసం ఖర్చుచేయాల్సి వస్తున్నది. ఈ అవకాశాలన్నింటిని అందిపుచ్చుకొంటే ఆర్టీసీ ఆదాయానికి ఎలాంటి ఢోకా ఉండదని ఆ సంస్థ అధికారులు భావిస్తున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా త్వరలో ఆర్టీసీలో కార్గో సేవలు ప్రారంభమవుతాయని ఓ ఉన్నతాధికారి తెలిపారు.

# వినియోగదారులకు భరోసా!

- సత్వర న్యాయం అందిస్తున్న వివాదాల పరిష్కారాల కేంద్రం
- హైదరాబాద్ సహా జిల్లాల్లో చురుకుగా పనితీరు
- టోల్ ఫ్రీ నంబర్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని సలహా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్ నగరానికి చెందిన ఒక వ్యక్తి అనారోగ్యంగా ఉన్నదని దవాఖానకెళ్తే పరీక్షలు చేసి మధుమేహం ఉన్నదని నిర్ధారించారు. వైద్యులు సూచించిన మందులు వాడటంతో విపరీతంగా విరోచనాలు అయ్యి ప్రాణం మీదకు వచ్చింది. వేరే దవాఖానకు తీసుకెళ్లగా ఆయనకు డయాబెటిస్ లేదని తేలింది. తనకు జరిగిన మోసంపై వివాదాల పరిష్కారాల కేంద్రాన్ని ఆశ్రయించగా.. బాధితుడికి రూ.లక్షా ఆరు వేలు హాస్పిటల్ యాజమాన్యం నుంచి పరిహారంగా ఇప్పించి ఆదుకొన్నారు. ఇలాంటి మోసాలు తరుచూ జరుగుతుండటం చూస్తుంటాం. అయితే, ఎవరికి ఫిర్యాదు చేయాలి? ఎలా చేయాలి? అనే సంశయంతో ఫిర్యాదు చేయకుండా వదిలేస్తుంటారు. దీంతో మోసగాళ్లకు అడ్డూఅదుపు లేకుండాపోతున్నది. హోటళ్లు, మెడికల్ షాపులు, షాపింగ్‌మాల్స్, పండ్ల విక్రయ దుకాణాలతోపాటు ఆన్‌లైన్ కేంద్రంగా మోసాల సంఖ్య పెరిగిపోయింది. హక్కుల గురించి వినియోగదారులకు తెలియకపోవటంతో సులువుగా మోసపోతున్నారు. ఈ నేపథ్యంలో తమ వద్దకు వచ్చేవారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తూ పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వినియోగదారుల వివాదాల ప్రత్యామ్నాయ పరిష్కార కేంద్రం భరోసా కల్పిస్తున్నది.

### వేగంగా వివాదాల పరిష్కారం

పెద్దగా ప్రచారంలో లేని ఈ వినియోగదారుల కేంద్రం.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం పరిష్కరించిన కేసుల కారణంగా ప్రజలకు చేరువైంది. 2014 నుంచి 2019 డిసెంబర్ వరకు 1,560 ఫిర్యాదులు అందగా.. 1,332 కేసులు పరిష్కారమయ్యాయి. ఒక్కో కేసు సగటున 15 నుంచి 45 రోజుల్లోగా పరిష్కారమయ్యేలా అధికారులు చర్యలు తీసుకొంటున్నారు. హైదరాబాద్‌తోపాటు అన్ని జిల్లాల్లోని కేంద్రాలు చురుకుగా పనిచేస్తున్నాయి.

### ఫిర్యాదు చేయడం ఇలా..

వస్తువు లేదా సేవలను కొనుగోలు చేసిన వారు ఏ రకంగానైనా మోసపోయినట్టు గుర్తించగానే ఈ కేంద్రంలో ఫిర్యాదు చేయాలి. బిల్లులు, కంపెనీ పేరు, చిరునామా తదితర విషయాలను తప్పనిసరిగా అందజేయాలి. ఎలాంటి పరిష్కారం కోరుతున్నారో అనేది కూడా స్పష్టంగా ఫిర్యాదులో పేర్కొనాలి. వినియోగదారులకు సమాచారం, సేవలు అందించేందుకు టోల్‌ఫ్రీ నంబర్ 18004250033తో పాటు ఫేస్‌బుక్, ట్విట్టర్ వేదికలను ఏర్పాటు చేశారు.





### మోసాలకు తక్షణ పరిష్కారం

**వినియోగదారులు** మోసపోయిన కేసుల్లో వివాదాల ప్రత్యామ్నాయ పరిష్కారాల కేంద్రాన్ని సంప్రదించడం వల్ల తక్షణ పరిష్కారం పొందవచ్చు. ఇరువర్గాలను పిలిచి సామరస్యంగా సమస్యను పరిష్కరించడంలో ఈ కేంద్రం కృషి అభినందనీయం. నూతన వినియోగదారుల హక్కుల రక్షణ చట్టంలోనూ మన రాష్ట్రంలో అమలుచేస్తున్న అంశాలను పొందుపరిచారు.

- పీ సత్యనారాయణరెడ్డి, కమిషనర్, పౌరసరఫరాలశాఖ

III.
నమస్తే తెలంగాణ
# సంపద
[ కరీంనగర్ ]
శనివారం 15 ఫిబ్రవరి 2020

## 2019లో 6.2 బిలియన్ల పీఈ

**భా**రతీయ రియల్ ఎస్టేట్ రంగం 2019లో 6.2 బిలియన్ డాలర్ల (రూ. 43,704 కోట్లు) ప్రైవేట్ ఈక్విటీ పెట్టుబడులను ఆకర్షించింది. సంస్థాగత పెట్టుబడిదారుల ఆసక్తి అనుగుణంగా ఆఫీసు స్థలాల మీదే ప్రధానంగా పీఈ సంస్థలు పెట్టుబడుల్ని పెట్టాయి. గతేడాది నుంచి దేశంలో రియల్ రంగంలో మొత్తం పెట్టుబడి.. 3 శాతం పెరిగింది. 2019లో ఆఫీసు విభాగం సంస్థాగత పెట్టుబడిదారుల నుంచి 3.1 బిలియన్ డాలర్లను ఆకర్షించింది. సంవత్సరంలోని మొత్తం పెట్టుబడుల్లో 50.1 శాతం ఆఫీసు విభాగంలోనే కాగా, మొత్తం పెట్టుబడిలో 72.9 శాతం విదేశీ పెట్టుబడిదారులు నుంచి వచ్చినవే కావడం విశేషం. 2018లో 64 శాతంగా ఉన్న ఈక్విటీ క్యాపిటల్ నిధులు 2019 కల్లా 80.5 శాతానికి పెరిగింది. రూ.43,704 కోట్లకు చేరుకున్న పీఈ పెట్టుబడులు భారతీయ రియల్ ఎస్టేట్ మార్కెట్‌పై సంస్థాగత పెట్టుబడిదారులకు గల విశ్వాసాన్ని స్పష్టం చేస్తుంది. వాణిజ్య రంగంలో బలమైన డిమాండ్ ఉన్నందున ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు పెట్టబడిదారులు ఆసక్తి చూపుతున్నారు. పెట్టుబడి ఒప్పందాల సంఖ్య 17 శాతం తగ్గింది. ఇది రూ.వెయ్యి కోట్ల విలువైన పెద్ద పరిమాణ లావాదేవీల పెరుగుదలను సూచిస్తుంది. విదేశీ పెట్టుబడిదారులు, దేశీయ సంస్థల మధ్య జాయింట్ వెంచర్లు దీర్ఘకాలికంగా ఈ రంగంలో పెట్టుబడి పెడుతున్నాయి.



పుల్వామా అమరుల కుటుంబాలకు
## ఉచితంగా ఫ్లాట్లు

**సీఆర్‌పీఎఫ్ ఐజీ డీఎస్ చౌహాన్ సమక్షంలో అందజేసిన క్రెడాయ్ నేషనల్**

**అ**మరుల కుటుంబాలను అదుకునే బాధ్యత తమకూ ఉందని క్రెడాయ్ నేషనల్ నిరూపించింది. భారతదేశంలో నిర్మాణ సంస్థల సమాఖ్య క్రెడాయ్ నేషనల్.. పుల్వామా అమరుల కుటుంబాలు నివసించడానికి అవసరమయ్యే ఫ్లాట్లను ఉచితంగా అందజేసింది. న్యూఢిల్లీలో ఇటీవల ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సీఆర్‌పీఎఫ్ ఐజీపీ డీఎస్ చౌహాన్ హాజరయ్యారు. తొమ్మిది మంది అమరుల కుటుంబాలకు ఫ్లాట్ల కేటాయింపు పత్రాల్ని అందించారు. దేశం కోసం అమరులైన కుటుంబాలకు తమ పూర్తి సంఘీభావాన్ని తెలిపారు. ఇప్పటికే మరో పది ఫ్లాట్లను క్రెడాయ్ సంఘానికి చెందిన పశ్చిమ బెంగాల్, రాజస్థాన్, తమిళనాడు, జార్ఖండ్ వంటి రాష్ట్రాల సంస్థలు అందజేశారు. క్రెడాయ్ అందజేసిన ఫ్లాట్లలో శాశ్వత నివాసం ఏర్పాటు చేసుకున్న అమరుల కుటుంబాలు ఐదేండ్ల వరకూ ఎలాంటి నిర్వహణ రుసుమును చెల్లించాల్సిన అవసరం లేదు. నలభై కుటుంబాలకు ఫ్లాట్లను అందించడానికి తాము సంసిద్ధంగా ఉన్నామంటూ క్రెడాయ్ నేషనల్ ఛైర్మన్ జక్సేషా తెలిపారు.

## స్వాంతన ఆరోగ్య గ్రామం

**సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడానికి ప్రతిరోజు పరుగులు పెడుతూ.. జీవితాన్ని ఒత్తిడిమయం చేసుకుంటున్నారా? ట్రాఫిక్ రణగొణ ధ్వనుల్లో ప్రయాణం చేస్తూ జీవితం నరకప్రాయం అవుతున్నదా? రకరకాల మానసిక రుగ్మతలు మిమ్మల్ని పట్టి పీడిస్తున్నాయా? జీవనశైలి సమస్యలతో సరికొత్త ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారా?**



**ఇ**లాంటి సమస్యలను ఎదుర్కొనేవారికి స్వాంతన చేకూర్చేందుకు.. సహజ వైద్యంతో చికిత్సను అందించడానికి.. ప్రగతి గ్రూపు ప్రప్రథమంగా 'స్వాంతన ఆరోగ్య గ్రామం'కు శ్రీకారం చుట్టింది. చిలూకురు బాలజీ టెంపుల్ రోడ్డులోని ప్రగతి రిసార్ట్స్‌లో ఏర్పాటైన స్వాంతనను శనివారం చినజీయర్ స్వామి ఆరంభిస్తారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఈటెల రాజేందర్, వి.శ్రీనివాస్ గౌడ్, చేవేళ్ల ఎంపీ డా.రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యే కాలే యాదయ్య తదితరులు పాల్గొంటారని ప్రగతి సంస్థ తెలియజేసింది. ప్రముఖ యూరాలజిస్ట్, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ బి.నాగరాజు పర్యవేక్షణలో ఈ సహజసిద్ధమైన చికిత్స కేంద్రం పని చేస్తుంది. జీవనశైలిలో వస్తున్న మార్పుల వల్ల ఎదురయ్యే మానసిక రుగ్మతలకు ఇందులో చికిత్స లభిస్తుందని ప్రగతి గ్రూప్ చెబుతున్నది.

# 'యూడీఎస్' వద్దు.. 'రెరా' ముద్దు

అటు నిర్మాణ సంస్థలకు ఇటు కొనుగోలుదారులకు మేలు చేయాలన్న సంకల్పంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రెరా చట్టాన్ని 2017 జనవరి 1 నుంచి అమల్లోకి తెచ్చింది. ఆతర్వాత నమోదు అయిన ప్రాజెక్టుల్ని మాత్రమే రెరా పరిధిలోకి తెచ్చేలా వెసులుబాటును కల్పించింది. ఈ రంగాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే, కొందరు డెవలపర్లు అక్రమ పద్ధతుల్ని వదలిపెట్టడం లేదు. రెరా నిబంధనలకు పూర్తి విరుద్ధంగా.. తక్కువ రేటంటూ.. అమాయకులైన కొనుగోలుదారులకు దొడ్డిదారిన ఫ్లాట్లను అంటగడుతున్నారు. యూడీఎస్ విధానంలో అక్రమంగా విక్రయిస్తున్నారు.




**యూ**డీఎస్ అంటే ఏమిటనే సందేహం మనలో చాలా మందికి కలగొచ్చు. దీన్ని 'అన్‌డివైడెడ్ షేర్ ఆఫ్ ల్యాండ్' విధానం అని కూడా అంటారు. అంటే, ఒక ప్రాజెక్టులో రెరా అనుమతి తీసుకున్న తర్వాత ఫ్లాట్ కొనడం బదులు.. రెరా అనుమతి రాక ముందే.. అసలు దాన్ని జోలికి వెళ్లకుండానే ఆయా ప్రాజెక్టులో స్థలాన్ని విక్రయించడం అన్నమాట. ఉదాహరణకు ఎకరం స్థలంలో ఒక బిల్డర్ 100 ఫ్లాట్లను కడుతున్నాడని అనుకుందాం. అందులో ఒక్కొక్కరికీ 48.40 గజాలు వస్తుంది. పెట్టుబడి పెట్టే వారికి నమ్మకం కలిగించడానికి ఈ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసిస్తున్నారు. ఇలా ఎందుకు అంటే? అపార్టుమెంట్ పూర్తయ్యాక డబుల్ బెడ్‌రూం ఫ్లాటు విలువ రూ.50 లక్షలుంటే, ఒకేసారి సొమ్ము చెల్లిస్తే.. ముప్పయ్‌కో, ముప్పయ్ ఐదు లక్షలకో ఫ్లాట్లను కొందరు బిల్డర్లు కేటాయిస్తున్నారు. కాకపోతే, ఆయా అపార్టుమెంట్ పూర్తి అవ్వడానికి మూడు నుంచి నాలుగేండ్లు పడుతుంది. ఇంకా, ఎక్కువే పట్టినా ఆశ్చర్యపోనక్కర్లేదు. ఇలాంటి వాటిలో పెట్టుబడి పెట్టే ముందు గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే.. ఒకేసారి చెల్లించే సొమ్ము మీద వడ్డీని లెక్కగట్టినా, మూడు లేదా నాలుగేండ్ల తర్వాత అంతే లెక్క తేలుతుంది. ఈ లాజిక్‌ను చాలామంది మర్చిపోయి.. వెనకా ముందు చూడకుండా.. తక్కువలో వస్తుంది కదా అని యూడీఎస్ విధానంలో స్థలాన్ని కొనుగోలు చేసి చేతులు కాల్చుకుంటున్నారు.

**రెండు సమస్యలు..**

యూడీఎస్ విధానంలో ఫ్లాట్లను కొనేవారికి పలు సమస్యలు ఎదురయ్యే అవకాశం లేకపోలేదు. తక్కువకు వస్తుందని స్థలం కొంటే.. ఆయా నిర్మాణంలో తక్షణమే భాగస్వామిగా మారిపోతారు. పొరపాటున డెవలపర్ సకాలంలో అపార్టుమెంటును పూర్తి చేయకపోతే, అందులో స్థలం కొన్నవారి మెడకు సమస్య చుట్టుకుంటుంది. ఉన్న సొమ్ము పోయి, ఫ్లాటు చేతికి రాక.. పక్కవాళ్లకూ ఫ్లాటు సకాలంలో చేతికి రాకపోతే, దానికీ బాధ్యత వహించాల్సి వస్తుందన్నమాట. కాబట్టి, ఇలాంటి అక్రమ విధానంలో ఫ్లాట్లను కొనుగోలు చేసేవారు ఒకటికి రెండుసార్లు ఆలోచించి నిర్ణయం తీసుకుంటే ఉత్తమం. పైగా, ఇలాంటి నిర్మాణాల్లో ఫ్లాట్లు కొనాలనుకుంటే, బ్యాంకులూ రుణాల్ని మంజూరు చేయవు.

**రెరా డెవలపర్లకు తలనొప్పి..**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకుని అధిక శాతం మంది బిల్డర్లు.. స్థానిక సంస్థల నుంచి అనుమతి తీసుకుని, రెరా వద్ద రిజిస్టర్ చేసుకుని ఫ్లాట్లను విక్రయిస్తున్నారు. రెరా అథారిటీ నిబంధనల్ని కచ్చితంగా పాటిస్తున్నారు. అయితే, కొందరు యూడీఎస్ పద్ధతుల్లో ఫ్లాట్లను విక్రయిస్తూ రెరాకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. వీరంతా, రెరా బిల్డర్లకు పోటీగా నిలుస్తున్నారు. కొందరు కొనుగోలుదారులు ధర తక్కువ అని యూడీఎస్ విధానంలో కొనడానికి ఆసక్తి చూపిస్తున్నారే తప్ప.. అసలు ఫ్లాటు చేతికి వస్తుందా? లేదా? అనే అంశాన్ని మాత్రం పట్టించుకోవడం లేదని రియల్ నిపుణులు ఆందోళన చెందుతున్నారు. ఈ తరహా ప్రాజెక్టుల భూములకు సంబంధించి న్యాయపరమైన చిక్కులు ఎదురైతే, లేనిపోని సమస్యలు ఎదురయ్యే ప్రమాదముందని అంటున్నారు. అందుకే, రెరాలో నమోదైన ప్రాజెక్టుల్లో కొనుగోలు చేయడమే శ్రేయస్కరమని, యూడీఎస్ విధానం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని అభిప్రాయపడుతున్నారు.

- హైదరాబాద్‌లో కొందరు బిల్డర్లు సాగిస్తున్న ఈ అక్రమ తంతు వల్ల బడా డెవలపర్లు సైతం ఇబ్బంది పడుతున్నారు. కేవలం నివాస గృహాల్లోనే కాదు.. వాణిజ్య సముదాయాల్లో సైతం యూడీఎస్ విధానంలో అమాయక కొనుగోలుదారులకు స్థలాన్ని అంటగట్టేస్తున్నారు. తక్కువ రేటుకు మూడేండ్లలోపు ఫ్లాట్లను అందజేస్తామని నమ్మ బలుకుతూ బయ్యర్లను బుట్టలో వేసుకుంటున్నారు. అంతంత సొమ్ము పెట్టి, ఒకవేళ అందులో వాణిజ్య స్థలానికి గిరాకీ రాకపోయినా, లేక అద్దెలు తగ్గిపోయినా, అసలుకే మోసం వచ్చే ప్రమాదం లేకపోలేదు. కాబట్టి, కొనుగోలుదారులు తమ కష్టార్జితాన్ని బూడిదలో పోసిన పన్నీరు కాకుండా ఉండాలంటే, రెరా ప్రాజెక్టుల్లో ఫ్లాట్లను ఎంచుకోవడం ఉత్తమం.

## భారత్ వైపు.. జపాన్ చూపు

**జపాన్ పెట్టుబడిదారులు, డెవలపర్లు భారత నిర్మాణ రంగంలో పెట్టుబడులను పెట్టేందుకు మొగ్గు చూపుతున్నారు. ఆసియాలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారతదేశం అభివృద్ధి చెందడంతో ఇక్కడ పెట్టుబడులను పెట్టేందుకు జపనీస్ డెవలపర్లు అధిక ఆసక్తి చూపుతున్నారు. జపాన్‌కు చెందిన మిత్సుయ్ ఫడ్సన్, మిత్సుబుషి కార్పొరేషన్, సుమిటోమో కార్పొరేషన్, జెన్కాయ్ క్యాపిటల్ వంటి సంస్థలు భారత రియల్ రంగంపై దృష్టి సారిస్తుండటం విశేషం.**



**భా**రతదేశంలో వాణిజ్య, నివాస సముదాయాల్లో పెట్టుబడులు పెట్టేందుకు అధిక అవకాశాలున్న విషయాన్ని జపాన్ సంస్థలు గుర్తించాయి. గత కొంతకాలం నుంచి ఇక్కడ రూపుదిద్దుకుంటున్న వాణిజ్య, ఐటీ, నివాస గృహాల్ని చూస్తే ఎవరికైనా ఇట్టే ముచ్చటేస్తుంది. అందుకే, జపాన్ మన దేశంలో పెట్టుబడులు పెట్టేందుకు అధిక ఆసక్తి చూపిస్తున్నది. ఈ జాబితాలో జపాన్ మూడో స్థానంలో ఉండటం గమనార్హం.

- జపనీస్ నైపుణ్యానికి తగినట్టుగానే భారతదేశంలోని వాణిజ్య స్థలాలు వృద్ధి చెందుతున్నాయి. ఈమధ్య జపాన్‌కు చెందిన రియల్ ఎస్టేట్ డెవలపర్ మిత్సుయ్ ఫడ్సన్, భారతదేశంలో ఆర్ఎంజెడ్ కార్పొరేషన్‌తో కలిసి ఒక బిలియన్ డాలర్ల విలువైన వాణిజ్య ప్రాజెక్టును అభివృద్ధి చేసింది. సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సిపా) ద్వారా ఇరు దేశాల మధ్య బలమైన సంబంధాలను ఏర్పరచుకోవడానికిది దోహదపడింది. వచ్చే ఐదేళ్లలో భారతదేశం ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగేందుకు లక్ష్యంగా చేసుకోవడంతో, ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు బలపడుతున్నాయి.

- వాస్తవానికి, భారత రియల్ రంగంలో తొలి పెట్టుబడిని మిత్సుబుషి కార్పొరేషన్, 2018లో చెన్నైలోని శ్రీరామ్ ప్రాపర్టీస్‌లో రూ.180 కోట్లను పెట్టింది. భారత రియల్ రంగంలో పారదర్శకత వల్ల ఇలాంటి పెట్టుబడులు మరిన్ని వచ్చే అవకాశముంది. మరో కంపెనీ సుమిటోమో కార్ప్ గతేడాది అతిపెద్ద భూ ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లోని మూడెకరాల స్థలాన్ని రూ. 2,238 కోట్లకు కొనుగోలు చేసింది. భారతీయ డెవలపర్లకు నిధుల్ని అందించడంలో జపనీస్ సంస్థలు ముఖ్య పాత్ర పోషిస్తాయని అంచనా. 2020 సంవత్సరం రియల్ రంగానికి కీలకమని భారతీయ డెవలపర్లు చెబుతున్నారు. మొట్టమొదట సింగపూర్ సంస్థ నుంచి పెట్టుబడులు ప్రారంభమయ్యాయి. అనంతరం యూఎస్, యూరప్ నుంచి నిధులు వచ్చాయి. 2005 నుంచి 2008 మధ్య భారత రియల్ రంగం రూ.5.7 బిలియన్ డాలర్ల పెట్టుబడులను అందుకున్నది.

## 18 కోట్ల జీఎస్టీ ఎగవేత.. బిల్డర్ అరెస్టు

రూ.18 కోట్ల జీఎస్టీ ఎగవేత ఆరోపణలతో ఒక రియల్ ఎస్టేట్ డెవలపర్‌ను డైరెక్టర్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్(డీజీజీఐ) అరెస్టు చేసింది. నిర్మాణ రంగంలో పేరెన్నిక గల రియాల్టీ సంస్థకు చెందిన పలు కార్యాలయాల్లో డీజీజీఐ సోదాలు నిర్వహించింది. ఆ రియాల్టీ సంస్థ పెద్ద ఎత్తున జీఎస్టీ ఎగవేసినట్టు సోదాల్లో వెల్లడైంది. ఆ రియల్ ఎస్టేట్ డెవలపర్ చేపట్టిన వివిధ ప్రాజెక్టుల్లోని అమ్మకాలు, పెట్టుబడులకు సంబంధించిన డైరీలు, ఖాతాదారుల నుంచి నగదు సహా పలు పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అమ్మకపు విలువను తగ్గించడంతోపాటు ఆదాయంలో ఎక్కువ భాగాన్ని నగదు రూపంలో పొందడం ద్వారా జీఎస్టీని చెల్లించలేదని దర్యాప్తులో తేలింది. రూ.135 కోట్ల నగదు చెల్లింపులు అందుకున్నానని, దీనిపై 16 కోట్లకు పైగా జీఎస్టీ చెల్లించలేదని డెవలపర్ అంగీకరించారు.




## 50 లక్షల్లోపు ఫ్లాట్లు ఇక్కడే..



| ప్రాజెక్టు పేరు | ఎక్కడ | నిర్మాణ సంస్థ | ఫ్లాటు విస్తీర్ణం(చ.అ) | ధర (రూ.లక్షల్లో) |
|---|---|---|---|---|
| ఉమాస్ సృష్టి హైట్స్ | నార్సింగి | ఉమాస్ డెవలపర్స్ | 1100-1200 | 39.6-46.8 |
| గిరిధారి రాజ్యక్షేత్ర | అప్పా జంక్షన్ | గిరిధారి హోమ్స్ | 1052-1345 | 47.3-60.5 |
| రాంకీ గ్రీన్‌వ్యూ | తుక్కుగూడ | రాంకీ ఇంటిగ్రేడెట్ టౌన్‌షిప్ | 979-1130 | 41.1-47.5 |
| ఆశ్రిత జువెల్స్ కౌంటీ | కిష్టారెడ్డిపేట్ | - | 1680 | 45 |
| ఇన్‌కార్ | పటాన్‌చెరు | లార్వెన్ బిజినెస్ సొల్యూషన్స్ | 1075 | 48 |
| ఆశ్రితా గ్రూప్ | బీరంగూడ | - | 1600 | 50 |
| కేఎస్ఆర్ కమటం ప్రైడ్ | బీరంగూడ | ఫిడో ప్రాపర్టీ మేనేజ్‌మెంట్ | 1100-1150 | 39.6-41.4 |
| సృజనాస్ ఎగ్జిక్యూటివ్ పార్క్ | ఇస్నాపూర్ | సృజనా హోమ్స్ | 1493 | 43.3 |
| కోటెక్ సిగ్నేచర్ | మల్లంపేట | గ్లోబల్ ప్రాపర్టీస్ | - | 48 |
| వాసుశ్రీ రెసిడెన్సీ | బండ్లగూడ | - | 1072 | 49 |
| ఎస్ఎన్ఆర్ అవెన్యూ | గోపన్‌పల్లి | సాహితీ కన్‌స్ట్రక్షన్స్ | 1290 | 40 |
| ఆశ్రితా జువెల్స్ కౌంటీ | కిష్టారెడ్డిపేట్ | మై డ్రీం ప్రాపర్టీస్ | 1550 | 49.6 |
| ఎలిగెన్సీ రెసిడెన్సీ | హస్తినాపురం సెంట్రల్ | ప్రసాద్ ప్రాపర్టీస్ | 1135 | 46 |
| అక్యుమెన్ హైట్స్ | ఆరాంఘర్ | ప్రసాద్ ప్రాపర్టీస్ | 1150 | 49 |
| ఏవీఎస్ జీ కే రెసిడెన్సీ | ఆదిభట్ల | సామ్రాజ్ డెవలపర్స్ | 1140-1221 | 38.1-40.9 |
| అమృతా ఆర్కేడ్ | ప్రగతి నగర్ | - | 1250 | 40 |
| అస్పైర్స్ స్పేస్ | అమీన్‌పూర్ | వీఎన్ రెడ్డి రియల్ ఎస్టేట్ | 1165 | 46.58 |
| శ్రీ అయ్యప్ప | హిమాయత్‌నగర్ | శ్రీ అయ్యప్ప రియల్ ఎస్టేట్ | 1050 | 45 |
| బెక్కన్ లైఫ్‌స్టైల్ కొంపల్లి | దేవేందర్ కాలనీ | వైనం ఇన్‌ఫ్రా | 1176 | 47.04 |
| రోస్ రెసిడెన్సీ | మెహిదీపట్నం | - | 1303 | 48 |
| ప్రావిడెంట్ కెన్వర్త్ | రాజేంద్రనగర్ | ప్రావిడెంట్ | 610 | 42 |
| స్పేస్ లింక్ ఇన్‌ఫ్రా | బాచుపల్లి | స్పేస్ లింక్ ఇన్‌ఫ్రా | 1135 | 43.5 |
| అవెన్యూ ప్రైడ్ | గోపన్‌పల్లి | వైనం-ధాస్ | 1289 | 41.2 |
| ద్వారాకా రెసిడెన్సీ | పుప్పాల్‌గూడ | యూఎల్వీ ప్రద్యోతన్ | 1475 | 50 |

గమనిక : కేవలం అవగాహన కోసమే ఈ పట్టిక. న్యాయపరంగా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా గమనించాక, ధర గురించి పూర్తిగా తెలుసుకున్నాకే తుది నిర్ణయం తీసుకోవాలి.
















epaper.ntnews.com

నమస్తే తెలంగాణ
# చిత్రం
[ కరీంనగర్ ]
శనివారం 15 ఫిబ్రవరి 2020


నాగచైతన్య, సాయిపల్లవి

## ముద్దు పెడితే ఏడుస్తారాబ్బా?

'ఏయ్ పిల్లా పరుగున పోదామా.. ఏ వైపో జంటగా ఉందామా..' అంటూ ప్రియురాలితో ప్రణయగీతాన్ని పాడుకుంటున్నారు నాగచైతన్య. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'లవ్‌స్టోరీ'. శేఖర్‌కమ్ముల దర్శకుడు. సాయిపల్లవి కథానాయిక. ఏమిగోస్ క్రియేషన్స్, సోనాలి నారంగ్ సమర్పణలో శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్.ఎల్.పి పతాకంపై నారాయణ్‌దాస్ కె నారంగ్, పి రామ్మోహన్‌రావు నిర్మిస్తున్నారు. ప్రేమికుల రోజు సందర్భంగా శుక్రవారం ఒక నిమిషం నిడివితో కూడిన 'ఏయ్ పిల్లా' అనే వీడియో గీతాన్ని చిత్రబృందం విడుదలచేసింది. ఇందులో సాయిపల్లవి నాగచైతన్యకు ముద్దు ఇవ్వడంతో అతడు ఉద్వేగానికి లోనైనట్లుగా చూపించడం ఆకట్టుకుంటున్నది. అతడిని చూసి 'ఏంది ముద్దు పెడితే ఏడుస్తారా అబ్బా' అంటూ సాయిపల్లవి చెప్పే డైలాగ్ హృద్యంగా ఉంది. 'సున్నితమైన కథాంశంతో తెరకెక్కుతున్న అందమైన లవ్‌స్టోరీ ఇది. సహజత్వాన్ని ప్రతిబింబిస్తూ వైవిధ్యంగా ఉంటుంది. వేసవిలో విడుదల చేయబోతున్నాం. చివరి షెడ్యూల్ చిత్రీకరణ జరుగుతున్నది' అని నిర్మాతలు తెలిపారు. రాజీవ్ కనకాల, ఈశ్వరీరావు, దేవయాని ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: విజయ్.సి.కుమార్, సంగీతం: పవన్ సీహెచ్.



## 'అంధాదున్' రీమేక్‌లో నితిన్

బాలీవుడ్‌లో విజయవంతమైన కామెడీ క్రైమ్ థ్రిల్లర్ 'అంధాదున్' తెలుగు రీమేక్‌లో నితిన్ కథానాయకుడిగా నటించబోతున్నారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా వెల్లడించారు. తెలుగు నేటివిటీకి అనుగుణంగా స్క్రిప్ట్‌లో కొన్ని మార్పులు చేశామని, ఈ సినిమాకు మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తారని నితిన్ తెలిపారు. ఆయుష్మాన్ ఖురానా, రాధికాఆప్టే, టబు నటించిన 'అంధాదున్' చిత్రం విమర్శకుల ప్రశంసలందుకోవడమే కాకుండా బాక్సాఫీస్ వద్ద కూడా మంచి విజయాన్ని సాధించింది. ఓ అంధుడైన పియానో ప్లేయర్ అనుకోకుండా ఓ హత్యకు సాక్షిగా నిలిస్తే ఏం జరిగిందన్నదే ఈ చిత్ర కథాంశం.ఈ సినిమాకుగాను ఆయుష్మాన్ ఖురానా ఉత్తమ నటుడిగా జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. ఇదిలావుండగా నితిన్ కథానాయకుడిగా వెంకీ కుడుముల దర్శకత్వంలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న 'భీష్మ' ఈ నెల 21న విడుదలకానుంది.

## ఈస్ట్‌కోస్ట్ ప్రొడక్షన్‌లో..

ఈస్ట్‌కోస్ట్ ప్రొడక్షన్స్ సంస్థ ప్రస్తుతం కీర్తి సురేష్ కథానాయికగా 'మిస్ ఇండియా' చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ బ్యానర్ తెరకెక్కించనున్న నాలుగో చిత్రంలో నాగశౌర్య కథానాయకుడిగా నటించబోతున్నారు. పలు విజయవంతమైన చిత్రాలకు రచయితగా పనిచేసిన రాజా ఈ సినిమా ద్వారా దర్శకుడిగా పరిచయం కానున్నాడు. మహేష్ కోనేరు నిర్మాత. 'వేసవిలో ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభమవుతుంది. వినూత్న కథతో తెరకెక్కించబోతున్నాం. ఈ చిత్రానికి సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల్ని త్వరలో తెలియజేస్తాం' అని నిర్మాత మహేష్ కోనేరు చెప్పారు.


నాగశౌర్య



## ఆసి-సంగీత ప్రేమకథ

సాయిధరమ్‌తేజ్ సోదరుడు వైష్ణవ్‌తేజ్ కథానాయకుడిగా అరంగేట్రం చేస్తున్న చిత్రం 'ఉప్పెన'. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ పతాకాలపై నవీన్ ఏర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. సుకుమార్ శిష్యుడు బుచ్చిబాబు సానా దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. కృతిశెట్టి కథానాయిక. ఏప్రిల్ 2న ప్రేక్షకులముందుకురానుంది. శుక్రవారం ప్రేమికులరోజుని పురస్కరించుకొని నాయకానాయికల ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో సముద్రంలో నాటుపడవపై నిల్చొని మాస్‌లుక్‌లో కనిపిస్తున్నారు వైష్ణవ్‌తేజ్. 'ఆసి, సంగీత అనే ప్రేమజంట ప్రయాణానికి అందమైన దృశ్యరూపమిది. లవ్, సెంటిమెంట్, యాక్షన్ హంగులతో మెప్పిస్తుంది' అని చిత్రబృందం తెలిపింది. విజయ్ సేతుపతి, సాయిచంద్, బ్రహ్మాజీ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: శ్యాందత్, ఎడిటర్: నవీన్ నూలి, ఆర్ట్: మౌనికా రామకృష్ణ, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: అనిల్ వై, అశోక్ బండ్రెడ్డి, సీఈఓ: చెర్రీ, సంగీతం: దేవిశ్రీప్రసాద్, కథ, దర్శకత్వం: బుచ్చిబాబు సాన.


ప్రభుసాల్మన్, రానా, విష్ణువిశాల్

## వాస్తవ ఘటనల 'అరణ్య'

'రెండున్నరేళ్ల కష్టానికి ప్రతిఫలమిది. పద్మశ్రీ అవార్డు పొందిన జాదవ్ ప్రియాంక్ అనే వ్యక్తి జీవితం స్ఫూర్తితో అస్సాంలో జరిగిన యథార్థ ఘటనల ఆధారంగా సినిమాను రూపొందించాం' అని అన్నారు రానా. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'అరణ్య'. ప్రభు సాల్మన్ దర్శకుడు. విష్ణువిశాల్ కీలక పాత్రధారి. ఈరోస్ ఇంటర్నేషనల్ సంస్థ నిర్మిస్తున్నది. ఈ చిత్ర టీజర్‌ను గురువారం హైదరాబాద్‌లో చిత్రబృందం విడుదలచేసింది. ఈ సందర్భంగా రానా మాట్లాడుతూ 'ఈ సినిమాతో జీవితం అంటే ఏమిటో తెలిసింది. కథ విని క్యారెక్టర్‌ను అర్థం చేసుకోవడానికి నాకు ఆరు నెలలు సమయం పట్టింది. పర్యావరణంలో మనం ఒక భాగం అని చాటిచెప్పే సినిమా ఇది. మూడు భాషల్లో ఒకేసారి చేయడం ఛాలెంజింగ్‌గా అనిపించింది' అని తెలిపారు. సురేష్‌బాబు మాట్లాడుతూ 'సమాజానికి ఉపయుక్తమైన చిత్రమిది. ప్రకృతిని ఎలా కాపాడుకోవాలనే విషయాన్ని కమర్షియల్ పంథాలో అర్థవంతంగా దర్శకుడు ప్రభుసాల్మన్ తెరపై ఆవిష్కరించారు' అని అన్నారు. 'తెలుగుతో పాటు తమిళంలో 'కాండన్', హిందీలో 'హాథీ మేరే సాథి' పేరుతో ఒకేసారి ఈ సినిమాను రూపొందిస్తున్నాం. అరణ్య పాత్ర కోసం రానా తనను తాను మలచుకున్న తీరు కొత్తగా ఉంటుంది. ప్రత్యేకమైన సినిమాగా నిలుస్తుంది' అని దర్శకుడు చెప్పారు. ఏప్రిల్ 2న ఈ సినిమాను విడుదలచేయనున్నట్లు ఈరోస్ ప్రతినిధులు పేర్కొన్నారు.


'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్' చిత్రంలో పూజాహెగ్డే


రామ్, మాళవికశర్మ

## ఇటలీలో ప్రణయగీతం

రామ్ హీరోగా కిషోర్ తిరుమల దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'రెడ్'. శ్రీ స్రవంతి మూవీస్ పతాకంపై స్రవంతి రవికిషోర్ నిర్మిస్తున్నారు. కృష్ణ పోతినేని సమర్పకుడు. మాళవిక శర్మ, నివేదా పేతురాజ్, అమృత అయ్యర్ కథానాయికలు. ప్రస్తుతం ఇటలీలో పాటల్ని చిత్రీకరిస్తున్నారు. నిర్మాత మాట్లాడుతూ 'యాక్షన్ థ్రిల్లర్ కథాంశమిది. రామ్ ఇప్పటివరకు చేసిన సినిమాలకు పూర్తి భిన్నంగా ఉంటుంది. గోవా, హైదరాబాద్, వైజాగ్‌లలో జరిపిన చిత్రీకరణతో టాకీపార్ట్ పూర్తయింది. ప్రస్తుతం ఇటలీలో రామ్, మాళవిక శర్మలపై రెండు పాటలను తెరకెక్కిస్తున్నాం. ఈ నెల 12 నుంచి టస్కు, ఫ్లొరెన్స్, డోలోమైట్స్ లాంటి అందమైన లొకేషన్స్‌లో షూటింగ్ జరుపుతున్నాం. శోభిమాస్టర్ నృత్యాలను సమకూర్చుతున్నారు. హైదరాబాద్‌లో చిత్రీకరించనున్న మరో పాటతో షూటింగ్ పూర్తవుతుంది. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. రామ్-కిషోర్ తిరుమల కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న హ్యాట్రిక్ చిత్రమిది. మణిశర్మ సంగీతం ప్రధానాకర్షణగా నిలుస్తుంది. ఏప్రిల్ 9న సినిమాను విడుదలచేయనున్నాం' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, ఛాయాగ్రహణం: సమీరెడ్డి, ఆర్ట్:ఎ.ఎస్.ప్రకాష్

## నేను లేని నా ప్రేమగాథ


క్రిష్, అదితి, గాయత్రి, నవీన్‌చంద్ర

నవీన్‌చంద్ర కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'నేను లేని నా ప్రేమకథ'. త్రిషాల ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై కల్యాణ్ కందుకూరి నిర్మిస్తున్నారు. సురేష్ దర్శకుడు. గాయత్రి.ఆర్.సురేష్ కథానాయిక. క్రిష్ సిద్ధిపల్లి, అదితి, రాజారవీంద్ర కీలక పాత్రల్ని పోషిస్తున్నారు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను నిర్మాత దిల్‌రాజు విడుదలచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'ఫస్ట్ లుక్ ఆసక్తిని రేకెత్తిస్తున్నది. విభిన్నమైన ప్రేమకథతో తెరకెక్కిన ఈ చిత్రం పెద్ద విజయాన్ని సాధించాలి' అని తెలిపారు. నిర్మాత మాట్లాడుతూ 'ఇప్పటివరకు వెండితెరపై రాని సరికొత్త ప్రేమకథా చిత్రమిది. ప్రేమలో పడిన ప్రతి ఒక్కరూ కనెక్ట్ అయ్యేలా ఉంటుంది. దిల్‌రాజు మా కాన్సెప్ట్‌ను అభినందిస్తూ ఫస్ట్‌లుక్‌ను విడుదలచేయడం ఆనందంగా ఉంది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుతున్నాం. వేసవిలో సినిమాను విడుదలచేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: ఎస్.కె.ఏ.భూపతి, సంగీతం: జువిన్ సింగ్.

## మన కెమిస్ట్రీ బాగుంటుంది!


కరీనాకపూర్

బాలీవుడ్‌లో హిట్‌పెయిర్‌గా గుర్తింపును సొంతం చేసుకున్నారు అమీర్‌ఖాన్, కరీనాకపూర్. వీరిద్దరి కలయికలో రూపొందిన 'తలాష్', 'త్రీ ఇడియట్స్' చిత్రాలు పెద్ద విజయాల్ని సాధించాయి. ప్రస్తుతం అమీర్‌ఖాన్, కరీనాకపూర్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'లాల్‌సింగ్ చద్దా'. హాలీవుడ్ చిత్రం 'ఫారెస్ట్ గంప్' ఆధారంగా రూపొందుతున్నది. కరీనాకపూర్ ఫస్ట్‌లుక్‌ను శుక్రవారం అభిమానులతో పంచుకున్నారు అమీర్‌ఖాన్. 'ప్రతి సినిమాలో మనిద్దరి మధ్య రొమాంటిక్ కెమిస్ట్రీ బాగుంటుంది' అంటూ వ్యాఖ్యను జోడించారు. ఇందులో అమీర్‌ను కౌగిలించుకొని, ప్రసన్నమైన ముఖంతో కనిపిస్తున్నది కరీనాకపూర్. రాజకీయ, సాంస్కృతిక సంఘటనలకు సాక్షిగా నిలిచిన ఓ వ్యక్తి కథతో ఈ సినిమా రూపుదిద్దుకుంటున్నది. అద్వైత్ చందన్ దర్శకత్వం వహిస్తున్నారు.

## విన్నర్స్ ట్రిప్‌లో ఏం జరిగింది?


సోనా పాటిల్, మహి

మహి, సోనా పాటిల్ జంటగా నటిస్తున్న చిత్రం 'విన్నర్స్ ట్రిప్'. తెలుగు శ్రీను దర్శకుడు. సంపత్‌శ్రీను, కె. లక్ష్మణరావు నిర్మాతలు. ఈ చిత్ర టీజర్‌ను హాస్యనటుడు బాబుమోహన్ ఇటీవల విడుదలచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'చిన్న సినిమాను విడుదలచేయడమే విజయంతో సమానం. ఖచ్చితంగా సక్సెస్ సాధించాలనే తపనతో చిత్రబృందం ఈ సినిమా తీసినట్లుగా కనిపిస్తున్నది' అని అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఎఫ్‌ఎమ్ రేడియో కాంటెస్ట్‌లో గెలిచిన విజేతలందరూ ఒక ట్రిప్‌కు వెళతారు. అక్కడ వారికి ఎలాంటి కష్టాలు ఎదురయ్యాయన్నది ఉత్కంఠను పంచుతుంది' అని పేర్కొన్నారు. గోవాలో జరిపిన సింగిల్ షెడ్యూల్‌లో నలభై రోజుల్లో సినిమాను పూర్తిచేశామని నిర్మాతలు చెప్పారు. కొత్తదనాన్ని నమ్మి చేసిన సినిమా ఇదని నాయకానాయికలు అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అభినవ కృష్ణుడి లీలలు

హీరో రానా సమర్పణలో సురేష్ ప్రొడక్షన్స్, వయాకామ్ 18 మోషన్ పిక్చర్స్ పతాకాలపై రూపొందుతున్న చిత్రం 'కృష్ణ అండ్ హిజ్ లీల'. రవికాంత్ పేరెపు ('క్షణం' ఫేమ్) దర్శకుడు. సిద్ధు జొన్నలగడ్డ, శ్రద్ధాశ్రీనాథ్, సీరత్ కపూర్, శాలిని వడ్నికత్తి నాయకానాయికలుగా నటిస్తున్నారు.మే 1న విడుదలకానుంది. ప్రేమికుల రోజు సందర్భంగా గురువారం ఈ చిత్ర టీజర్‌ను హీరో వెంకటేష్ విడుదల చేశారు. నిర్మాతలు మాట్లాడుతూ 'అభినవ కృష్ణుడు లాంటి ఓ యువకుడి జీవితగమనానికి దృశ్యరూపమిది. పలువురు అందాల భామలతో ప్రేమలో ఉన్న అతడి కథేమిటి? రాంగ్‌టైమ్ రిలేషన్‌షిప్స్ కారణంగా ఎలాంటి సమస్యల్ని ఎదుర్కొన్నాడన్నది ఆసక్తిని పంచుతుంది. సమాజంలో వైరల్ అయినా కొన్ని రూమర్స్ ఆధారంగా సినిమాను తెరకెక్కిస్తున్నాం' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: శ్రీచరణ్ పాకాల, సినిమాటోగ్రఫీ: షానియల్ డియో, సాయిప్రకాష్.యు.


సీరత్‌కపూర్, సిద్ధు

